టాప్ న్యూస్



## దుబాయ్ ఎయిర్‌పోర్టుపై ఇరాన్ భీకర దాడి

### పరుగులు తీసిన ప్రయాణికులు

లెబనాన్‌పై ఇజ్రాయెల్ దాడులు- 41 మంది మృతి

లొంగిపోవడం తప్ప ఇరాన్‌కు మరో మార్గం లేదు: ట్రంప్

వివరాలు 2లో





కంది రామచంద్రారెడ్డి

వీకెండ్ అనాలసిస్

## నారా లోకేష్‌కు పట్టాభిషేకమా?

భారత రాజకీయాల్లో అనూహ్యమార్పులకు సంకేతాలు కనబడుతున్నాయి. నేతల పాత్రలు మారిపోతున్నాయి. రెండు దశాబ్దాలపాటు బీహార్ ను పాలించిన రాజకీయ చాణక్యుడు నితీష్ కుమార్ స్టేట్ పాలిటిక్స్ కు గుడ్ బై చెప్పి జాతీయ రాజకీయ ప్రవేశం చేస్తున్నారు. రెండు మాసాల్లో కేంద్రమంత్రి కానున్నారు. అయితే బీహార్ సమీకరణాలతో ఏపీకి సంబంధం ఉందనే చర్చ మొదలైంది. సౌత్ లో కీలకరాష్ట్రాలు తమిళనాడు, కేరళ, పుదుచ్చేరి ఎన్నికలు ముగిశాక ఏపీలో రాజకీయ పరిణామాలు మారుతాయని, ఏపీ సీఎం చంద్రబాబు ఉప ప్రధాని అవుతారని ఊహాగానాలు చేస్తున్నారు. నారా లోకేష్ ముఖ్యమంత్రి అవుతారని చర్చోపచర్చలు చేస్తున్నారు. గతంలో తెలంగాణలో కేటీఆర్ ముఖ్యమంత్రి అవుతున్నారని, ప్రమాణస్వీకారానికి ముహూర్తం ఫిక్స్ చేశారంటూ మంత్రులు, ఎమ్మెల్యేలు కూడా ప్రకటనలు చేశారు. ఐదారునెలల చర్చ తర్వాత కేసీఆర్ వీటికి ఎండ్ కార్డు వేసేవారు. ఇపుడు ఏపీ రాజకీయాలు తెలంగాణ మోడలా.. బీహార్ మోడలా? అన్న చర్చ ఉంది. బీహార్ మోడల్ అయితే ఏపీలో ముఖ్యమంత్రిగా ఎవరుంటే.. బీజేపీకి వచ్చే ఫాయిదా ఏంటనే చర్చ ఉంది. ఈ క్రమంలో తెరవెనుక ఒప్పందాలు.. వ్యూహాలపై హస్తినలో రాజకీయం హాట్ హాట్ గా ఉంది.

**- తెలంగాణ తాజా రాజకీయాలపై ఏఎన్ఎన్ సీఈవో, సీనియర్ జర్నలిస్ట్ కంది రామచంద్రారెడ్డి వీకెండ్ అనాలసిస్**

ఎడిటోరియల్ పేజీ 4లో

Follow: @ANNTELUGU

08-03-2026

# మహా పత్రిక

ఆదివారం, హైదరాబాద్ సంపుటి- 23 సంచిక- 70 పేజీలు-08 వెల-రూ.6

PUBLISHED FROM HYDERABAD | TIRUPATI REGISTERED NUMBER: APTEL/2003/09316 WWW.EPAPER.MAHAADAILY.COM






# దేశ చరిత్రలో.. సంచలనం

### ఒకేసారి 130 మంది మావోయిస్టులు.. 124 ఆయుధాలు..

సీఎం రేవంత్ రెడ్డి సమక్షంలో లొంగుబాటు..

గణపతి లొంగిపోతే రక్షణ కల్పిస్తాం.. సీఎం రేవంత్ రెడ్డి ప్రకటన

లొంగిన వారికి ఆర్థిక,. ఆరోగ్య భద్రత కల్పిస్తాం.. కేసుల స్థితిని బట్టి ఎత్తివేత అంశాన్ని పరిశీలిస్తాం

కాంగ్రెస్ లో చేరుతానంటే పీసీసీ చీఫ్ ను కలవండి

ఆయుధాలు వీడాల్సిందే.. కేంద్ర హోంమంత్రితో కూడా సమస్యలపై చర్చించా

డీజీపీ శివధర్ రెడ్డితో పాటు పోలీసు అధికారులను అభినందించిన సీఎం

తెలంగాణ స్టేట్ కమిటీ లేదు.. పూర్తిగా లొంగిపోయింది..

ఇతర రాష్ట్రాల్లో మిగిలిన తెలంగాణవారు ఏడుగురే

**హైదరాబాద్, మహా :** మావోయిస్టు లొంగుబాటు పరంపరలో భాగంగా మరో కీలక పరిణామం చోటుచేసుకుంది. సీఎం రేవంత్ రెడ్డి సమక్షంలో 130 మంది మావోయిస్టులు ఆయుధాలతో సహా లొంగిపోయారు. లొంగిపోయిన మావోయిస్టులు ఈ సందర్భంగా పోలీసులకు 124 ఆయుధాలను అప్పగించారు. లొంగిపోయిన వారిలో ముగ్గురు రాష్ట్ర కమిటీ సభ్యులు, ఒక రీజినల్ కమిటీ సభ్యుడు, పది మంది డివిజనల్ కమిటీ సభ్యులు, 46 మంది ఏరియా కమిటీ సభ్యులు, 70 మంది పార్టీ సభ్యులు ఉన్నారు. 130 మందిలో 125 మంది ఛత్తీస్‌గఢ్, నలుగురు తెలంగాణ, ఒకరు ఆంధ్రప్రదేశ్‌కు చెందినవారున్నారు.

మిగతా 2లో

తెలంగాణ కోడలికే

# ఉత్తమ నటి అవార్డు

### ఉత్తమ నటి రష్మిక.. ఉత్తమ నటుడు నాగచైతన్య

చిన్న చిత్రాలకు గద్దర్ అవార్డుల పంట

రాజువెడ్స్ రాంబాయి, దండోరా, ప్రి వెడ్డింగ్ షోకు అవార్డులు

అవార్డుల జాబితాను డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కకు అందించిన దిల్ రాజు, జ్యూరీ

ఉగాది నాడు అవార్డుల అందజేత



**హైదరాబాద్, మహా**

తెలంగాణ ప్రభుత్వం ఆరంభించిన 'తెలంగాణ గద్దర్ ఫిలిమ్ అవార్డ్స్' గత సంవత్సరం విజయవంతంగా జరగ్గా, ఈ సారి కూడా సినీ అభిమానులు హర్షించేలా 2025 సంవత్సరానికి గాను అవార్డులను ఎంపిక చేసి 'తెలంగాణ గద్దర్ ఫిలిమ్ అవార్డ్స్' కమిటీ ప్రత్యేకతను చాటుకుంది. మెయిన్ స్ట్రీమ్ అవార్డ్స్ అధ్యక్షునిగా ప్రముఖ సంగీత దర్శకుడు మణిశర్మ వ్యవహరించారు. షార్ట్ ఫిలిమ్స్, డాక్యుమెంటరీ విభాగానికి కనకమేడల విజయకృష్ణ చైర్మన్ కాగా, పుస్తకాలు సమీక్షల పరిశీలనకు తనికెళ్ళ భరణి చైర్మన్ గా ఉన్నారు. ప్రత్యేక అవార్డుల కమిటీకి తమ్మారెడ్డి భరద్వాజ అధ్యక్షునిగా వ్యవహరించారు. తెలంగాణ ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అవార్డుల ఫలితాలు అందించిన తర్వాత మీడియాకు వెల్లడించారు. ఎక్కువశాతం అవార్డులు చిన్న చిత్రాలనే వరించాయి. తెలంగాణ జీవితాన్ని, సంస్కృతుల్ని ప్రతిబింబించే సినిమాలకు అగ్ర తాంబూలం దక్కింది. రాజు వెడ్స్ రాంబాయి, దండోరా, ది ప్రీ వెడ్డింగ్ షో, కోర్ట్, లిటిల్ హార్ట్స్ చిత్రాలు ఎక్కువ అవార్డులు దక్కించుకున్నాయి.

### ఉత్తమ నటిగా రష్మిక

తెలంగాణ కోడలు రష్మిక ఉత్తమ నటిగా గర్ల్ ఫ్రెండ్ చిత్రానికి ఎంపిక కాగా,

మిగతా 2లో



### దుబాయ్ ఎయిర్‌పోర్టుపై
# ఇరాన్ భీకర దాడి

- పరుగులు తీసిన ప్రయాణికులు
- లెబనాన్‌పై ఇజ్రాయెల్ దాడులు- 41 మంది మృతి
- లొంగిపోవడం తప్ప ఇరాన్‌కు మరో మార్గం లేదు: ట్రంప్



**మహా :** అత్యంత రద్దీగా ఉండే దుబాయ్ అంతర్జాతీయ విమానాశ్రయంపై ఇరాన్ భీకర దాడి చేసింది. మిస్సైల్‌స్‌ను ఇరాన్ నేరుగా దుబాయ్ ఎయిర్‌పోర్ట్‌పై ప్రయోగించడంతో భారీగా పేలుళ్లు సంభవించాయి. ఈ దాడి ధాటికి విమానాశ్రయంలో ఉన్న ప్రయాణికులు ఒక్కసారిగా భయాందోళనకు గురయ్యారు. క్షిపణులు పడిన చోట పెద్ద ఎత్తున మంటలు ఎగసిపడడంతో ఎయిర్‌పోర్ట్ మొత్తం పొగతో నిండిపోయింది. కొన్ని నిమిషాల పాటు అక్కడ ఏం జరుగుతుందనే విషయం తెలియక సిబ్బంది, ప్రయాణికులు ఆందోళన చెందారు. మరోవైపు లెబనాన్‌పై ఇజ్రాయెల్ దాడులు చేయగా 41 మంది మృతి చెందారు. లొంగిపోవడం తప్ప ఇరాన్ కు ప్రత్యామ్నాయం లేదని ట్రంప్ ప్రకటించారు. గల్ఫ్ దేశాల మీద దాడులు చేయడంపై ఇరాన్ అధ్యక్షుడు విచారం వ్యక్తం చేశారు. ఇరాన్‌పై అమెరికా అమెరికా చేపట్టిన 'ఆపరేషన్ ఎపిక్ ఫ్యూరీ' ఉద్ధృతంగా కొనసాగుతోంది. ఈ యుద్ధంలో భాగంగా వారం రోజుల్లో ఇరాన్ భూభాగంలోని 3,000 లక్ష్యాలపై తమ సైన్యం విరుచుకపడినట్లు యూఎస్ సెంట్రల్ కమాండ్ శనివారం ప్రకటించింది.

**డ్రోన్ దాడి.. టన్నెల్స్‌లోకి ప్రయాణికులు**

శనివారం ఉదయం ప్రపంచంలోనే అత్యంత రద్దీగా ఉండే దుబాయ్ అంతర్జాతీయ విమానాశ్రయం లక్ష్యంగా డ్రోన్ దాడి చేసినట్లు అంతర్జాతీయ మీడియాలో వార్తలు వస్తున్నాయి. ఈ ఘటనతో దుబాయ్ నగరం ఒక్కసారిగా దద్దరిల్లింది. విమాన రాకపోకలకు తీవ్ర అంతరాయం కలగడంతో పాటు ప్రయాణికులు ప్రాణభయంతో పరుగులు తీశారు. శనివారం ఉదయం దుబాయ్ నగరంలో పేలుళ్ల శబ్దాలు వినిపించాయి. విమానాశ్రయంపై డ్రోన్ దాడికి సంబంధించిన దృశ్యాలు సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారాయి. డ్రోన్ ఢీకొన్న వెంటనే విమానాశ్రయ ప్రాంతంలో భారీ ఎత్తున పొగ కమ్ముకుంది. అప్రమత్తమైన అధికారులు ఎయిర్ డిఫెన్స్ సిస్టమ్‌స్‌ను యాక్టివేట్ చేశారు. దీంతో భద్రతా కారణాల దృష్ట్యా దుబాయ్ నుంచి వెళ్లే, వచ్చే అన్ని విమానాలను తాత్కాలికంగా నిలిపివేస్తున్నట్లు ఎమిరేట్స్ ఎయిర్‌లైన్స్ ప్రకటించింది. అయితే, పరిస్థితిని సమీక్షించిన అనంతరం కొద్దిసేపటికే ఈ ఆంక్షలను ఎత్తివేసింది.

# దేశ చరిత్రలో సంచలనం

(మొదటిపజీ తరువాయి)



లొంగిపోయిన మావోయిస్టులు ఒక ఇన్సాస్ ఎల్ఎంజీ రైఫిల్, (31) ఏకే47 రైఫిళ్లు, (21) ఇన్సాస్ రైఫిళ్లు, (20) ఎస్ఎల్ఆర్ రైఫిళ్లు, (18) 303 రైఫిళ్లు, 33 ఇతర తుపాకులతో పాటు 5205 బుల్లెట్లను పోలీసులకు అప్పగించారు.ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ, గత కొంత కాలంగా రాష్ట్రంలో మావోయిస్టుల లొంగుబాటు ప్రక్రియ జరుగుతోందని, అందులో భాగంగానే మరోసారి భారీ సంఖ్యలో మావోయిస్టులు లొంగిపోయారన్నారు. మావోయిస్టులు లొంగిపోయేలా కృషి చేసిన డీజీపీ శివధర్ రెడ్డి, ఎస్ఐబీ చీఫ్ సుమతితో పాటు పోలీసుల కృషిని సీఎం రేవంత్ రెడ్డి ఈ సందర్భంగా అభినందించారు. పోలీసులు నక్సలైట్లలో ఒక నమ్మకాన్ని కల్పించారని, లొంగిపోయిన వాళ్లు మంచి జీవితం గడిపేలా ప్రభుత్వం కృషి చేస్తుందని అన్నారు. అహింసా పద్ధతిలోనే బ్రిటీషర్లపై పోరాడి స్వాతంత్ర్యం తెచ్చుకున్న చరిత్ర మనదని, హింస, ఆయుధాలతో పోరాటం ఒక్కటే పరిష్కారం కాదని గాంధీ చాటి చెప్పారని అన్నారు. అణ్వాయుధాలు ఉన్న దేశాలు కూడా ఇవాళ చర్చల ద్వారా సమస్య పరిష్కరించుకుంటున్నాయని, ఇంకా అజ్ఞాతంలో ఉన్న నక్సలైట్లకు విజ్ఞప్తి చేస్తున్నానని, ప్రజలతో మమేకమై కలిసి ప్రజల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకురావాలని కోరారు.మావోయిస్టు అగ్ర నేత ముప్పాల లక్ష్మణ్ రావు అలియాస్ గణపతి కూడా అజ్ఞాతాన్ని వీడి జన జీవన స్రవంతిలోకి రావాలని కోరిన రేవంత్ రెడ్డి ఆయన ఆరోగ్య భద్రతతో పాటు ప్రాణ రక్షణ కూడా కల్పిస్తామని హామీ ఇచ్చారు. లొంగిపోయిన మావోయిస్టులకు పునరావాస ప్యాకేజీతో పాటు ఆరోగ్య భద్రత కార్డు కల్పిస్తామన్న రేవంత్ రెడ్డి నిమ్స్ వంటి ఆస్పత్రుల్లో మెరుగైన వైద్య సేవలు పొందే ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. మావోయిస్టుల హోదాలను బట్టి ప్యాకేజీ కల్పిస్తామని, ఇంటి స్థలం, ఇందిరమ్మ ఇల్లు ఇచ్చేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని తెలిపారు. రాష్ట్రంలో భూమి లభ్యత కష్టంగా ఉన్నందున భూమి ఇవ్వటంపై హమీ ఇవ్వలేనని, రాష్ట్రంలో హింసకు తావులేదని, అక్రమంగా ఆయుధాలు కలిగి ఉంటే సహించేది లేదని పేర్కొన్నారు.

**అమిత్ షాతో చర్చించా..**

కొన్నాళ్ళ క్రితం లొంగిపోయిన దేవ్‌జీ, ఆయన మిత్ర బృందం కొన్ని ప్రతిపాదనలు చేశారన్న సీఎం తమ సమస్యలు పరిష్కరిస్తే లొంగిపోతామని చెప్పారని గుర్తు చేశారు. రాష్ట్ర స్థాయిలో మేం చేయగలిగింది చేస్తామని నక్సలైట్ నేతలతో చెప్పానని, నక్సలైట్ నేతల డిమాండ్లను కేంద్రహోంమంత్రితో చర్చించానని, లొంగిపోయిన వారి మెరుగైన జీవితానికి హామీ ఇవ్వాలని అమిత్ షా సూచించారని అన్నారు. అమిత్ షాతో చర్చల తర్వాత నక్సలైట్ నేతలతో మళ్లీ చర్చించానని, కేంద్రహోంమంత్రితో చర్చల సందేశాన్ని నక్సలైట్ నేతలకు వివరించానని, తమ చర్చల అనంతరం ఒకేసారి 130 మంది మావోయిస్టులు లొంగిపోయారని అన్నారు. ఒకేసారి ఇంతమంది మావోయిస్టులు ఏ రాష్ట్రంలోనూ లొంగిపోలేదని, ఇప్పటివరకు తెలంగాణలో 700 మంది మావోయిస్టులు లొంగిపోయారని వివరించారు.

**నిషేధం ఉన్నా ఒకటే లేకున్నా ఒకటే**

రాష్ట్రంలో మావోయిజం లేదంటున్న ప్రభుత్వం మావోయిస్టులపై విధించిన నిషేధాన్ని ఎత్తి వేస్తుందన్న ప్రశ్నకు స్పందించిన రేవంత్ రెడ్డి మావోయిజమే లేనపుడు నిషేదం ఉన్నా లేకున్నా ఒకటేనని సమాధానం ఇచ్చారు. గాదె ఇన్నయ్య, వరవరరావు లాంటి వారిపై నమోదైన కేసులను ఎత్తి వేస్తారా అని అడుగగా చట్టం పరిధిలో ఉన్న కేసుల విషయంలో ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నా కోర్టులు ఒప్పుకోవని, వారిపై నమోదైన కేసులలో ఉపసంహరించేవి ఉంటే తప్పకుండా ఉపసంహరిస్తామని సీఎం చెప్పారు. గడిచిన రెండేళ్లలో 700కిపైగా వరకు మావోయిస్టులు తెలంగాణలో లొంగిపోయారని డీజీపీ తెలిపారు. ఇటీవలే నలుగురు సెంట్రల్ కమిటీ సభ్యులు లొంగిపోయారని గుర్తు చేశారు. ఇంకా తెలంగాణ నుంచి ఏడుగురు అజ్ఞాతంలో ఉన్నారని, వీరు కూడా జనజీవనంలోకి రావాలని పిలుపు నిచ్చారు.

### తెలంగాణ కోడలికే
# ఉత్తమ నటి అవార్డు

**ఉత్తమ నటి రష్మిక.. ఉత్తమ నటుడు నాగచైతన్య**

చిన్న చిత్రాలకు గద్దర్ అవార్డుల పంట

రాజువెడ్స్ రాంబాయి, దండోరా, ప్రి వెడ్డింగ్ షోకు అవార్డులు

అవార్డుల జాబితాను డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కకు అందించిన దిల్ రాజు, జ్యూరీ

ఉగాది నాడు అవార్డుల అందజేత

(మొదటిపజీ తరువాయి)

ఉత్తమ నటుడుగా నాగచైతన్య తండేల్ చిత్రానికి ఎంపికయ్యారు. రాజు వెడ్స రాంబాయ్' చిత్రం ద్వారా సాయిలు కంపాటి ఉత్తమ దర్శకునిగా ఎన్నికయ్యారు. ఉత్తమ సహాయనటులు కేటగిరీలో 'దండోరా' నుండి శివాజీ, 'యుఫోరియా' ద్వారా భూమిక విజేతలుగా నిలిచారు. బెస్ట్ కమెడియన్ గా 'జిగ్రీస్'లో నటించిన కృష్ణతేజ రెడ్డి, బెస్ట్ చైల్డ్ ఆర్టిస్ట్ గా 'ద గ్రేట్ ప్రీ వెడ్డింగ్ షో'లో నటించిన మాస్టర్ రోహన్ నిలిచారు.

**చిన్న సిన్మాలకు అవార్డుల పంట**

2025' అవార్డ్స్ లో ప్రథమ ఉత్తమ చిత్రంగా 'రాజు వెడ్స్ రాంబాయ్', ద్వితీయ ఉత్తమ చిత్రంగా 'దండోరా', తృతీయ ఉత్తమ చిత్రంగా 'ద గ్రేట్ ప్రీ వెడ్డింగ్ షో' ఎన్నికయ్యారు. జాతీయ సమైక్యతను చాటే చిత్రంగా 'తండేల్' నిలచింది. ఉత్తమ పర్యావరణ చిత్రంగా 'ఈజీడబ్ల్యూఏ', బెస్ట్ డెబ్యూ ఫీచర్ ఫిలిమ్ గా 'లిటిల్ హార్ట్స్' గెలిచాయి. ఉత్తమ వినోదాత్మక చిత్రం కేటగిరీలో ఇచ్చే డాక్టర్ ఎమ్.ప్రభాకర్ రెడ్డి అవార్డును 'సంక్రాంతికి వస్తున్నాం' దక్కించుకుంది. బెస్ట్ స్పెషల్ ఎఫెక్ట్స్ ఫిలిమ్ గా 'మిరాయ్', బెస్ట్ చిల్డ్రన్స్ ఫిలిమ్ గా 'అనగనగా' నిలిచాయి.

**చిరంజీవికి ఎన్టీఆర్ అవార్డు..**
**జయసుధకు అక్కినేని అవార్డు**

ఈ ఏడాదే ఏర్పాటు చేసిన అక్కినేని నాగేశ్వరరావు అవార్డు కోసం ప్రముఖ నటి జయసుధను ఎంపిక చేశారు. డాక్టర్ సి.నారాయణ రెడ్డి అవార్డుకు సుద్దాల అశోక్ తేజను ఎన్నుకున్నారు. రఘుపతి వెంకయ్య అవార్డును రమేశ్ ప్రసాద్, టి.యల్. కాంతారావు అవార్డును ఆర్.నారాయణమూర్తి, నాగిరెడ్డిచక్రపాణి అవార్డును సి.అశ్వనీదత్ అందుకోనున్నారు. బి.యన్. రెడ్డి అవార్డుకు సింగీతం శ్రీనివాసరావు ఎన్నిక కాగా, పైడి జైరాజ్ అవార్డుకు కమల్ హాసన్ ను ఎంపిక చేశారు. యన్టీఆర్ నేషనల్ అవార్డును చిరంజీవికి ప్రదానం చేయనున్నారు. ఉగాది రోజు మార్చి 19వ తేదీన 'తెలంగాణ గద్దర్ ఫిలిమ్ అవార్డ్స్' వేడుక హైదరాబాద్ హైటెక్స్ లో సాగనుంది.

**విజేతల జాబితా...**

ఉత్తమ చిత్రం రాజు వెడ్స్ రాంబాయి
ఉత్తమ నటుడునాగ చైతన్య(తండేల్)
ఉత్తమ నటి రష్మిక మందన్న (ది గర్ల్ ఫ్రెండ్)
ఉత్తమ ద్వితీయ చిత్రం దండోరా
ఉత్తమ తృతీయ చిత్రం ది ప్రీ వెడ్డింగ్ షో
నేషనల్ ఇంటిగ్రిటీ సినిమాతండేల్
స్పెషల్ జ్యూరీ అవార్డులు:
ఎన్టీఆర్ నేషనల్ అవార్డు చిరంజీవి
పైడి జైరాజ్ అవార్డు కమల్ హాసన్
సినారె అవార్డుసుద్దాల అశోక్ తేజ
రఘుపతి వెంకయ్య అవార్డు రమేశ్ ప్రసాద్
అక్కినేని నాగేశ్వరరావు అవార్డు జయసుధ
నాగిరెడ్డి చక్రపాణి అవార్డుఅశ్వనీదత్
బీఎన్ రెడ్డి ఫిల్మ్ అవార్డుసింగీతం శ్రీనివాసరావు
కాంతారావు అవార్డుఆర్.నారాయణమూర్తి
ఉత్తమ సోషల్ మెసేజ్ సినిమా కోర్ట్
ఉత్తమ డాక్యుమెంటరీ యూనిటీ
ఉత్తమ ప్రజాదరణ చిత్రం సంక్రాంతికి వస్తున్నాం
బెస్ట్ ఫీచర్ ఫిల్మ్ పరిచయ దర్శకుడు సాయి మార్తాండ్ (లిటిల్ హార్ట్స్)
ఉత్తమ బాలల చిత్రం అనగనగా
ఉత్తమ సహాయ నటుడు శివాజీ

## పౌల్ట్రీ రంగంలో మహిళలది కీలక పాత్ర

**అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకల్లో పౌల్ట్రీ ఇండియా ప్రతినిధులు**



**హైదరాబాద్, మహా :** దేశ ఆర్థిక వ్యవస్థలో, ముఖ్యంగా పౌల్ట్రీ రంగంలో మహిళలు పోషిస్తున్న పాత్ర అమోఘమని పలువురు ప్రముఖులు కొనియాడారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ఇండియన్ పౌల్ట్రీ ఎక్విప్‌మెంట్ మాన్యుఫాక్చరర్స్ అసోసియేషన్ (ఐపీఈఎంఏ), పౌల్ట్రీ ఇండియా సంయుక్త ఆధ్వర్యంలో శనివారం హైదరాబాద్‌లో ఘనంగా వేడుకలు నిర్వహించారు. పౌల్ట్రీ, దాని అనుబంధ పరిశ్రమల్లో మహిళా పారిశ్రామికవేత్తలు, నాయకుల సంఖ్య పెరుగుతుండటం శుభపరిణామమని ఈ సందర్భంగా వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి విశిష్ట అతిథులుగా చేవెళ్ల మున్సిపల్ చైర్‌పర్సన్ డి. సమత వెంకట రెడ్డి, ఎస్ఆర్ హ్యాచరీస్ ప్రైవేట్ లిమిటెడ్ డైరెక్టర్ సీతా రంజిత్ రెడ్డి, రెయిన్‌బో హాస్పిటల్స్ (బర్త్‌రైట్) చీఫ్ క్లినికల్ న్యూట్రిషనిస్ట్ డాక్టర్ కిరాణ్మయి అడ్డు హాజరయ్యారు. మహిళా సాధికారత, నాయకత్వ లక్షణాలు మరియు ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణంలో పోషకాహార ప్రాముఖ్యతపై వారు తమ అమూల్యమైన అభిప్రాయాలను పంచుకున్నారు. ముఖ్యంగా పౌల్ట్రీ ఉత్పత్తులు ప్రజల ఆరోగ్యానికి ఏ విధంగా తోడ్పడుతున్నాయో డాక్టర్ కిరాణ్మయి వివరించారు. పౌల్ట్రీ ఇండియా అధ్యక్షుడు ఉదయ్ సింగ్ బయాస్ మాట్లాడుతూ, గ్రామీణ ఉపాధి కల్పనలో, పోషకాహార భద్రతలో పౌల్ట్రీ పరిశ్రమ కీలక పాత్ర పోషిస్తోందని తెలిపారు. ఫామ్ మేనేజ్‌మెంట్ నుంచి కార్పొరేట్ నిర్ణయాల వరకు మహిళలు స్ఫూర్తిదాయక నాయకత్వాన్ని ప్రదర్శిస్తున్నారని, వారి విజయాలను గుర్తించి మరింత మందిని ఈ రంగం వైపు ప్రోత్సహించేందుకు పౌల్ట్రీ ఇండియా కట్టుబడి ఉందని ఆయన స్పష్టం చేశారు. ఈ సందర్భంగా పౌల్ట్రీ రంగంలోని మహిళా ప్రతినిధుల విజయగాథలను మరియు వారి అనుభవాలను వెలుగులోకి తెచ్చేందుకు ఐపీఈఎంఏ ప్రత్యేక 'అవుట్‌రీచ్' కార్యక్రమాన్ని ప్రారంభించింది. అదేవిధంగా, హైదరాబాద్ వేదికగా జరగనున్న 18వ ఎడిషన్ 'పౌల్ట్రీ ఇండియా ఎక్స్‌పో 2026' వివరాలను కూడా ఈ వేదికపై ప్రకటించారు. నవంబర్ 24న నాలెడ్జ్ డే నిర్వహిస్తామని, అనంతరం నవంబర్ 25 నుండి 27 వరకు ప్రధాన ఎక్స్‌పో కొనసాగుతుందని నిర్వాహకులు వెల్లడించారు. ఈ అంతర్జాతీయ ప్రదర్శనలో ప్రపంచవ్యాప్తంగా ఉన్న పరిశ్రమల ప్రతినిధులు, సాంకేతిక నిపుణులు, భాగస్వాములు భారీ సంఖ్యలో పాల్గొంటారని పేర్కొంటూ కార్యక్రమాన్ని ముగించారు. ఈ కార్యక్రమంలో ఏం .శ్రీకాంత్, ట్రెజరర్ పౌల్ట్రీ ఇండియా, మరియు పౌల్ట్రీ ఇండియా ప్రతినిధులు పాల్గొన్నారు.

### ఏపీ విజయడైరీలో
# కల్తీ జరుగుతోంది

- ప్రైవేట్ ఫ్రాంచైజీలతోనే ప్రమాదం
- తెలంగాణ రైతులకు అన్యాయం జరుగుతోందని ఆవేదన
- సంచలన ఆరోపణలు చేసిన విజయ డైరీ ఛైర్మన్ గుత్తా అమిత్ రెడ్డి



**హైదరాబాద్, మహా :** తెలంగాణ విజయ డైరీ ఛైర్మన్ గుత్తా అమిత్ రెడ్డి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంపైనా, ఏపీ విజయ డైరీపైనా సంచలన ఆరోపణలు చేశారు. విజయా బ్రాండ్ పేరుతో కల్తీ పాలు నెయ్యి తెలంగాణలో అమ్ముతున్నారని అమిత్ రెడ్డి ఆరోపించారు. గత వైసీపీ ప్రభుత్వం ఏపీలో విజయ బ్రాండ్ ను ఫ్రాంచైజీలు ఇవ్వడం వల్లే ఇలా జరుగుతోందన్నారు. వైసీపీ అధికారంలో ఉన్న సమయంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం విజయ బ్రాండ్‌ను ప్రైవేట్ వ్యక్తులకు ఫ్రాంచైజీలుగా ఇవ్వడం వల్ల తీవ్ర అనర్థాలు జరుగుతున్నాయని అమిత్ రెడ్డి ఆరోపించారు. ముఖ్యంగా మేఘన ఫుడ్స్ అనే సంస్థకు ఫ్రాంచైజీ ఇవ్వగా, వారు గుజరాత్‌లో నెయ్యి తయారు చేసి తెలంగాణలో విక్రయిస్తున్నారని పేర్కొన్నారు. ఈ నెయ్యిలో వెజిటబుల్ ఆయిల్ కలిసినట్లు నేషనల్ డైరీ డెవలప్‌మెంట్ బోర్డ్ (ఎన్ డీడీబీ) నివేదిక ఇచ్చిందని ఆయన వెల్లడించారు. నెలకు సుమారు 100 టన్నుల కల్తీ నెయ్యి హైదరాబాద్ మార్కెట్లో అమ్ముడవుతోందని, దీనిపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు.


**తెలంగాణ పాడి రైతులకు తీరని అన్యాయం**

తెలంగాణ విజయ డైరీకి ఉన్న నమ్మకాన్ని ఆసరాగా చేసుకుని, ఏపీకి చెందిన ప్రైవేట్ యూనియన్లు ఇక్కడ తక్కువ నాణ్యత గల పాలను విక్రయిస్తున్నాయని చైర్మన్ ధ్వజమెత్తారు. పాల ప్యాకెట్లపై ఉన్న క్యూఆర్ కోడ్ స్కాన్ చేస్తే ప్రైవేట్ కంపెనీల వివరాలు వస్తున్నాయని, దీని వల్ల స్థానిక పాడి రైతులకు రావాల్సిన ఆదాయానికి గండి పడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో నెల్లూరు, కర్నూలు యూనియన్లు విజ్ఞప్తి మేరకు విజయ పేరు వాడటం నిలిపివేసినా, కొన్ని ప్రైవేట్ శక్తులు మాత్రం నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నాయని స్పష్టం చేశారు.

**ఏపీ ప్రభుత్వం స్పందించాలి**

డైరీ ఫెడరేషన్ నిబంధనల ప్రకారం ప్రైవేట్ వ్యక్తులు ప్రభుత్వ బ్రాండ్లను వాడుకోవడానికి వీల్లేదని, ఈ విషయమై ఏపీ డైరీకి ఎన్ని లేఖలు రాసినా స్పందన లేదని అమిత్ రెడ్డి అసహనం వ్యక్తం చేశారు. కల్తీ పాలు, నెయ్యి వ్యవహారంపై ప్రస్తుతం ఏపీ అసెంబ్లీలోనూ చర్చ జరుగుతోందని, అక్కడి ప్రభుత్వం వెంటనే దృష్టి సారించాలని డిమాండ్ చేశారు. తెలంగాణ పాడి రైతుల ప్రయోజనాల కోసం తాము ఎంతటి పోరాటానికైనా సిద్ధమని, కల్తీ ఉత్పత్తులను అడ్డుకోవడానికి తనిఖీలు ముమ్మరం చేస్తామని ఆయన హెచ్చరించారు.

# స్టాండ్ విత్ హర్




- మహిళల భద్రత.... ఒక సామాజిక బాధ్యత
- సమాజంలో మహిళల రక్షణ కోసం మగవారే బ్రాండ్ అంబాసిడర్లుగా నిలబడాలి
- తెలంగాణ పోలీస్ మహిళా భద్రతా విభాగం ఆధ్వర్యంలో 'స్టాండ్ విత్ హర్' క్యాంపెయిన్
- పాల్గొని ప్రసంగించిన సీఎం రేవంత్


**హైదరాబాద్, మహా :** సమాజంలో మహిళల రక్షణ కోసం మగవారే బ్రాండ్ అంబాసిడర్లుగా నిలబడాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పిలుపునిచ్చారు. ఫిర్యాదులు, కేసుల నమోదుతో పాటు మహిళల భద్రతను ఒక సామాజిక బాధ్యతగానూ భావించాలన్నారు. ఆడపిల్లలను ఎవరైనా ఇబ్బందికి గురిచేసినప్పుడు నిలబడి ప్రశ్నించే తత్వాన్ని అలవర్చుకోవాలని యువతకు ముఖ్యమంత్రి సూచించారు. వేధింపులను చూసి చూడనట్టు ఉండటం కూడా నేరాన్ని ప్రోత్సహించడమే అవుతుందని హితవుపలికారు. సొంత కుటుంబ సభ్యులకు ఎక్కడైనా వేధింపులు ఎదురైతే ఏ విధంగా స్పందిస్తామో, ఇతర ఆడపిల్లల విషయంలోనూ అదే తీరుగా ఆలోచించాలన్నారు. హైదరాబాద్ జేఎన్‌టీయూ క్యాంపస్ ఆడిటోరియంలో తెలంగాణ పోలీస్ మహిళా భద్రతా విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన "స్టాండ్ విత్ హర్" క్యాంపెయిన్ ప్రారంభ కార్యక్రమంలో పాల్గొన్న ముఖ్యమంత్రి క్యాంపెయిన్ బ్రోచర్‌ను ఆవిష్కరించారు. మహిళల భద్రత, గౌరవం, సమానత్వాన్ని కాపాడడంలో పురుషులు బాధ్యతాయుతమైన పాత్ర పోషించాల్సిన అవసరాన్ని తెలియజేయడమే లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని చేపట్టిన విమెన్ సేఫ్టీ విభాగాన్ని ముఖ్యమంత్రి అభినందించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ, మహిళల భద్రతతో పాటు వారి ఆర్థిక స్వావలంబన కోసం తెలంగాణ ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను వివరించారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని జరుపుకుంటున్న సందర్భంలో కేవలం కార్యక్రమాల నిర్వహణతో బాధ్యత తీరిపోయినట్టు కాదన్నారు. మహిళను శక్తితో పోల్చుతాం. మహిళలను కుటుంబ గౌరవంగా భావిస్తాం. అలాంటిది మహిళలు నిత్యం అభద్రతా భావంతో బయటికి వెళ్లాల్సిన పరిస్థితులు ఉండకూడదని, ఈ దుస్థితిని నివారించేలా మనల్ని మనం సవరించుకోవాల్సిన సమయం వచ్చిందన్నారు. ఒక మహిళ సారథ్యంలో ఉన్న పార్టీ ఇప్పుడు తెలంగాణలో ప్రభుత్వాన్ని నడుపుతోందని, దేశ స్వాతంత్రానికి ముందు, ఆ తర్వాత కూడా మహిళలకు కీలక పదవులు, బాధ్యతలు కట్టబెట్టిన చరిత్ర కాంగ్రెస్ పార్టీకి ఉందన్నారు. తెలంగాణ ఏర్పాటులోనూ మహిళలే కీలకంగా వ్యవహరించారని సీఎం గుర్తు చేశారు. మహిళల శక్తి సామర్థ్యాల పట్ల మా ప్రభుత్వానికి బలమైన నమ్మకం ఉందని, ప్రస్తుతం తెలంగాణ పోలీస్ శాఖలోని కీలక విభాగాలకు, ప్రభుత్వంలోని ముఖ్యమైన శాఖలకు మహిళలే అధికారిణులుగా ఉన్నారన్నారు. ఆడబిడ్డలు సామాజికంగా, ఆర్థికంగా బలోపేతమైతేనే ఆ రాష్ట్రం లేదా దేశం పురోగతి సాధించినట్టుగా భావించాలని, తెలంగాణలో ఓవైపు మహిళా భద్రతకు ప్రాధాన్యం ఇస్తూనే, ఆర్థిక స్వావలంబన దిశగా మహిళ కోసం అనేక పథకాలు అమలు చేస్తున్నామని పేర్కొన్నారు. ఇందిరమ్మ ఇండ్లు, వడ్డీలేని రుణాలు మహిళల పేరుమీదే ఇస్తున్నామని, సోలార్ విద్యుత్ ఉత్పత్తి కేంద్రాలకు, ఆర్టీసీ బస్సులకు వారిని యజమానులుగా చేస్తున్నామని పేర్కొన్నారు.. తెలంగాణ గ్రామీణ మహిళలు తయారు చేసే ఉత్పత్తులను అంతర్జాతీయంగా విక్రయించేలా అమెజాన్ వంటి సంస్థలతో ఒప్పందాలు చేసుకున్నామని, మహిళా యూనివర్సిటీకి వీరనారి చాకలి ఐలమ్మ పేరు పెట్టుకున్నామని గుర్తు చేశారు. తెలంగాణ రాష్ట్రానికి ఆడబిడ్డనే స్ఫూర్తిగా ఉండాలని 'తెలంగాణ తల్లి' మూర్తులను ప్రతిష్టించుకున్నామన్నారు.

### సికింద్రాబాద్ లో టాస్క్ ఫోర్స్ మెరుపు దాడులు
# భారీగా కల్తీ అల్లం పేస్ట్ సీజ్



**హైదరాబాద్, మహా :** ప్రాణాంతక రసాయనాలతో అల్లంవెల్లుల్లి పేస్ట్ తయారు చేస్తున్న భారీ నెట్ వర్క్‌ను సికింద్రాబాద్ జోన్ టాస్క్‌ఫోర్స్ మరియు లాల్లాగూడ పోలీసులు శనివారం రట్టు చేశారు.ఈ దాడిలో తయారీదారులతో పాటు భారీగా ఉన్న కల్తీ అల్లం నిల్వలను స్వాధీనం చేసుకున్నారు. లాలపేటలోని జనప్రియ అపార్ట్ మెంట్‌లో ఉన్న ఝాన్సీ అల్లం వెల్లుల్లి పేస్ట్ గోడౌన్‌పై టాస్క్ ఫోర్స్ టీమ్ ఆకస్మిక దాడి నిర్వహించింది. ఈ తనిఖీల్లో నాణ్యత లేని ముడి పదార్థాలతో పాటు ప్రమాదకరమైన రసాయనాలను కలిపి అల్లం వెల్లుల్లి పేస్ట్ తయారు చేస్తున్నట్లు గుర్తించింది. ఈ కేంద్రాన్ని నడుపుతున్న నీలా వెంకటేశ్వర్లుతో పాటు మరో ముగ్గురిని అరెస్ట్ చేశారు. అత్యంత హానికరమైన ఎసిటిక్ యాసిడ్, శాంతన్ గమ్ వంటి కెమికల్‌స్‌ను అల్లంవెల్లుల్లి మిశ్రమంలో కలిపి తయారీ చేస్తున్నట్లు తెలుస్తోంది. ఆకర్షణీయమైన నకిలీ బ్రాండ్ లేబుల్స్‌తో నగరంలోని కిరాణా దుకాణాలకు సరఫరా చేస్తున్నట్లు విచారణలో తేలింది. ఈ మెరుపు దాడుల్లో పోలీసులు ఏకంగా 1,915 కిలోల కల్తీ పేస్ట్‌తో పాటు తయారీకి వాడే యంత్రాలను స్వాధీనం చేసుకున్నారు. భారతీయ న్యాయ సంహిత (బీఎన్ఎస్) సెక్షన్లు 318(4), 275, 223 కింద కఠిన కేసులు నమోదు చేశారు. అపరిశుభ్రమైన వాతావరణంలో.... కుళ్లిన ముడి పదార్థాలతో తయారయ్యే ఇటువంటి కల్తీ పదార్థాల పట్ల జాగ్రత్తగా ఉండాలని అధికారులు హెచ్చరిస్తున్నారు. ఏమాత్రం అనుమానం వచ్చినా వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేయాలని కోరుతున్నారు.

# బాబోయ్ ఎండలు



- మార్చి తొలివారంలోనే హడలెత్తిస్తున్న సూర్యుడు
- ములుగు జిల్లాలో అత్యధికంగా 39 డిగ్రీల ఉష్ణోగ్రత
- హైదరాబాద్‌లోని ఎల్‌బీనగర్‌లో 37.8
- రాబోయే 3 రోజుల్లో మరింత పెరగనున్న తీవ్రత

**హైదరాబాద్, మహా :** రాష్ట్రంలో సూర్యుడు నిప్పులు చెరుగుతున్నాడు. మార్చి మొదటి వారంలోనే వేసవి తీవ్రత కనిపిస్తోంది. ఉదయం నుంచే మొదలవుతున్న సూర్య ప్రతాపం మధ్యాహ్నానికి హడలెత్తిస్తోంది. పగటి, రాత్రి ఉష్ణోగ్రతలు పెరగడంతోపాటు ఉక్కపోత కూడా మొదలైంది. ఇప్పటికే ఎండల మంట తీవ్రంగా ఉండగా రాబోయే మూడు రోజుల్లో రాష్ట్రంలోని కొన్ని ప్రాంతాల్లో తీవ్రత మరింత పెరగనుందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం హెచ్చరించింది. గరిష్ఠ ఉష్ణోగ్రతలు సాధారణం కంటే రెండు నుంచి మూడు డిగ్రీలు అధికంగా నమోదవుతాయని అప్రమత్తం చేసింది. ఆది, సోమవారాలలో ఎండ తీవ్రతకు సంబంధించి ఎల్లో అలెర్ట్ కూడా జారీ చేసింది. ఇక, శనివారం రాష్ట్ర వ్యాప్తంగా 40 డిగ్రీల వరకు పగటిపూట ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ములుగు జిల్లాలో మంగపేట మండలం మల్లూరులో అత్యధికంగా 39 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. ఆదిలాబాద్, జగిత్యాల జిల్లా ధర్మపురిలో 38.9 డిగ్రీల చొప్పున గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. హైదరాబాద్‌లోని ఎల్‌బీనగర్‌లో 37.8, మెహిదీపట్నంలో 37 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. హైదరాబాద్‌లో సాధారణం కంటే 2 డిగ్రీలు అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ఎండ తీవ్రత ఇదే తరహాలో కొనసాగితే వారం రోజుల్లో పగటి ఉష్ణోగ్రతలు 42 డిగ్రీలకు చేరుతాయని వాతావరణ శాఖ అధికారులు చెబుతున్నారు.

## మణుగూరులో ఒకేరోజు..
# ముగ్గురు ప్రముఖ వ్యాపారస్తుల మృతి

### పట్టణంలో విషాద ఛాయలు..




**మణుగూరు, మహా :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మణుగూరు పట్టణంలో ఒకేరోజు ముగ్గురు ప్రముఖ వ్యాపారస్తులు అనారోగ్య కారణాలతో మరణించడం పట్టణ ప్రజలను తీవ్ర దిగ్భ్రాంతికి గురి చేసింది. వ్యాపార రంగంలో తమదైన ముద్ర వేసిన ఈ ముగ్గురు వ్యక్తుల మృతి మణుగూరు పట్టణానికి తీరని లోటుగా మారింది.మణుగూరులో ప్రముఖ మద్యం వ్యాపారిగా గుర్తింపు పొందిన డిఎన్‌సి వెంకన్న అనారోగ్యంతో శనివారం కన్నుమూశారు. ఇటీవలే ఆయన కుమారుడి వివాహం ఘనంగా నిర్వహించబడగా, రెండు రోజులకే ఆయన మృతి చెందడం కుటుంబ సభ్యులు, బంధువులు, స్నేహితులను తీవ్ర విషాదంలో ముంచేసింది.అలాగే మణుగూరులో గిన్నెల వ్యాపారంతో ప్రసిద్ధి చెందిన బేతంచెర్ల కోటయ్య కూడా మరణించారు. ఆయనకు ఇద్దరు కుమారులు బేతంచెర్ల వెంకటేశ్వర్లు, బేతంచెర్ల శ్రీనివాస్ ఉన్నారు. నిజాయితీతో వ్యాపారం నిర్వహిస్తూ, సరళ స్వభావంతో మృతుడు కోటయ్య పట్టణ ప్రజల ఆదరణ పొందారు. ఇంకా మణుగూరులో జెమినీ జ్యువెలరీ బంగారు దుకాణం ఎదురుగా దంచాయ్ (టీ)ను ప్రజలకు పరిచయం చేసిన వ్యక్తిగా పేరుగాంచిన కొండ్రు సీతారామయ్య కూడా కన్నుమూశారు. ఆయన మణుగూరు ప్రజలకు ప్రత్యేకమైన దంచాయ్ రుచిని పరిచయం చేసి మంచి గుర్తింపు పొందారు. ఆయనకు ముగ్గురు కుమారులు అశోక్, గౌతమ్, కిరణ్ ఉన్నారు. మణుగూరు పట్టణంలో వ్యాపార రంగానికి సేవలు అందించిన ఈ ముగ్గురు ప్రముఖుల మృతి వ్యాపార వర్గాలను, స్థానిక ప్రజలను తీవ్ర దిగ్భ్రాంతికి గురి చేసింది. వారి సేవలను, స్నేహపూర్వక స్వభావాన్ని ప్రజలు ఎప్పటికీ గుర్తుంచుకుంటారని పలువురు పేర్కొన్నారు.మణుగూరు ప్రజలు, వ్యాపారస్తులు ఈ ముగ్గురు ప్రముఖుల ఆత్మలకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తూ, వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ముగ్గురి మృతదేహాలను పలువురు ప్రముఖులు, రాజకీయ నాయకులు సందర్శించి సంతాపం వ్యక్తం చేశారు.

# యువతలో జాతీయ అవగాహనకు వేదికగా..

### విక్షిత్ భారత్ యూత్ పార్లమెంట్.. మణుగూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సన్నాహక సమావేశం..




**మణుగూరు, మహా :**మణుగూరు: యువతలో జాతీయ చైతన్యాన్ని పెంపొందించి దేశ అభివృద్ధిపై చర్చించే వేదికగా విక్షిత్ భారత్ యూత్ పార్లమెంట్ కార్యక్రమం నిలుస్తుందని మణుగూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ దొడ్డి భద్రయ్య తెలిపారు. ఈ కార్యక్రమానికి సంబంధించిన సన్నాహక సమావేశం శుక్రవారం కళాశాలలో నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ భద్రయ్య మాట్లాడుతూ విక్షిత్ భారత్ 2047 లక్ష్యాన్ని సాధించడానికి యువతలో సృజనాత్మక ఆలోచనలు, నాయకత్వ లక్షణాలు పెంపొందించాల్సిన అవసరం ఉందన్నారు. యూత్ పార్లమెంట్ ద్వారా విద్యార్థులు జాతీయ స్థాయి చర్చల్లో పాల్గొనే అవకాశం లభిస్తుందని చెప్పారు. సోషల్ సైన్సెస్ ఇంచార్జ్ డాక్టర్ రమేష్‌బాబు మాట్లాడుతూ యూత్ పార్లమెంట్ ద్వారా విద్యార్థులు పౌర బాధ్యతలను అర్థం చేసుకొని దేశ అభివృద్ధికి సంబంధించిన కీలక అంశాలపై చర్చించగలరన్నారు. ఈ కార్యక్రమానికి ప్రధాన ఇతివృత్తంగా 50 సంవత్సరాల అత్యవసర పరిస్థితి: భారత ప్రజాస్వామ్యానికి పాఠాలు.. అంశాన్ని ఎంపిక చేసినట్లు తెలిపారు. ఈ అంశంపై విద్యార్థులు చర్చలు జరిపి ప్రజాస్వామ్య వ్యవస్థ బలోపేతానికి యువత పాత్ర ఎంత ముఖ్యమో అవగాహన పొందాలని సూచించారు. కార్యక్రమం కోఆర్డినేటర్ డాక్టర్ పొక్కిలి భాస్కర రావు మాట్లాడుతూ భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో మణుగూరు డిగ్రీ కళాశాలకు విక్షిత్ భారత్ యూత్ పార్లమెంట్ కార్యక్రమం లభించడం సువర్ణావకాశమన్నారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని భారత పార్లమెంటు వ్యవస్థ పనితీరు, విధివిధానాలను తెలుసుకొని భవిష్యత్ భారత నిర్మాణంలో భాగస్వాములు కావాలని కోరారు. అలాగే కళాశాల సిబ్బంది, విద్యార్థులు ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో స్థానిక వార్డు కౌన్సిలర్ శ్రీమతి మానస, కళాశాల వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ వాలియా, అధ్యాపకులు వీణ, డాక్టర్ అశోక్ శివకుమార్, డాక్టర్ సాంబమూర్తి, నాగిరెడ్డి, సువర్ణ, సతీష్, శ్రీకళ, నవీన్, స్నేహ పాల్గొన్నారు. అలాగే అధ్యాపకేతర సిబ్బంది తలక్ ఆరా, కవిరాజ్, పద్మతో పాటు విద్యార్థిని, విద్యార్థులు హాజరయ్యారు.

# గర్భాశయ క్యాన్సర్ నివారణకు హెచ్‌పీవీ టీకా..



**మణుగూరు, మహా :** గర్భాశయ క్యాన్సర్ నివారణకు ఉపయోగపడే హెచ్‌పీవీ టీకా తెలంగాణ రాష్ట్రంలో ప్రారంభమైన నేపథ్యంలో మణుగూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని పాఠశాలల్లో విద్యార్థినులకు ఈ టీకా ఇవ్వనున్నట్లు మండల వైద్యాధికారి డాక్టర్ సునీల్ తెలిపారు. శనివారం ఈ మేరకు గాంధీ బొమ్మ సెంటర్ ఉన్నత పాఠశాలలో విద్యార్థినులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. పాఠశాలకు వెళ్లే విద్యార్థినులతో పాటు పాఠశాలకు వెళ్లని 14 సంవత్సరాలు నిండిన, 15 సంవత్సరాలలోపు ఉన్న ఆడపిల్లలందరికి ఈ టీకా అందించనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా తల్లిదండ్రులు తమ పిల్లలకు ఎలాంటి భయాలు లేకుండా గర్భాశయ క్యాన్సర్ నివారణ కోసం చిన్నారులకు ఈ టీకాను వేయించాలని ఆయన సూచించారు. ఈ సందర్భంగా మండల విద్యాధికారి స్వర్ణ జ్యోతి మాట్లాడుతూ.. బాలికల ఆరోగ్య రక్షణ కోసం ప్రభుత్వం చేపట్టిన ఈ కార్యక్రమాన్ని అందరూ ఉపయోగించుకోవాలని కోరారు. మణుగూరు ఏరియా ఆసుపత్రి గుట్ట మల్లారం వద్ద మార్చి 8న జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా హెచ్‌పీవీ టీకా కార్యక్రమాన్ని ప్రారంభించనున్నట్లు అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రజారోగ్య నర్సు సత్తెమ్మ, ఆరోగ్య కార్యకర్తలు అనసూయ, స్వరూప రాణి, రాంప్రసాద్, కృష్ణ, ప్రభావతి తదితరులు పాల్గొన్నారు.



# బాబోయ్ కోతులు...

### భయంతో వణుకుతున్న రోగులు

**చర్ల, మహా:** చర్ల ప్రభుత్వ ఆసుపత్రిలో కోతుల బీభత్సం సృష్టిస్తున్నాయి.ఆ ఆసుపత్రికి వెళ్లాలంటే రోగులు, రోగుల బంధువులు భయంతో వణుకుతున్నారు. పంచాయతీ పారిశుద్ధ్యం అధికారుల నిర్లక్ష్యంపై వారు మండిపడుతున్నారు . ఇప్పటికైనా చర్ల పంచాయతీ పాలకవర్గం, పంచాయతీ అధికారులు దృష్టి సారించి తక్షణమే కోతుల నియంత్రణకు చర్యలు తీసుకోవాలని రోగులు, మండల ప్రజలు కోరుతున్నారు.

# ఉచిత వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి

- కొత్తగూడెం శాసనసభ్యులు కూనంనేని సాంబశివరావు
- ప్రజలకు మెరుగైన వైద్య సేవలందించేందుకు ఉచిత వైద్య శిబిరాలు
- జిల్లా కలెక్టర్ అంకిత్



**భద్రాద్రి కొత్తగూడెం ప్రతినిధి, మహా:** ఉచిత వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు.ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా శనివారం సుజాతనగర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని కొత్తగూడెం శాసనసభ్యులు కూనంనేని సాంబశివరావు, జిల్లా కలెక్టర్ అంకిత్ కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా కొత్తగూడెం శాసనసభ్యులు కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం ఉచిత వైద్య శిబిరాలను పెద్ద ఎత్తున నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో నివసించే ప్రజలకు సమగ్ర వైద్య సేవలు అందించేందుకు ఏర్పాటు చేసిన ఈ శిబిరాలను ప్రజలు పెద్ద ఎత్తున సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఆశా వర్కర్లు అంగన్వాడీ కార్యకర్తలు గ్రామాల్లో ప్రజలకు ఈ వైద్య శిబిరాలపై విస్తృత స్థాయిలో అవగాహన కల్పించి ఎక్కువ మంది ప్రజలు శిబిరాలకు హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. ముఖ్యంగా రక్తపరీక్షలు, కీళ్ల సమస్యలకు సంబంధించిన పరీక్షలు, గుండె సంబంధిత పరీక్షలు వంటి ఆరోగ్య పరీక్షలను ప్రజలు చేయించుకొని తమ ఆరోగ్య పరిస్థితిని తెలుసుకోవాలని సూచించారు.అవసరమైతే రోగులను కొత్తగూడెం ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి రిఫర్ చేసి అక్కడ అందుబాటులో ఉన్న అన్ని ప్రధాన పరీక్షలు నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని వైద్యాధికారులకు సూచించారు. కొత్తగూడెం ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో స్కానింగ్, ఎక్స్‌రే వంటి పరీక్షలు అందుబాటులో ఉన్నందున అవసరమైన వారికి అక్కడ పరీక్షలు నిర్వహించి తగిన చికిత్స అందించాలన్నారు.

**దశలవారీగా ఉచిత వైద్య శిబిరాలు...**

జిల్లా కలెక్టర్ అంకిత్ మాట్లాడుతూ ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా జిల్లాలో ఉచిత వైద్య శిబిరాలను దశల వారీగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సుజాతనగర్, జూలూరుపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో వైద్య శిబిరాలను నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. జిల్లాలో ప్రతిరోజు రెండు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల చొప్పున ఈ వైద్య శిబిరాలు నిర్వహిస్తూ ఈ నెల 31వ తేదీ వరకు కొనసాగించనున్నట్లు తెలిపారు. ఈ వైద్య శిబిరాల్లో జనరల్ మెడిసిన్, ఆర్థోపెడిక్, పీడియాట్రిక్, గైనకాలజీ, డెంటల్, ఆప్తమాలజీ వంటి ఆరు విభాగాలకు చెందిన నిపుణులైన వైద్యులు పాల్గొని ప్రజలకు ఆరోగ్య పరీక్షలు నిర్వహిస్తున్నారని తెలిపారు. శిబిరాలకు వచ్చే రోగులకు అవసరమైన మందులను ఉచితంగా అందజేయడంతో పాటు అవసరమైతే మెరుగైన చికిత్స కోసం పై స్థాయి ఆసుపత్రులకు రిఫర్ చేసే విధంగా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు.ఈ ఉచిత వైద్య శిబిరాలపై ప్రజలకు పెద్ద ఎత్తున అవగాహన కల్పించి ఎక్కువ మంది ప్రజలు ఈ సేవలను వినియోగించుకునేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ సంబంధిత అధికారులకు సూచించారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఈ కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య శాఖ అధికారి తుకారాం రాథోడ్, తాసిల్దార్ ప్రసాద్, మెడికల్ ఆఫీసర్ రమేష్, ఎంపీడీవో భారతి, సంబంధిత శాఖల అధికారులు వైద్య శాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తున్నారు

- సర్పంచ్ మందా నాగరాజు ఉపసర్పంచ్ గుండె వెంకన్న
- మహిళా దినోత్సవం సందర్భంగా మహిళా వార్డు సభ్యులకు మహిళా పంచాయతీ సిబ్బందికి ఘన సన్మానం



**బూర్గంపహాడ్ మహా :** మహిళలు అన్ని రంగాల్లోనూ పురుషులతో సమానంగా రాణిస్తున్నారని సర్పంచ్ మంద నాగరాజు ఉపసర్పంచ్ గుండె వెంకన్నలు అన్నారు. మహిళా దినోత్సవం సందర్భంగా ముందు రోజు శనివారం బూర్గంపహాడ్ గ్రామపంచాయతీ కార్యాలయం ఆవరణలో ఆరుగురు మహిళ వార్డు సభ్యులను ఆరుగురు పంచాయతీ సిబ్బందిని తమ ఆడబిడ్డలుగా భావించి నూతన వస్త్రాలు అందజేసి శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహిళలు తలచుకుంటే ఏదైనా సాధించగలరు. ఒక పురుషుని విజయం వెనుక స్త్రీ ఎప్పుడు ఉంటుంది అలాగే స్త్రీ విజయం వెనుక పురుషుడు ఉంటాడు అనేది వాస్తవమని అన్నారు. పలు ప్రభుత్వ కార్యాలయాలలోనూ మహిళలు పురుషులతో సమానంగా పోటీపడి ఉద్యోగాలు సాధించి ఉన్నత స్థాయిలో ఉంటున్నారని గుర్తు చేశారు అలాగే రాజకీయంలోనూ మహిళలకు ప్రత్యేకంగా రాజ్యాంగం రిజర్వేషన్లు కల్పించిందని ఆ రిజర్వేషన్లు ఆధారంగా మహిళలు రాజకీయాల్లోనూ రాణిస్తున్నారని అన్నారు. ఇంటి పనులు చక్కదిద్దుకుంటూనే సమాజం పట్ల అవగాహన కలిగిన స్త్రీ మూర్తులు అందరి మహిళలకు ప్రత్యేకంగా మార్చి 8వ తేదీన మహిళా దినోత్సవం శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ ఈవో ప్రభాకర్, వార్డు సభ్యులు ,పంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.




# శ్రీ రాగా స్కూల్లో మహిళా దినోత్సవం

**భద్రాద్రి కొత్తగూడెం ప్రతినిధి, మహా:** అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా శ్రీ రాగా ప్లే అండ్ హై స్కూల్ లో శనివారం ప్రత్యేక కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి 52వ డివిజన్ కార్పొరేటర్ బానోత్ కళావతి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమెను స్కూల్ డైరెక్టర్ మల్లారపు కవిత పుష్పగుచ్ఛం శాలువాతో ఘనంగా సన్మానించి సారీని గిఫ్ట్‌గా అందజేశారు. అనంతరం డైరెక్టర్ మల్లారపు కవితని కార్పొరేటర్ బానోత్ కళావతి, ధన్‌రాజ్ దంపతులు ఘనంగా సన్మానించారు.అనంతరం మహిళా ఉపాధ్యాయులు మహిళా పేరెంట్స్ కోసం "సరదా సరదాగా" అనే ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పలు సరదా గేమ్స్ వినోదాత్మక కార్యక్రమాలు నిర్వహించి అందరినీ ఆనందపరిచారు. ఈ సందర్భంగా కార్యక్రమానికి విచ్చేసిన ప్రతి మహిళకు చీరలు, కుంకుమ భరణి, పువ్వులు స్వీట్లు బహుమతిగా అందజేశారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు రాంబాబు, సర్వేశ్వరరావు, రాజ్‌కుమార్, కీర్తి, పుష్పలత, అనుష, శ్రావణి, అన్నపూర్ణ, భువన, సుష్మా, కవిత, రేష్మా విద్యార్థులు, స్కూల్ మేనేజ్మెంట్ స్టాఫ్ పాల్గొన్నారు.

# సింగరేణి అభివృద్ధికి సమన్వయంతో పని చేయాలి

### సింగరేణి చైర్మన్ బుద్ధ ప్రకాష్ జ్యోతి.. బొగ్గు గనులలో చైర్మన్ విస్తృత పర్యటన



**భద్రాద్రి కొత్తగూడెం ప్రతినిధి, మహా:** సింగరేణి సంస్థ అభివృద్ధికి అధికారులు, కార్మికులు సమన్వయంతో పని చేయాలని సింగరేణి చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ బుద్ధ ప్రకాష్ జ్యోతి అన్నారు. శనివారం చైర్మన్ కొత్తగూడెం ఏరియాలోని ఉపరితల భూగర్భ గనులలో పర్యటించారు. అనంతరం ఆయన వికే సిఎం వ్యూ పాయింట్ నుండి వీకే కోల్ మైన్స్ యొక్క భౌగోళిక స్థితిని వికే సిఎం యొక్క ఉత్పత్తి ఉత్పాదకత పనితీరు, భద్రతా చర్యలు, ఉత్పత్తి పరిస్థితులను పరిశీలించారు. గనుల ప్రాంతాలను పరిశీలిస్తూ కార్మికుల పనితీరును, భద్రతా ప్రమాణాలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ గనులలో భద్రతకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని అధికారులకు సూచించారు. కార్మికులు సురక్షితంగా పని చేయడానికి అవసరమైన అన్ని సదుపాయాలు కల్పించాలని తెలిపారు.గనుల ఉత్పత్తి లక్ష్యాలు, భవిష్యత్ ప్రణాళికలు, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం వినియోగంపై వివరించారు. సింగరేణి సంస్థ అభివృద్ధికి అధికారులు కార్మికులు సమన్వయంతో పని చేయాలని కార్మిక సంఘ నాయకులు కూడా సహకరించాలని చైర్మన్ పేర్కొన్నారు. ఉత్పత్తి పెంపు ఖర్చుల తగ్గింపు, పర్యావరణ పరిరక్షణ వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. కార్మిక సంక్షేమం సంస్థకు అత్యంత ముఖ్యమని కార్మికుల ఆరోగ్యం విద్య నివాస సదుపాయాల మెరుగుదలకు సింగరేణి యాజమాన్యం కట్టుబడి ఉందని తెలిపారు. సింగరేణి ప్రాంత అభివృద్ధికి సంస్థ పలు సంక్షేమ కార్యక్రమాలు చేపడుతోందని వెల్లడించారు.పద్మావతి భూగర్భ గనిని సందర్శించి గనియందు బొగ్గు ఉత్పత్తికి వినియోగించే కంటిన్యూస్ మైనర్ ఎల్.హెచ్.డి యంత్రాల పనితీరును అడిగి తెలుసుకున్నారు. తదుపరి అండర్ గ్రౌండ్ మైన్ లోనికి దిగి మ్యాన్ రైడింగ్ సిస్టం, అండర్ గ్రౌండ్ లోని పంపింగ్ స్టేషన్, సబ్ స్టేషన్ కంటిన్యూస్ మైనర్ పని స్థలాలలో సంబంధిత అధికారులతో వీక్షించారు. ఈ కార్యక్రమంలో చైర్మన్ తో పాటు సింగరేణి సంస్థ డైరెక్టర్లు ఎల్.వి.సూర్య నారాయణ, కొప్పుల వెంకటేశ్వర్లు, ఎం.తిరుమలరావురావు, కొత్తగూడెం ఏరియా జనరల్ మేనేజర్ ఎం.షాలేం రాజు, జిఎం ఎన్విరాన్మెంట్ బి.సైదులు, ఏఐటియూసి సెంట్రల్ సెక్రటరీ వి.వెంకట్, కొత్తగూడెం ఏరియా ఐఎన్టీయూసీ వైస్ ప్రెసిడెంట్ ఎండి.రజాక్, అలాగే కొత్తగూడెం ఏరియా ఎస్ ఓ టు జిఎం జీవి కోటిరెడ్డి, ఏరియా ఇంజనీర్ కే.సూర్యనారాయణరాజు, వికేసిఎం ప్రాజెక్ట్ ఆఫీసర్ ఎం.వి. నరసింహారావు, ఏజెంట్ పద్మావతి గని రామ్ భరోస్ మహతో, వికేసిఎం మేనేజర్ రామచంద్ర మురళి, పద్మావతి ఖని మేనేజర్ ఎం.వి. ఎన్ శ్యాం ప్రసాద్, కొత్తగూడెం ఏరియాలోని వివిధ విభాగాల అధిపతులు, అధికారులు, ఉద్యోగులు కార్మిక సంఘాల నాయకులు పాల్గొన్నారు.



# విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో పూరి గుడిసె దగ్ధం

**చర్ల, మహా:** మండలం లోని వద్దిపేట గ్రామంలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్తో పూరి గుడిసే శనివారం దగ్ధమైన సంఘటన చోటుచేసుకుంది. బాధిత కుటుంబ సభ్యులు,ప్రత్యక్ష సాక్షులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.వద్దిపేట గ్రామానికి చెందిన ఊ యిక రాము కడు పేదరికం తో తనకున్న స్థలంలో పూరి గుడిసే వేసుకొని జీవనం వెలదీస్తున్నాడు.శనివారం ఇంట్లో ఎవరు లేని సమయంలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ తో పూరిగుడిసె పూర్తిగా దగ్ధమైంది. కట్టు బట్టలు మినహా దాచుకున్న డబ్బులు, వస్తువులు, సర్టిఫికెట్స్ అన్ని పూర్తిగా కాలిపోయాయి. దీనితో ఆ కుటుంబం అనాధలుగా మారారు. ప్రభుత్వం వెంటనే స్పందించి బాధిత కుటుంబానికి ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలని, ఆర్థికంగా ఆదుకోవాలని బాధిత వ్యక్తులు, గ్రామస్తులు కోరారు. అలాగే మారుమూల చర్ల మండలానికి అగ్నిమాపక కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని మండల ప్రజలు డిమాండ్ చేశారు.

# మావోయిస్టుల పేరుతో వస్తున్న బెదిరింపు లేఖలపై విచారణ జరిపించాలి

### చర్ల పోలీసులకు ఫిర్యాదు చేసిన కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు నల్లపు దుర్గా ప్రసాద్ రావు



**మహా,చర్ల:** మావోయిస్టు ల పేరుతో వస్తున్న బెదిరింపు లేఖ ల పై సమగ్ర విచారణ జరిపించాలి అని కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు నల్లపు దుర్గా ప్రసాద్ రావు చర్ల పోలీసు స్టేషన్ లో శనివారం ఫిర్యాదు చేశారు. మావోయిస్టు పార్టీ సెంట్రల్ ఏరియా కమిటీ సభ్యులు దినేష్ పేరు న నన్ను భయభ్రాంతులకు గురి చేస్తూ హత మారుస్తామని తరచూ మావోయిస్టు పేరున లేఖలు విడుదల కావడంతో తను తన కుటుంబ సభ్యులు భయభ్రాంతులకు గురవుతున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. నాకు సంబంధం లేని విషయాలు ఆ లేఖ లో పేర్కొన్నారు. నాపై తప్పుడు ప్రచారం చేసి అభియోగాలు మోపుతున్నారు. మావోయిస్టు పార్టీ వ్రాసిన లేఖలో విషయాలకు నాకు సంభందం లేదు అని , ఇదే విషయాన్ని పలు సందర్భాలలో బహిరంగంగా తెలపడం జరిగిందన్నారు. ఆయన కూడా మావోయిస్టు పార్టీ పేరుతో తరచూ లేఖలు విడుదల చేస్తూ తనను తన కుటుంబ సభ్యులను భయభ్రాంతులకు గురి చేయడం తగదన్నారు. తక్షణమే మావోయిస్టు పార్టీ లేఖలపై పోలీసులు సమగ్ర విచారణ జరిపించాలని ఆయన కోరారు.



# మహిళలతోనే సమాజాభివృద్ధి

### ఉస్మానియా వైద్య కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్ రాగిణి

**సత్తుపల్లి, మహా:** సమాజ అభివృద్ధిలో మహిళల పాత్ర ఎంతో ముఖ్యం. సంస్కృతి, దేశ నిర్మాణంలో మహిళలు కీలక పాత్ర పోషిస్తున్నరని హైదరాబాద్ ఉస్మానియా మెడికల్ కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ రాగిణి అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం పురస్కరించుకొని విశ్వశాంతి విద్యాలయంలో మహిళలకు రెండు రోజులపాటు ఆటల పోటీలు నిర్వహించారు. ఈ పోటీలలో విజేతలకు ఆమె శనివారం బహుమతులు అందజేశారు. ముగింపు కార్యక్రమంలో విశ్వశాంతి లో కేక్ కట్ చేసి టీచర్లకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... కుటుంబానికి వెన్నెముక అయిన మహిళలు తల్లిగా, కుమార్తెగా, సోదరిగా పిల్లలను ప్రేమతో పెంచి విలువలు నేర్పడం విశేషమన్నారు. పిల్లల వ్యక్తిత్వం, ప్రవర్తన, భవిష్యత్తును తీర్చిదిద్దడంలో తల్లుల పాత్ర ఎంతో గొప్పదని విశ్వశాంతి విద్యాలయం ప్రిన్సిపల్ పసుపులేటి నాగేశ్వరరావు అన్నారు. మహిళలు సమాజంలో ప్రేమ, కరుణ, సహకారం వంటి విలువలను పెంపొందిస్తున్న మహిళలు నాయకులుగా, శాస్త్రవేత్తలుగా, ఉపాధ్యాయులుగా, సామాజిక సేవకులుగా ప్రేరణగా నిలవటం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో విశ్వశాంతి యాజమాన్యం నరుకుళ్ల సత్యనారాయణ, అవినాష్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# గాంధీనగర్–శ్రీరాంపురంలో అడ్వాన్స్ మహిళా దినోత్సవ వేడుకలు




**బూర్గంపహాడ్ మహా :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బూర్గంపాడు మండలం సారపాక పంచాయతీ పరిధిలోని గాంధీనగర్, శ్రీరాంపురం (గోదారమ్మ క్యాంప్ ఏరియా) అంగన్వాడీ కేంద్రాల్లో ఐసీడీఎస్ శాఖ, ఐటీసీ మిషన్ సున్హెర కల్ (ఐజీడీ సంస్థ) ఆధ్వర్యంలో శని వారం నాడు అడ్వాన్స్ మహిళా దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి సారపాక సర్పంచ్ కిషోర్ నాయక్ ముఖ్య అతిథిగా హాజరై మహిళల ప్రాధాన్యతను వివరించారు. గర్భిణీ స్త్రీలు ఆరోగ్యంగా ఉండేందుకు పోషకాహారం, సమతుల ఆహారం తీసుకోవడం ఎంతో అవసరమని సూచించారు. సమాజ అభివృద్ధిలో మహిళల పాత్ర కీలకమని పేర్కొన్నారు.శ్రీరాంపురం అంగన్వాడీ కేంద్రంలో గర్భిణీ స్త్రీల కోసం శ్రీమంతం కార్యక్రమాన్ని నిర్వహించారు. మహిళల కోసం వివిధ ఆటల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. పాల్గొన్న మహిళలందరికీ ప్రోత్సాహక బహుమతులు అందించారు.ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్లు రచన, సులోచనతో పాటు ఐటీసీ మిషన్ సున్హెర కల్ ఐజీడీ సంస్థ కోఆర్డినేటర్లు అభిషేక్, భారత్ పాల్గొన్నారు. గాంధీనగర్ అంగన్వాడీ కేంద్రంలో మహిళలు ఉత్సాహంగా పాల్గొని రక్తహీనత, పోషకాహారం పై నిర్వహించిన అవగాహన కార్యక్రమాన్ని అభినందించారు.

# బంధగిరి నగరంలో మళ్లీ రగిలిన పోడు వివాదం

### ట్రెంచ్ పనులు ఆపిన గిరిజన రైతులు



**పినపాక ,మహా:** పినపాక మండలం బోటుగూడెం గ్రామపంచాయతీ పరిధిలోని బంధగిరి నగరంలో పోడు భూముల వివాదం మరోసారి ఉద్రిక్తతకు దారితీసింది. శనివారం తెల్లవారుజామున అటవీ శాఖ అధికారులు అక్కడికి చేరుకుని పోడు భూముల్లో ట్రెంచ్ (Trench) ఏర్పాట్లు చేసే కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ విషయం తెలిసిన వెంటనే ఆ భూముల్లో సాగు చేసుకుంటున్న గిరిజన పోడు రైతులు పెద్ద సంఖ్యలో అక్కడికి చేరుకొని ట్రెంచ్ పనులను ఆపే ప్రయత్నం చేశారు. పొద్దుపొడవకముందే ప్రారంభమైన ఈ కార్యక్రమం క్రమంగా ఉద్రిక్తతకు దారితీసింది. అటవీ శాఖ అధికారులు తమ విధి నిర్వహణలో భాగంగా ట్రెంచ్ పనులు చేపడుతున్నామని చెప్పగా, పోడు రైతులు తమ పూర్వీకుల నుంచి సాగు చేసుకుంటున్న భూములని వాదిస్తూ పనులను అడ్డుకున్నారు. ఈ నేపథ్యంలో అక్కడ పరిస్థితి ఉద్రిక్తంగా మారింది.ఈ విషయం తెలుసుకున్న ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ తేజస్విని, డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ అరుణ, బీట్ ఆఫీసర్లు సంఘటనా స్థలానికి చేరుకొని సమస్యను చర్చల ద్వారా పరిష్కరించే ప్రయత్నం చేశారు. అయితే పోడు రైతులు తమ భూములను వదులుకునే పరిస్థితి లేదని స్పష్టం చేశారు. తమకు వారం రోజుల సమయం ఇవ్వాలని, ఈలోగా స్థానిక ఎమ్మెల్యేను మరియు జిల్లా కలెక్టర్‌ను కలసి తమ సమస్యను వివరించుకుంటామని అధికారులను వేడుకున్నారు.పరిస్థితి మరింత ఉద్రిక్తంగా మారడంతో అటవీ శాఖ అధికారులు స్థానిక పోలీసులకు సమాచారం అందించారు. దీంతో స్థానిక సీఐ వెంకటేశ్వర్లు, ఎస్ఐ సురేష్ సంఘటనా స్థలానికి చేరుకుని పోడు రైతులతో మాట్లాడి పరిస్థితిని అదుపులోకి తీసుకురావడానికి ప్రయత్నించారు. రైతులు అధికారులను కాళ్లు పట్టుకుని తమ భూములు వదిలేయాలని వేడుకోవడం అక్కడ ఉన్న వారిని భావోద్వేగానికి గురిచేసింది.ఇదిలా ఉండగా అటవీ శాఖ అధికారులు పోడు రైతులు తమ భూములపై హక్కులు ఉన్నట్లు రాతపూర్వకంగా ఆధారాలు ఇవ్వాలని కోరారు. అయితే దీనికి పోడు గిరిజనులు అంగీకరించలేదు. దీంతో వివాదం మరింత తీవ్రరూపం దాల్చింది.ఈ విషయం తెలిసిన వెంటనే సిపిఎం జిల్లా కమిటీ సభ్యుడు నిమ్మల వెంకన్న, సిపిఎం మండల కార్యదర్శి దుబ్బా గోవర్ధన్, తెలంగాణ ఆదివాసి గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి మడివి రమేష్ సంఘటనా స్థలానికి చేరుకుని పోడు రైతుల పక్షాన అటవీ శాఖ అధికారులతో చర్చలు జరిపారు.చర్చల అనంతరం మంగళవారం వరకు గిరిజన రైతులకు సమయం ఇస్తామని అధికారులు తెలిపారు. ఈలోగా తమకు సంబంధించిన సరైన ఆధారాలను లిఖితపూర్వకంగా అందజేయాలని కోరారు. లేదంటే మంగళవారం నుంచి మళ్లీ ట్రెంచ్ పనులు ప్రారంభిస్తామని అటవీ శాఖ అధికారులు స్పష్టం చేశారు.ఈ పరిణామాలతో గిరిజన రైతులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తూ తమ భూములను రక్షించాలని ప్రభుత్వాన్ని కోరుతున్నారు. బంధగిరి నగరంలో పోడు భూముల సమస్య మళ్లీ ఉత్కంఠభరిత పరిస్థితులను సృష్టించింది

# నారా లోకేష్‌కు పట్టాభిషేకమా?

## దేశ రాజకీయాల్లో సరికొత్త మార్పులు




**భారత రాజకీయాల్లో అనూహ్యమార్పులకు సంకేతాలు కనబడుతున్నాయి. నేతల పాత్రలు మారిపోతున్నాయి. రెండు దశాబ్దాలపాటు బీహార్ ను పాలించిన రాజకీయ చాణక్యుడు నితీష్ కుమార్ స్టేట్ పాలిటిక్స్ కు గుడ్ బై చెప్పి జాతీయ రాజకీయ ప్రవేశం చేస్తున్నారు. రెండు మాసాల్లో కేంద్రమంత్రి కానున్నారు. అయితే బీహార్ సమీకరణాలతో ఏపీకి సంబంధం ఉందనే చర్చ మొదలైంది. సౌత్ లో కీలకరాష్ట్రాలు తమిళనాడు, కేరళ, పుదుచ్చేరి ఎన్నికలు ముగిశాక ఏపీలో రాజకీయ పరిణామాలు మారుతాయని, ఏపీ సీఎం చంద్రబాబు ఉప ప్రధాని అవుతారని ఊహాగానాలు చేస్తున్నారు. నారా లోకేష్ ముఖ్యమంత్రి అవుతారని చర్చోపచర్చలు చేస్తున్నారు. గతంలో తెలంగాణలో కేటీఆర్ ముఖ్యమంత్రి అవుతున్నారని, ప్రమాణస్వీకారానికి ముహూర్తం ఫిక్స్ చేశారంటూ మంత్రులు, ఎమ్మెల్యేలు కూడా ప్రకటనలు చేశారు. ఐదారునెలల చర్చ తర్వాత కేసీఆర్ వీటికి ఎండ్ కార్డు వేసేవారు. ఇపుడు ఏపీ రాజకీయాలు తెలంగాణ మోడలా.. బీహార్ మోడలా? అన్న చర్చ ఉంది. బీహార్ మోడల్ అయితే ఏపీలో ముఖ్యమంత్రిగా ఎవరుంటే.. బీజేపీకి వచ్చే ఫాయిదా ఏంటనే చర్చ ఉంది. ఈ క్రమంలో తెరవెనుక ఒప్పందాలు.. వ్యూహాలపై హస్తినలో రాజకీయం హాట్ హాట్ గా ఉంది.**

**- తాజా రాజకీయ పరిణామాలపై ఏఎన్ఎన్ సీఈవో కంది రామచంద్రారెడ్డి వీకెండ్ అనాలసిస్**

WEEKEND ANALYSIS
వీకెండ్ అనాలసిస్

దేశవ్యాప్తంగా అధికార సమీకరణాలు, నాయకత్వ పాత్రలు, ప్రాంతీయ పార్టీల ప్రాధాన్యత.. ఈ మూడు అంశాలు మళ్లీ కొత్త దిశలో పయనిస్తున్నట్లు కనిపిస్తున్నాయి. బీహార్ రాజకీయ చాణక్యుడు నితీష్ కుమార్ రాష్ట్ర రాజకీయాలకు గుడ్‌బై చెప్పి జాతీయ రాజకీయాల్లోకి రావడానికి సిద్ధం కావడం దేశ రాజకీయాల్లో కొత్త చర్చకు దారి తీసాయి. రెండు దశాబ్దాల పాటు బీహార్‌ను పాలించిన నాయకుడు జాతీయ రాజకీయాల్లోకి వస్తే... అది కేవలం బీహార్‌కే పరిమితం కాని పరిణామం. దాని ప్రభావం ఇతర రాష్ట్రాలపై కూడా పడే అవకాశాలు ఉంటాయి.ఈ నేపథ్యంలో ఇప్పుడు మరో ఆసక్తికరమైన చర్చ మొదలైంది. ఏపీలో ముఖ్యమంత్రి మార్పు జరుగుతుందా? నారా లోకేష్ పట్టాభిషేకం జరుగుతుందా? బీహార్ మోడల్ కు ఏపీ రాజకీయాలకు సంబంధం ఉందా? అనే విశ్లేషణలు సాగుతున్నాయి.

బీహార్‌లో నితీష్ కుమార్ జాతీయ రాజకీయాల్లోకి రావడం వల్ల అక్కడి అధికార సమీకరణాలు మారే అవకాశం ఉంది. కేంద్రంలో ఎన్డీయే రాజకీయ వ్యూహంలో భాగంగా ఈ మార్పులు జరుగుతున్నాయన్న విశ్లేషణలున్నాయి. అదే సమయంలో ఏపీలో కూడా ఇలాంటి మార్పులు జరగవచ్చా అనే చర్చ మొదలైంది. చంద్రబాబు, నితీష్ ల వల్లే కేంద్రప్రభుత్వం మూడోసారి నిలబడింది. మోదీ మూడోసారి ప్రధానిగా బాధ్యతలు చేపట్టారు. అయితే నితీష్ అనూహ్యంగా రాజ్యసభకు నామినేషన్ వేయడం వెనుక జరిగిన మథనం ఏపీకి కూడా తాకుతోంది.

ఢిల్లీ రాజకీయాల్లో నిర్ణయాలు తీసుకున్నప్పుడు రాష్ట్రాల సమీకరణాలు కూడా మారుతాయి. ఈ నేపథ్యంలోనే చంద్రబాబు నాయుడు జాతీయ రాజకీయాల్లోకి వెళ్తారా? ఉప ప్రధాని అవుతారా? బీహార్ లో నితీష్ చేసినట్లు తనయుడి కోసం చంద్రబాబు త్యాగం చేస్తారా? నారా లోకేష్ ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా పట్టాభిషేకం చేయడం ఖాయమా? అన్న చర్చలున్నాయి. ఈ చర్చలను వైసీపీ నేతలు బహిరంగంగా చేస్తుండగా, వారు మాట్లాడకముందే మీడియా కథనాల్లో కూడా కనిపించాయి. పలు జాతీయపత్రికల్లోనూ చర్చ జరిగింది. దీంతో అసలు బీజేపీ ఎవరితో ఏ డీల్ చేసుకుందనే చర్చలు జరుగుతున్నాయి.

### లోకేష్‌కు పట్టాభిషేకం?

తెలుగుదేశం పార్టీలో గత కొన్నేళ్లుగా నారా లోకేష్ కీలక నాయకుడిగా ఎదుగుతున్నారు. పార్టీ వ్యవస్థాపకుడు ఎన్.టి.రామారావు తర్వాత చంద్రబాబు నాయుడు పార్టీని ముందుకు నడిపించారు. ఇప్పుడు తదుపరి తరం నాయకత్వం గురించి చర్చ సహజంగానే జరుగుతోంది. లోకేష్ పరిపాలనా అనుభవం పెరుగుతోంది. పార్టీ నిర్మాణంలో కీలక పాత్ర పోషిస్తున్నారు. ఇపుడు చంద్రబాబు కంటే లోకేష్ ఎక్కువ బిజీగా ఉంటున్నారు. పార్టీలోనూ, ప్రభుత్వంలోనూ



లోకేష్ ను కలవాలనుకునేవారు, లోకేష్ ను కలిస్తే పని అయిపోతుందనుకునేవారు పెరిగారు. రెడ్ బుక్ తో క్యాడర్ లో ఆత్మవిశ్వాసం నింపిన లోకేష్ పరిపాలనలోకి వచ్చాక ఎమ్మెల్యేలు, ఎంపీలు, పార్టీ నేతల కుటుంబాలతో మమేకం అవుతూ సరికొత్త సంప్రదాయానికి శ్రీకారం చుట్టారు. ఇది లోకేష్ ఇమేజ్ పెంచింది. జాతీయ మీడియా కూడా ఇపుడు లోకేష్ ఇంటర్వ్యూల కోసం ఎక్కువగా ప్రయత్నిస్తున్నారు. అయితే పరిపాలనాదక్షుడు, దేశంలోని ముఖ్యమంత్రుల్లో సీనియర్ అయిన చంద్రబాబు నాయుడు ఇపుడు రాష్ట్ర రాజకీయాలను తనయుడికి అప్పగించి.. జాతీయ రాజకీయాల్లో ఉండి రాష్ట్రాన్ని చక్కదిద్దుతారా? జాతీయ రాజకీయాల్లోకి చంద్రబాబు లాంటి సీనియర్లు వస్తే మోదీ ఇదే సఖ్యతతో ఉంటారా? అసలు వ్యూహమేంటనే చర్చ జరుగుతోంది. బీహార్ రాజకీయ పరిస్థితులు వేరు. ఏపీ రాజకీయ పరిస్థితులు వేరు. బీహార్ లో ముఖ్యమంత్రి మారితే వెంటనే బీజేపీ చేతికి అధికారం చిక్కుతుంది. ఏపీలో అలా కాదు. చంద్రబాబు జాతీయ రాజకీయాల్లోకి నిజంగా వచ్చినా, ఆయన కుటుంబం చేతిలోనే సీఎం పదవి ఉంటుంది. బిజెపికి ఇందులో వచ్చే ఫాయిదా ఏమీ ఉండదు. పైగా చంద్రబాబు ఢిల్లీకి వస్తే రాజకీయాలు మామూలుగా ఉండవు. ఇవి మోదీకైనా, బీజేపీకైనా పనికొచ్చే వ్యూహం కాదన్న విశ్లేషణ ఉంది. అయితే చంద్రబాబు జైలు నుండి బయటకువచ్చే సమయంలో.. ఏదైనా చర్చ లేదా హామీ ఇచ్చారా? అలాంటి డీల్ ఏమైనా జరిగిందా? అనే అనుమానాలు కూడా కొందరు ఢిల్లీ పెద్దల్లో ఉన్నాయి. అయితే అలాంటి చర్చలు జరిగినా, జరగకపోయినా ఏపీలో లోకేష్ ను సీఎం చేయడం చంద్రబాబు అనుకుంటే జరుగుతుందే తప్ప బీజేపీ అనుకుంటే జరగదన్న నిజం స్పష్టంగా కనబడుతోంది.

### తెలంగాణ మోడల్ – పాత జ్ఞాపకాలు

తెలంగాణ ముఖ్యమంత్రిగా కేసీఆర్ రెండు టర్మ్ లు పనిచేయగా, రెండో టర్మ్ లో ఇలాంటి ప్రచారాలు నెలల తరబడి జరిగాయి. తెలంగాణలో కేటీఆర్ ముఖ్యమంత్రి అవుతారని పెద్దఎత్తున ప్రచారం జరిగింది. మంత్రులు, ఎమ్మెల్యేలు కూడా ఆ విషయంపై బహిరంగంగా మాట్లాడారు. ప్రధాన పత్రికలన్నీ నెలల తరబడి హెడ్ లైన్లతో వార్తలు రాసిన పరిస్థితి. హరీష్ రావుతో సహా మంత్రులందరూ కేసీఆర్ వ్యూహం అర్థం కాక.. కేటీఆర్ సీఎం అయితే తప్పేంటని కొందరు, ముహూర్తం ఎపుడని మరికొందరు, కేటీఆర్ ను వెంటనే సీఎం చేయాలని కూడా కొందరు డిమాండ్లు చేసిన పరిస్థితి ఉంది. కేటీఆర్ సీఎం ప్రమాణస్వీకారానికి ముహూర్తం పెట్టడంతో పాటు కేటీఆర్ శాఖలు, కేటీఆర్ కేబినెట్ ను కూడా ఆరోజుల్లో పత్రికల్లో పతాక శీర్షికలు రాసినా వెంటనే ఖండనలు రాకపోయేవి. పరిస్థితి అదుపుదాటకుండా చూసి.. ఐదారుమాసాల చర్చ తర్వాత కేసీఆర్ వీటికి సున్నితంగా తెరదించేవారు. కేసీఆర్ ఆరోగ్యంపై రకరకాల ప్రచారాలు చేసేవారు. కానీ అవన్నీ కొన్ని నెలల చర్చ తర్వాత మరుగునపడాయి. ఇప్పుడు ఏపీ రాజకీయాలపై వస్తున్న చర్చ ఇదే రకంగా ఉంటుందా? ఇందుకు భిన్నంగా నిజమవుతుందా? అన్నది రానున్నరోజుల్లో తెలుస్తుంది.

### ఇది వ్యూహమా? ప్రచారమా?

వైసీపీ వర్గాలు రాజకీయంగా ఈ అంశాన్ని ప్రచారంగా ఉపయోగిస్తున్నాయా? నిజంగానే తెలిసిన సమాచారాన్ని ప్రచారంలో పెట్టాయా? అన్న ప్రశ్నలకు కాలమే సమాధానం ఇవ్వనుంది. దేశ రాజకీయాల్లో ప్రాంతీయ పార్టీలను కొత్తగా సమీకరించేందుకు బీజేపీ వ్యూహాలు రచిస్తోందనే వాదనలు ఉన్నాయి. అందులో భాగంగా నేతల వారసుల సేఫ్ లాంచింగ్ ప్లాన్ గా చెబుతున్నారు. చంద్రబాబు నాయుడు రాజకీయాల్లో అత్యంత అనుభవం కలిగిన నాయకుల్లో ఒకరు. రాజకీయాల్లో సహనం ఉన్నవారే ఎక్కువ కాలం నిలబడతారు. అని మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజపేయి ఒకసారి అన్నారు. ఈ మాటలు చంద్రబాబు రాజకీయ ప్రయాణాన్ని కూడా గుర్తు చేస్తాయి.

### చంద్రబాబు జాతీయ రాజకీయాల్లోకి?

చంద్రబాబు నాయుడు గతంలో కూడా జాతీయ రాజకీయాల్లో కీలక పాత్ర పోషించారు. 1996లో యునైటెడ్ ఫ్రంట్ ప్రభుత్వ ఏర్పాటులో చంద్రబాబు కీలక పాత్ర పోషించారు. ఆ సమయంలో ఆయనకు ప్రధాని అవకాశం కూడా వచ్చింది. కానీ ఆయన అప్పుడు "పదవులకంటే రాజకీయ స్థిరత్వం ముఖ్యం. అని జాతీయ రాజకీయాల్లోకి రాలేదు. దేవెగౌడ, ఐకే గుజ్రాల్ లను ప్రధానిగా చేయడంలో చంద్రబాబుదే కీలకపాత్ర. అప్పట్లో సీపీఎం నేత జ్యోతిబసుకు కూడా ప్రధాని పదవి ఆఫర్ చేశారు. ప్రస్తుత ఎన్డీఏ ప్రభుత్వం చంద్రబాబు మద్దతుతోనే నిలబడింది. నితీష్ రాజీనామా నేపథ్యంలో చంద్రబాబు పాత్ర వయసురీత్యా చర్చ జరుగుతోంది. జాతీయ రాజకీయాల్లో బాబు కీలక పాత్ర పోషించే అవకాశం ఉందా అనే చర్చ కొనసాగుతోంది. రాజకీయాల్లో శాశ్వతం ఏదీ లేదు. కాలం మారితే మారని దేది లేదు. రాజకీయాల్లో కూడా ఇదే నిజం. ఈ రోజు అధికారంలో ఉన్నవారు రేపు ప్రతిపక్షంలో ఉండవచ్చు. ప్రతిపక్షంలో ఉన్నవారు రేపు అధికారంలోకి రావచ్చు. భవిష్యత్తును ఊహించి రాజకీయ పరిణామాలను అంచనావేసే చంద్రబాబు అడుగులు ఏ విధంగా ముందుకు పడతాయనే ఆసక్తి ఉంది.

### ప్రపంచంపై యుద్ధ ప్రభావం

ప్రపంచ రాజకీయాల్లో ఉద్రిక్తతలు పెరుగుతున్నాయి. ఇరాన్ పై అమెరికా ఒత్తిడి పెరుగుతుండటం, పశ్చిమాసియాలో యుద్ధ వాతావరణం నెలకొనడం వంటి అంశాలు ప్రపంచ రాజకీయ సమీకరణాలను ప్రభావితం చేస్తున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో భారత్ రాజకీయాల్లో కూడా వ్యూహాత్మక మార్పులు జరిగే అవకాశం కనబడుతోంది. ఇరాన్ భౌగోళిక పరిస్థితులు వేరు. వైశాల్యం వేరు. ఇరాన్ పై అమెరికా, ఇజ్రాయెల్ పూర్తిగా విజయం సాధించడం అసాధ్యమన్న చర్చలున్నాయి. ఇరాన్ వైశాల్యపరంగా పెద్ద దేశం కావడంతో పాటు చుట్టూ పర్వతాలు, కొండలుంటాయి. అమెరికా, ఇజ్రాయెల్ కు యుద్ధం చేయడానికి ఎంతో వ్యయమవుతోంది. అమెరికా, మిత్రదేశాలు వేల కోట్లని గాలిలో తగలేస్తున్నాయి. ఇరాన్ ఎడారి కాదు.. అది పర్వతాల చక్రవ్యూహం. లోపలికి వెళ్లడం సులువు. బయటపడటం... అంత ఈజీ కాదు. ఖమేనీని ఖతం చేశారు కానీ.. ఇరాన్ ను ఆధీనంలోకి తీసుకోవడం అంత ఈజీ కాదు. జాగ్రోస్ పర్వతాలు, లోయలు. మండుతున్న ఎడారులు. అమెరికా సైన్యం ఇరాన్ లోకి రావాలనుకుంటే అది ఆర్మీకి నరకద్వారమే. ఎంతసేపూ ఆకాశం నుండి యుద్ధం చేయాల్సిందే. వేలకోట్లు ఖర్చుచేయాల్సిందేనన్న విశ్లేషణలున్నాయి. మొదట ఇరాన్‌లోకి దిగుతాం అని ప్రకటించిన ట్రంప్ ఇపుడు ఇరాన్ లొంగిపోవాల్సిందే అంటున్నాడే తప్ప తమ సైన్యం ఇరాన్ భూభాగంలోకి వెళ్తుందని చెప్పడం లేదు. దుబాయ్‌లో బాంబు పడితే భయం ఒక్క నగరంలో ఆగదు. ప్రపంచానికి వ్యాపిస్తుంది. ఇన్వెస్టర్లు భయపడతారు. టూరిస్టులు పారిపోతారు. వెంటనే గల్ఫ్ షేకులు ట్రంప్ కాలర్ పట్టుకుంటారు అందుకే ఇరాన్ వ్యూహాత్మకంగా కువైట్, దోహా, దుబాయ్ లపై బాంబులతో బెంబేలెత్తిస్తోంది. ఇరాన్ మిసైళ్ళతో కాదు.. ప్రపంచ మార్కెట్ ను కొడుతూ అసలే టారిఫ్ ల సుడిగుండంలో ఉన్న ట్రంప్ కు, ఆర్థిక సంక్షోభంలో ఉన్న అమెరికాకు చుక్కలు చూపిస్తోంది. మొదలుపెట్టారు.. ఇపుడు ఎలా ముగిస్తారన్నది అమెరికా ముందున్న పెనుసవాల్.

### తెలంగాణలో ఆసక్తికర పరిణామం

తెలంగాణలో కూడా ఒక ఆసక్తికర పరిణామం జరిగింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తన సన్నిహితుడిని రాజ్యసభకు పంపడం రాజకీయంగా చర్చకు దారి తీసింది. రాజకీయాల్లో విశ్వాసం, స్నేహం కూడా కీలక పాత్ర పోషిస్తాయని ఈ నిర్ణయం సూచిస్తుంది. 2004లో మొదటిసారి ఎమ్మెల్యే అయిన వేం నరేందర్ రెడ్డి 17 ఏళ్ళుగా ఏ చట్టసభలోనూ అడుగుపెట్టకపోగా, ఇపుడు నేరుగా పెద్దలసభలోకి ప్రవేశిస్తున్నాడు. ప్రస్తుతం దేశ రాజకీయాల్లో జరుగుతున్న పరిణామాలు చూస్తే ఒక విషయం స్పష్టంగా కనిపిస్తోంది. రాబోయే నెలలు భారత రాజకీయాలకు కీలకంగా మారవచ్చు. "చరిత్రను మలిచేది నాయకులు కాదు... కాలమే అని భారతదేశ తొలి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ ఒకసారి అన్నారు. కాలం తెచ్చే మార్పుల కోసం వేచి చూద్దాం

# సంకల్పం సీఎం రేవంత్ రెడ్డి వజ్రాయుధం..

## ముందు చూపుకు కేరాఫ్.. హైదరాబాద్ పచ్చని భవిష్యత్తుకు పునాది.. చెరువులకు పునర్జన్మ..

సంకల్పమే ఆయుధం అయితే.. అసాధ్యాన్ని సుసాధ్యం చేయవచ్చు అని నిరూపిస్తున్నారు సీఎం రేవంత్ రెడ్డి. గుండె ధైర్యం ఆత్మవిశ్వాసం నిండుగా మెండు గా ఉన్న ముఖ్యమంత్రి నిరంతరం ప్రజల క్షేమం కోసం పాటుపడుతున్నారు. సిఎం గొప్ప ఆలోచన ముందుచూపు హైదరాబాద్ నగర భవిష్యత్తునే మార్చి వేస్తున్నది. అక్రమణ.. కబ్జాలకు గురైన చెరువులకు పునర్జన్మ ప్రసాదిస్తున్నారు. జీవం పోస్తున్నారు. అనేక ఏండ్లుగా కబ్జా కోరల్లో చిక్కుకొని విలవిలలాడుతున్న చెరువులు చెర వీడుతున్నాయి.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దూరదృష్టితో పచ్చని సెలయేర్లుగా మారుతున్నాయి. హైడ్రా అనే మందు ద్వారా చెరువులకు ప్రాణం పోస్తున్నారు. తద్వారా చెరువుల స్వరూపమే మారిపోతున్నది. నగర ప్రజలకు ఆహ్లాదకరమైన వాతావరణం చల్లని గాలులు.. పచ్చని చెట్లు కాసేపు సరదాగా సేద తీరేందుకు చక్కని వసతులతో స్వాగతం పలుకుతున్నాయి. రా రమ్మని పిలుస్తున్నాయి..మొత్తానికి హైదరాబాద్ నగర ప్రజలకు పచ్చని భవిష్యత్తుకు ముఖ్యమంత్రి పునాది వేస్తున్నారు. నగర అభివృద్ధి అంటే కేవలం కాంక్రీట్ భవనాలు, విస్తారమైన రోడ్లు మాత్రమే కాదు. పర్యావరణాన్ని కాపాడుతూ నగర జీవనానికి శాశ్వతమైన పునాది వేయడం నిజమైన అభివృద్ధి. అదే బాటలో పయనిస్తూ ముఖ్యమంత్రి వినూత్నంగా నిర్ణయాలు తీసుకుంటున్నారు. హైదరాబాద్ నగర భవిష్యత్తును పచ్చగా తీర్చిదిద్దేందుకు సంకల్పించారు. ఇందులో విజయం సాధిస్తున్నారు. ఏళ్ల తరబడి నిర్లక్ష్యానికి గురైన నగర



చెరువులు కాలక్రమేణా చెత్తకుప్పలుగా మారాయి. అక్రమ కబ్జాలు పెరిగి చెరువుల అసలు స్వరూపం దెబ్బ తిన్నది. నగరానికి ఊపిరితిత్తులుగా ఉండాల్సిన ఈ నీటి వనరులు క్రమంగా కనుమరుగయ్యే పరిస్థితి ఏర్పడింది. ఈ నేపథ్యంలో చెరువులను రక్షించేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేపట్టిన చర్యలు కీలక మలుపు. హైడ్రా అనే సంస్థ రూపకల్పనతోనేచెరువుల కబ్జాలకు చెక్ పడుతుందని ముఖ్యమంత్రి భావించారు. అందుకోసం ప్రత్యేకంగా హైడ్రా ఏర్పాటు చేశారు. హైడ్రా చర్యలతో చెరువులపై సాగిన ఆక్రమణలకు గట్టి చెక్ పడుతుంది. ఇప్పటివరకు 50కి పైగా చెరువులను ఆక్రమణల నుంచి విముక్తి లభించింది. ఇది పర్యావరణ పరిరక్షణలో ఒక మైలురాయి నిలుస్తుంది. వందలాది ఎకరాల భూమిని తిరిగి స్వాధీనం చేసుకోవడం ముఖ్యమంత్రి సంకల్పానికి నిదర్శనం అని చెప్పవచ్చు. ఒకప్పుడు చెత్తకుప్పలు, ముళ్లకంపలతో కనిపించిన ప్రాంతాలు ఇప్పుడు పచ్చని చెట్లతో ఆహ్లాదకర వాతావరణాన్ని సృష్టిస్తున్నాయి. వాకింగ్ ట్రాక్‌లు, విశ్రాంతి ప్రదేశాలు, పిల్లల ఆటస్థలాలు ఏర్పడి చెరువులు ప్రజలకు వినోద కేంద్రాలుగా మారుతున్నాయి. కుటుంబాలతో కలిసి సమయంయు గడిపే పిక్నిక్ స్పాట్లుగా చెరువులు రూపాంతరం చెందుతున్నాయి.ఇది కేవలం అందాల అభివృద్ధి మాత్రమే కాదు. నగర పర్యావరణాన్ని కాపాడే ఒక దీర్ఘకాలిక ప్రణాళిక. చెరువులను సంరక్షించడం ద్వారా భూగర్భ జలాలు పెరగడం, వాతావరణ సమతుల్యత కాపాడడం, ప్రజలకు స్వచ్ఛమైన వాతావరణం అందించడం వంటి అనేక ప్రయోజనాలు ఉన్నాయి. వీటన్నింటికీ ప్రధాన కారణం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీసుకున్న వినూత్న చర్యలు.. సంకల్పమే. హైదరాబాద్ ఔటర్ రింగ్ రోడ్ పరిధిలో 920 చెరువులు ఉన్నాయి. ఇందులో 282 పూర్తిగా మాయమైపోయాయి. కబ్జా అయ్యాయి. 209 చెరువులు పాక్షికంగా ఆక్రమణలో ఉన్నాయి. కుంటలు చెరువుల పేర్లు మాత్రమే మిగిలి ఉన్నాయి. కానీ అక్కడ చెరువులు కుంటలు మాత్రం కనిపించవు.. దారుణంగా ఉండేది గతంలో పరిస్థితి. చెరువుల కబ్జాలు అక్రమణాలు నిరోధించేందుకు చెక్ పెట్టేందుకు ముఖ్యమంత్రి సరికొత్త ఆలోచన చేశారు. అదేంటంటే హైడ్రాను ఏర్పాటు చేయడమే ప్రధాన కారణం. ఈ నేపథ్యంలో 2024 జూలై 19న హైడ్రాను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. కమిషనర్ గా ఏవి రంగనాథ్ ను నియమించారు.అప్పటి నుంచి ఇప్పటి వరకు యాభైకి పైగా చెరువుల్లో ఆక్రమణలను హైడ్రా తొలగించింది. దీంతో 275 ఎకరాల విస్తీర్ణం చెర వీడింది. కబ్జాల తొలగింపుతోనే సరి పెట్టకుండా చెరువుల సుందరీకరణ ఒక ఉద్యమంలా చేపట్టింది. మొదటి దశలో ఆరు చెరువులను రూ.107.77కోట్లతో అద్భుతంగా ఆధునీకరిస్తోంది.

ఏడాది కిందట అంబర్ పేటలో బతుకమ్మ కుంట ప్రాంతాన్ని చూస్తే ఒక పెద్ద చెత్త కుప్పల దిబ్బగా ఉండేది. కబ్జాలు అక్రమణలతో చెరువు నిండిపోయింది. ప్రభుత్వం సహకారంతో హైడ్రా అక్రమణాలను తొలగించింది. గతంలో ఆ ప్రాంతానికి చేరుకోగానే ముక్కుపుటాలు అదిరే దుర్వాసన వచ్చేది. ఇప్పుడు ఆ ప్రాంతం ఒక ఉద్యానవనంలా మారింది. మొదట ఆక్రమణల తొలగింపు పై దృష్టి పెట్టిన హైడ్రా మాదాపూర్ తమ్మిడికుంటలోని ప్రముఖుల చేతుల్లో నుంచి కబ్జాలను తొలగించింది. మాదాపూర్లోని సున్నంచెరువు విస్తీర్ణం 16.41 ఎకరాలకు తగ్గిపోగా ఆక్రమణలు తొలగించిన అనంతరం 30.5 ఎకరాలకు పెరిగింది. ప్రస్తుతం అభివృద్ధి పనులు వేగవంతంగా నడుస్తున్నాయి. ఉప్పల్ నల్లచెరువు కబ్జాలతో 52.5 ఎకరాలకు కుంచించుకుపోగా వాటిని తొలగించడంతో 67.31 ఎకరాలకు చేరుకుంది. సుందరీకరణ పనులు పురోగతిలో ఉన్నాయి. ముఖ్యమంత్రి ప్రత్యేక చొరవ వల్ల హైడ్రా కృషితో కబ్జాలకు గురైన చెరువులు సంతోషంగా చెర వీడుతున్నాయి..

**మొదట బతుకమ్మ కుంటకు సర్కారు జీవం..**

కబ్జా అక్రమనకు గురైన బతుకమ్మ కుంటకు ప్రభుత్వం కొత్త ఊపిరి పోసింది. ఎన్నో సంవత్సరాలుగా నిర్లక్ష్యానికి గురై శోభ కోల్పోయిన ఈ కుంటను పునరుద్ధరించి, సుందరీకరణ పనులు చేపట్టడంతో ప్రాంతం మళ్లీ కళకళలాడుతోంది. స్థానిక ప్రజల భావోద్వేగాలతో ముడిపడి ఉన్న ఈ కుంటను అభివృద్ధి చేయడం ద్వారా ప్రభుత్వం ప్రజల గుండెల్లో ప్రత్యేక స్థానం సంపాదించింది. కుంట చుట్టూ సుందరీకరణ, శుభ్రత, లైటింగ్, రోడ్ల అభివృద్ధి వంటి పనులు చేపట్టి సందర్శకులకు అనుకూలంగా తీర్చిదిద్దారు.. ప్రతి సంవత్సరం బతుకమ్మ పండుగ సందర్భంగా వేలాది మహిళలు ఈ కుంట వద్దకు చేరి పూలతో అలంకరించిన బతుకమ్మలను నిమజ్జనం చేస్తారు. తెలంగాణ ఆడబిడ్డల ఆత్మగౌరవానికి ప్రతీక అయిన ఈ పండుగను గత సంవత్సరం బతుకమ్మ కుంట వద్ద అద్భుతంగా జరుపుకున్నారు మహిళలు. పండుగ సమయంలోనే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆధునీకరించిన బతుకమ్మ కుంటను ప్రారంభించారు.ప్రభుత్వం చేపట్టిన ఈ చర్యతో కేవలం ఒక చెరువు మాత్రమే కాదు, ఒక సంస్కృతికి, ఒక సంప్రదాయానికి జీవం పోసినట్లైంది. హిమాయత్ సాగర్ ఉస్మాన్ సాగర్ జలాశయాల పైభాగాన ఫామ్ హౌస్ లు , హోటళ్ల నిర్మాణాలను హైడ్రా తొలగించింది. అభివృద్ధి పనుల్లో భాగంగా పూర్తి నీటి మట్టం స్థాయి నిర్ధారించి అలుగు నిర్మాణం, హద్దులు వేయడం, పూడికతీత, మురుగు దారిమళ్లింపు చేపడుతున్నారు. ఓపెన్ జిమ్, కుర్చీల ఏర్పాటు, యాంఫీ థియేటర్ల నిర్మాణాలు అదనపు



- గొట్టిముక్కుల బ్రహ్మచారి
9441884389

హంగులుగా మారుతున్నాయి.కూకట్ పల్లి లోని నల్లచెరువు. 14.32 లకు కుంచించుకుపోగా ఆక్రమణల తొలగింపు అనంతరం 2 29.58 ఎకరాలకు చేరుకుంది. సుందరీ కరణ పనులు పూర్తి చేసుకుని ప్రారంభానికి సిద్ధమైంది. మరో రెండు చెరువులకు హైడ్రా పురుడు పోసింది. కొత్త రూపు సంతరించుకున్న పాతబస్తీలోని బముఖ్నుద్దాలా చెరువును సీఎం రేవంత్ రెడ్డి ఆదివారం ప్రారంభించనున్నారు కూకట్ పల్లి నల్లచెరువు సోమవారం ప్రారంభానికి సిద్ధమవుతమంది. సీఎం రేవంత్ రెడ్డి సాహసోపేతంగా తీసుకుంటున్న చర్యల వల్ల చెరువులు ఆధునీకరణ సొంతం చేసుకోవడం రికార్డు అని చెప్పవచ్చు. మొత్తానికి హైదరాబాదులో చెరువుల అభివృద్ధి విప్లవాత్మకంగా చారిత్రాత్మకంగా నిలిచిపోనుంది. భవిష్యత్ తరాలకు పచ్చని పర్యావరణాన్ని అందించడంలో సీఎం ప్రముఖంగా నిలిచిపోతారు. ఇందుకు ముఖ్యమంత్రి కృషి పట్టుదలే మెండుగా ఉండడం సాధ్యమవుతుంది.



## గ్రామాలలో పలుగు పార పట్టిన సర్పంచ్ లు

**కారేపల్లి, మహా :** ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమం లో భాగంగా శనివారం సింగరేణి మండలంలోని సర్పంచ్ పారిశుధ్య కార్యక్రమంలో చురుకుగా పాల్గొన్నారు. పలుగు పారా పట్టిన సర్పంచ్ లు ఆధర్శంగా నిలిచారు. గ్రామపంచాయతీలలో సర్పంచ్లు ,లు వీధులను శుభ్రం చేసే కార్యక్రమంలో పాల్గొన్నారు. వీరితో పాటు ఎంపీడీవో శ్రీనివాసరావు సైతం జతకలిశారు. ఈసందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ పంచాయతీల అభివృద్ధిని ప్రజలే నిర్దేశించుకునే అవకాశం ప్రభుత్వం కల్పించిందన్నారు. ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో తమ గ్రామాలకు కావల్సిన అభివృద్ధి పనులు గుర్తించి సాధించుకోవాలని సూచించారు. ఈకార్యక్రమంలో సర్పంచులు. కార్యదర్శులు. గ్రామస్తులు పాల్గొన్నారు.

# ఆమనగల్లు లయన్స్ క్లబ్ కు అవార్డుల సునామి

- రీజియన్ లో అత్యుత్తమ క్లబ్ గా లయన్స్ క్లబ్ ఆఫ్ ఆమనగల్లు
- ఉత్తమ అధ్యక్షుడిగా లయన్ కే గోవర్ధన్ రెడ్డి
- ఉత్తమ కార్యదర్శిగా గంప శ్రీనివాస్ గుప్తా
- అత్యుత్తమ పిఆర్ఓగా ఎంఏ పాషా



**ఆమనగల్లు, మహా :** లయన్స్ క్లబ్ జిల్లా 320 ఏ రీజియన్ 1లో వైలెట్ రీజియన్ సమావేశం గోవాలోని పనాజీలో రేజింత బై వాచ్ రిసార్ట్ లో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో లయన్స్ క్లబ్ ఆఫ్ ఆమనగల్లు కు అవార్డుల పంట పండిందని క్లబ్ అధ్యక్షుడు గోవర్ధన్ రెడ్డి, క్లబ్ పిఆర్ఓ పాషా తెలిపారు. రీజియన్ చైర్ పర్సన్ లయన్ సంపతి జనార్ధన్ రెడ్డి చేతుల మీదుగా లయన్స్ క్లబ్ ఆఫ్ ఆమనగల్లు కు 12 అవార్డులు లభించాయి. అత్యుత్తమ క్లబ్ గా లయన్స్ క్లబ్ ఆఫ్ ఆమనగల్లు ఎంపికయింది. ఉత్తమ అధ్యక్షుడిగా లయన్ కే గోవర్ధన్ రెడ్డి, ఉత్తమ కార్యదర్శిగా గంప శ్రీనివాసులు, ఉత్తమ కోశాధికారిగా శ్రీనివాస్ రెడ్డి, క్లబ్ అత్యుత్తమ పిఆర్ఓగా ఎమ్ఏ పాషా భాయ్ అవార్డు, ల్యాబ్ టెక్నీషియన్ లయన్ బి. సంపత్ కుమార్ అవార్డు, లయన్స్ క్లబ్ సమన్వయకర్త వీర బొమ్మ బిక్షపతి అవార్డు, పర్మినెంట్ ప్రాజెక్టు, మీల్స్ అండ్ వీల్స్, కంటి వైద్య శిబిరాలు మెగా వైద్య శిబిరాలు ఉత్తమ ఉపాధ్యాయుల సన్మానం గుండె సంబంధిత వైద్య పరీక్షలు చేసినందుకుగాను ఈ అత్యుత్తమ అవార్డులు లభించాయని వారు పేర్కొన్నారు. 2025 2026 సంవత్సరానికి గాను సేవలు అందించినందున రీజియన్ లో అవార్డులకు ఎంపిక చేసిన సిబ్బందికి సభ్యులకు, లయన్స్ క్లబ్ అధ్యక్షుడు కే గోవర్ధన్ రెడ్డి అభినందనలు తెలిపారు. క్లబ్ చేపట్టే సేవా కార్యక్రమాలకు సహకరించిన ప్రతి ఒక్క లయన్ సభ్యులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ మాజీ గవర్నర్లు మల్టిపుల్ ఏరియా లీడర్ సందడి నరేందర్ రెడ్డి, మాజీ గవర్నర్ జి చెన్న కిషన్ రెడ్డి, రామ్ రెడ్డి కంటి ఆసుపత్రి చైర్మన్, మాస్టర్ ఆఫ్ షేర్మని, డాక్టర్ వి దామోదర్ రెడ్డి, రీజియన్ కార్యదర్శి పి వెంకట్ రెడ్డి, చార్టర్ నైట్ చైర్మన్ కండె ఓంకారం, కే రామిరెడ్డి, జిల్లా చైర్మన్లు ఏన్నం హరికాంత్ రెడ్డి, రామచంద్రారెడ్డి, ఎం చంద్రశేఖర్, బి. వెంకటేష్, అర్థం మనోహర్, డాక్టర్ సి వెంకట్ రెడ్డి, విష్ణువాస్ రెడ్డి, లయన్ గీతా నరేందర్ రెడ్డి, లయన్ చెన్న కిషన్ రెడ్డి, పారిజాత, సమన్వయకర్త వీరబ్రహ్మ బిక్షపతి, లయన్ సభ్యులు సంపత్ కుమార్, పిప్పల్ల వెంకటేష్, దూదే రాజేందర్, చేగురి వెంకటేష్, వెంకటస్వామి, గుజ్జరి నరసింహ, కటిక శ్రీనివాస్ రెడ్డి, నరసింహారెడ్డి, యాదయ్య, క్లబ్ పి ఆర్ ఓ పాషా తదితరులు పాల్గొన్నారు.

## సమాజ అభివృద్ధికి మహిళలు ఆదర్శంగా నిలవాలి

**జిల్లా కలెక్టర్ అంకిత్**



**భద్రాద్రి కొత్తగూడెం ప్రతినిధి, మహా:** ఈనెల 8వ తేదీన అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం ఐడిఓసి కార్యాలయం సమావేశ మందిరంలో మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ముందస్తు అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా కలెక్టర్ అంకిత్ ముందుగా జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అంకిత్ మాట్లాడుతూ మహిళల అభివృద్ధికి విద్య ఎంతో కీలకమని అన్నారు. విద్యావంతురాలైన మహిళ అన్ని రంగాల్లో తన ప్రతిభను చాటుకుని ఉన్నత స్థాయికి ఎదగగలదని తెలిపారు. సమాజ పురోగతిలో మహిళల పాత్ర అత్యంత ముఖ్యమని అన్నారు. మహిళల సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం అనేక పథకాలను అమలు చేస్తోందని, వాటిలో చాలా సంక్షేమ కార్యక్రమాలు మహిళల పేరుమీదే మంజూరు చేయబడుతున్నాయని తెలిపారు. ప్రతి రంగంలో మహిళలు ముందుకు వచ్చి తమ సామర్థ్యాలను నిరూపిస్తూ సమాజానికి ఆదర్శంగా నిలవాలని ఆకాంక్షించారు. కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ గణేష్ మాట్లాడుతూ మహిళల పట్ల లింగ వివక్ష తొలగింపు కుటుంబ వ్యవస్థ నుండే ప్రారంభం కావాలని అన్నారు. తల్లిదండ్రుల ఆలోచనా విధానం మారినప్పుడే సమాజంలో సమానత్వం సాధ్యమవుతుందని తెలిపారు. పనిచేసే మహిళలపై ఎటువంటి వేధింపులు జరగకుండా ఉండేలా ప్రభుత్వ కార్యాలయాల్లో ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. మహిళా శిశు సంక్షేమ శాఖ జిల్లా అధికారి స్వర్ణలత లేనినా మాట్లాడుతూ మహిళల సాధికారతకు విద్య, అవగాహన ఆత్మవిశ్వాసం ఎంతో అవసరమని అన్నారు. బాలికల విద్యను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను సమర్థవంతంగా అమలు చేస్తున్నామని తెలిపారు. "బేటీ బచావో - బేటీ పడావో" కార్యక్రమం ద్వారా బాలికల విద్య, భద్రత సంక్షేమంపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని అన్నారు . ప్రతి కుటుంబంలో బాలికలకు సమాన అవకాశాలు కల్పించి వారి ప్రతిభను వెలికితీయాల్సిన బాధ్యత సమాజంపై ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా వివిధ రంగాల్లో ప్రతిభ కనబరిచిన మహిళలను సన్మానించారు. అలాగే ఇటీవల జరిగిన మున్సిపల్ కార్పొరేషన్, పంచాయతీ ఎన్నికల్లో విజయం సాధించిన మహిళా కార్పొరేటర్లు, సర్పంచులు, ఉప సర్పంచులను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ చైర్మన్ పసుపులేటి వీరబాబు, వివిధ శాఖల మహిళా అధికారులు, కార్పొరేటర్లు, మహిళా సర్పంచ్ లు, ఉప సర్పంచ్ లు, మహిళా సంఘాల ప్రతినిధులు, ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు



## పనులు ప్రారంభించిన సర్పంచ్ వీర ప్రతాప్

**కారేపల్లి, మహా :** కారేపల్లిలోని భరత్‌నగర్ కాలనీలోని సింగరేణి ప్రాథమిక పాఠశాలకు మంజూరైన ప్రహరీ పనులను సర్పంచ్ మేదరి వీరప్రతాప్ శనివారం ప్రారంభించారు. పాఠశాల ప్రహరీ గోడకు స్థానికులు ఉపాధ్యాయులు వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్‌నాయక్‌కు విన్నవించటంతో స్పందించిన ఎమ్మెల్యే డీఎంఎఫ్‌టీ నిధుల నుండి కాంపౌండ్ వాల్ కు రూ.5లక్షలు మంజూరు చేయటం జరిగింది. అట్టి నిధులతో పనులు ప్రారంభించారు. ఈకార్యక్రమంలో కార్యదర్శి నెహ్రు, హెచ్ఎం జాకీర్‌బాబా, గ్రామపెద్దలు తలారి దేవప్రకాశ్, మైప నర్సింహా, జిలకర వెంకటాద్రి, బోగిళ్ల వెంకటేశ్వర్లు, వెంటేశ్వర్లు, గొడుగు శ్రీను తదితరులు పాల్గొన్నారు.

## పిల్లలకు వండుతున్న ఆహారంపై శ్రద్ధ లేదా..

**జిల్లా పంచాయతీ అధికారి. సురేష్ మోహన్**



**రాజేంద్రనగర్, మహా ;** ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా శనివారం జిల్లా పంచాయతీ అధికారి సురేష్ మోహన్, డిఎల్పిఓ సతీష్ రెడ్డి, ఎంపీడీవో మున్ని, ఎంపీ ఓ రమేష్ గౌడ్, సర్పంచ్ దేవులపల్లి సునీత సత్యనారాయణ గౌడ్ తో కలిసి పెద్ద షాపూర్ గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలోని పలు విభాగాల గదులను పరిశీలించారు. వంటగది శుభ్రంగా లేకపోవడంతో డిపిఓ సురేష్ మోహన్ అధికారుల తీరుపై మండిపడ్డారు. పిల్లలకు వడ్డించి ఆరపదార్థాలపై ఇంత కూడా శ్రద్ధ లేకపోవడం ఏంటన్నారు. మీ ఇంట్లో వంటగది ఇలాగే ఉంటుందా, వండే వంటగదిని కూడా శుభ్రంగా పెట్టుకోలేకపోయారని, పాఠశాల ప్రధానోపాధ్యాయుడుని నిలదీశారు. మధ్యాహ్న భోజన పథకంలో ఏ ఆహార పదార్థాలు ఇస్తున్నారో వాటి వివరాలను అడిగి తెలుసుకున్నారు. వండిన ఆహార పదార్థాలను పరిశీలించారు. 99 రోజుల ప్రణాళికలో మరోసారి వస్తాను అన్ని శుభ్రంగా ఉంచాలన్నారు. ఈ స్కూల్ పరిసర ప్రాంతాలు వ్యాధులు రాకుండా సౌచాలయం శుభ్రంగా ఉండాలి. త్రాగు నీరుని శుభ్రంగా ఉంచుకోవాలి. పాఠశాలల్లోని పలు తరగతి గదులలో చదువుకుంటున్న విద్యార్థులతో కాసేపు ముచ్చటించారు. ప్రజా పాలనలో ప్రగతి ప్రణాళికలో పాఠశాలలోని ప్రాంగణమంతా శుభ్రంగా ఉంచుకోవాలి, మొక్కలను కాపాడుకోవాలన్నారు. ఎన్ హెచ్ 44 జాతీయ రహదారి నుండి గ్రామంలోకి వెళ్లే దారిలో రోడ్డు విస్తరణ పనులు చేపడుతున్నారు. గ్రామంలోకి వెళ్లే ప్రధాన రహదారిలో ఫ్లై ఓవర్ నిర్మాణం జరుగుతుంది. పెద్ద షాపూర్ గ్రామంలోనికి రోడ్డు దాటుతున్న క్రమంలో మహిళలు, వృద్ధులు, విద్యార్థులకు రోడ్డు ప్రమాదాలు జరిగే ప్రమాదం ఉన్నందున. నేషనల్ హైవే 44 అధికారులతో మాట్లాడి తమ గ్రామానికి అండర్ ఫ్రాస్ నిర్మించాలని జిల్లా పంచాయతీ అధికారి సురేష్ మోహన్ కు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి జితేందర్ రెడ్డి, ఉప సర్పంచ్ తాళ్లపల్లి నందు, గాదే రాజశేఖర్, జగదీష్, ఎల్లని శ్రీధర్ బాబు, కపిల్, ఉదయ్ గౌడ్, పిట్టల సత్యనారాయణ, బోర్ర శేఖర్, కుమార్ తదితరులు పాల్గొన్నారు.



## ఎక్సైజ్ సోదాలు...

- నల్లబెల్లం, పట్టిక స్వాధీనం
- ఒకరిపై కేసు

**ఆమనగల్లు, మహా :** ఆమనగల్లు ఎక్సైజ్ సర్కిల్ పరిధిలో శుక్రవారం రాత్రి అధికారులు, సిబ్బంది మూడు టీంలుగా ఏర్పడి సోదాలు నిర్వహించారు. ఈ సందర్భంగా కడ్తాల్ మండలం వాసుదేవ్ పూర్ సమీపంలోని ఓ కోళ్ల ఫారంలో నిల్వ ఉంచిన నల్ల బెల్లం, పట్టిక భారీ మొత్తంలో నిల్వ ఉంచడంతో దాడులు నిర్వహించి కేసు నమోదు చేసి ఒకరిని అరెస్టు చేసినట్లు ఆమనగల్లు ఎక్సైజ్ సీఐ బద్యానాథ్ చౌహాన్ చెప్పారు. ఈ దాడులలో 10 లీటర్ల సారాను సిజ్ చేసినట్లు సిఐ తెలిపారు. ఎవరైనా నాటుసార, బెల్లం పటిక అమ్మిన అక్రమంగా తరలించిన కఠిన చర్యలు తీసుకుంటామని, తరలించినట్లు గుర్తిస్తే 8712658742, 9000571671, నెంబర్లను సంప్రదించగలరని, సమాచారం అందజేసిన వారి వివరాలు గొప్యంగా ఉంచుతామని పేర్కొన్నారు. దాడులలో ఎస్ఐ అరుణ్ కుమార్, హెడ్ కానిస్టేబుల్ శంకర్, చెన్న గౌడ్, నర్సింహా, రాం రెడ్డి ఉన్నారు.

## పేదల సొంత ఇంటి కలను సాకారం చేస్తాం : ఎమ్మెల్యే కసిరెడ్డి



**ఆమనగల్లు, మహా :** అర్హులైన ప్రతి నిరుపేద సొంత ఇంటి కలను సాకారం చేస్తామని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి చెప్పారు. శనివారం కడ్తాల్ మండలం కొండ్రిగాని బోడు తండాలో నిర్మాణం పూర్తి చేసుకున్న ఇందిరమ్మ ఇండ్లను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగామాట్లాడుతూ.. ఎన్నో ఏళ్లుగా సొంత ఇంటి కోసం ఎదురుచూస్తున్న పేదల కలను కాంగ్రెస్ ప్రభుత్వంసాకారం చేసిందని చెప్పారు.

**ఆమనగల్లు ఆసుపత్రి భవనాన్ని వేగంగా పూర్తి చేయండి**

ఆమనగల్లులో నూతనంగా నిర్మిస్తున్న ప్రభుత్వ కమ్యూనిటీ హెల్త్ సెంటర్ భవన పనులను శనివారం కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి పరిశీలించారు. ప్రభుత్వ ఆసుపత్రిలో 'ప్రజా పాలన -ప్రగతి ప్రణాళిక' కార్యక్రమాన్ని ప్రారంభించారు. నిర్మాణ పనులను వేగవంతం చేసి ప్రజలకు త్వరగా అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో చైర్మన్ పత్య నాయక్, కౌన్సిలర్లు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



## ఆలయ పారిశుద్ధ్య కార్మికుడి కుటుంబానికి ఆచారి సాయం

**ఆమనగల్లు, మహా :** ఆమనగల్లు పట్టణంలోని హనుమాన్ దేవాలయ పారిశుద్ధ్య కార్మికుడు పోషయ్య ఇటీవలప్రమాదవశాత్తు మృతి చెందారు. ఈ క్రమంలో ఆయన కుటుంబానికి ఆలయ కమిటీ తరపున శనివారంరూ. 20,000 ఆర్థిక సాయం అందజేశారు. జాతీయ బీసీ కమిషన్ మాజీ సభ్యుడు ఆచారి ఈ మొత్తాన్ని మృతుడి కుటుంబ సభ్యులకు అందజేసి వారినిపరామర్శించారు. కార్యక్రమంలో శ్రీకాంత్ సింగ్, విజయ్ కృష్ణ, ప్రశాంత్ తదితరులు పాల్గొని సానుభూతి తెలిపారు.

## గ్రామ పంచాయతీ వార్డు సభ్యులకు శిక్షణ తరగతులు పూర్తి

**ధృవపత్రాలు అందజేత...**

**రాజేంద్రనగర్, మహా ;** శంషాబాద్ మండలంలోని గ్రామ పంచాయతీ వార్డు సభ్యులకు శంషాబాద్ బాలుర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఐదు రోజులపాటు శిక్షణా తరగతులు పూర్తికావడంతో పలువురు టిఓటిలు, ఎంపీడీవో మున్ని, ఎంపి ఓ రమేష్‌గౌడ్, వార్డు సభ్యులకు ధ్రువపత్రాలను శనివారం అందజేశారు.

## ఉచిత వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి

**నియోజకవర్గ ఇన్చార్జి తోకల**



**రాజేంద్రనగర్, మహా ;** ఉచిత వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని రాజేంద్రనగర్ నియోజకవర్గ బిజెపి ఇన్చార్జి తోకల శ్రీనివాస్ రెడ్డి అన్నారు. శనివారం సాయిబాబా నగర్ లో బిజెపి సీనియర్ నాయకులు సంతోష్ గౌడ్ ఆధ్వర్యంలో ఉచిత కంటి శిబిరంనిర్వహించారు. ఈ సందర్భంగా తోకల శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ ఉచిత కంటి వైద్య శిబిరాన్ని డివిజన్లోని ప్రజలు అందరూ సద్వినియోగం చేసుకోవాలని ప్రజలకు సూచించారు. ఈ ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్న ఆర్గనైజింగ్ కమిటీ సభ్యులందరికీ అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బిజెపి సీనియర్ నాయకులు రావుల భాస్కర్, మారు మురళి, గోపాల్ నాయక్, భూషణ్ , ప్రభుదాస్ , గురుస్వామి, రంజిత్ సింగ్, భరత్, రమేష్ రెడ్డి, కురుమూర్తి, శంకర్ రెడ్డి, యువకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## పేద ప్రజల ప్రగతి ప్రణాళిక: ఎమ్మెల్యే రంగారెడ్డి

- ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక విజయవంతం చేయాలి
- ప్రజా సమస్యలపై నిర్లక్ష్యం వహించే అధికారులపై చర్యలు తప్పవు



**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి మహా:** గ్రామీణ ప్రాంతాల పేద ప్రజల ప్రగతి ప్రణాళికతో అభివృద్ధికి బాటలు వేయడం జరుగుతుందని ఎమ్మెల్యే రంగారెడ్డి అన్నారు. ప్రజా సమస్యలపై నిర్లక్ష్యం వహిస్తే అధికారులపై చర్యలు తప్పవని ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి హెచ్చరించారు. శనివారం రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం మండలం పోచారం గ్రామంలో ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి ముఖ్య అతిథులుగా పాల్గొని ప్రజా పాలనపై ప్రతిజ్ఞ చేశారు. ముందుగా గ్రామంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను నబంధిత అధికారులను ప్రజల సమక్షంలో అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి మాట్లాడుతూ... పేద ప్రజలకు ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలను ప్రజల్లోకి నేరుగా తిసుకెళ్లాని అధికారులకు సూచించారు. గ్రామాల్లో సంబంధిత అధికారులు చర్యటించి అర్హులైన నిరుపేదలకు రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్ళు, గృహ జ్యోతి అందేటట్లు కృషి చేయలన్నారు. తాగు నీరు, విద్యుత్తు, అండర్ డ్రైనేజీ, వరిసరాల పరిశుభ్రతో పాటు ప్రజా సమసస్యలు తక్షణమే పరిష్కరించి ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక విజయవంతం చేయటానికి అధికారులు సమన్వయంతో పని చేయలన్నారు. పోచారం గ్రామానికి చుట్టుపక్కల ఉన్న రైస్ మిల్లులతో పొల్యూషన్ తీవ్రంగా ఉండడంతో, గ్రామస్తులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా, ప్రజలకు ఇబ్బంది కలిగించే సమస్యను వెంటనే పరిష్కరించేలా తగు చర్యలు తీసుకోవాలని ఎంపిడిఓకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఇబ్రహీంపట్నం ఏఎంసి చైర్మన్ కంబాలపల్లి గురునాథరెడ్డి, ఏసిపి రాజు, సిఐ మహేందర్ రెడ్డి, గ్రామ సర్పంచ్ వెంకటేష్, ఎంపీడీవో బాల శంకర్, ఎంపిఓ, భూపతిగళ్ల మహిపాల్, రాచర్ల వెంకటేశ్వర్లు, ముత్యాల రాజశేఖర్ రావు, చిన్న, డైరెక్టర్ శ్రీశైలం గ్రామ ఉప సర్పంచ్ శ్రీనివాస్, పలు శాఖల అధికారులు, గ్రామ సెక్రెటరీ, వార్డు మెంబర్లు, పలు పార్టీల నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# తహసీల్దార్ పై ఏసీబీ పంజా..

**రూ.4 కోట్ల అక్రమాస్తుల గుర్తింపు.. అదుపులోకి తీసుకున్న ఏసీబీ అధికారులు..**




**కరీంనగర్ మహా:** ఆదాయానికి మించిన ఆస్తులు కలిగి ఉన్నారనే ఆరోపణలపై గజ్వేల్ తహశీల్దార్ కమటం శ్రవణ్ కుమార్ ఇళ్లపై ఏసీబీ అధికారులు దాడులు నిర్వహించారు. కరీంనగర్లోని నివాసంతో పాటు మరో రెండు చోట్ల జరిపిన సోదాల్లో రూ.4 కోట్ల విలువైన అక్రమాస్తులు వెలుగుచూశాయి. వీటిలో 2 ఇళ్లు, ఒక అపార్ట్మెంట్ (6 ఫ్లాట్లు), మరో 4 ప్లాట్లు, రూ.11.90 లక్షల నగదు, కిలోల కొద్దీ బంగారం ఉన్నాయి. ఈ ఘటనపై ఏసీబీ అధికారులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. శ్రవణ్ కుమార్ ను అరెస్టు చేసి జ్యూరీషియల్ రిమాండ్ కు తరలించారు. ఆయన ఇంట్లో, మరో రెండు చోట్ల సోదాలు జరిగాయి. సోదాల సమయంలో (02) ఇళ్ళు, ఒక అపార్ట్‌మెంట్ (6 ఫ్లాట్‌లతో కూడినది), (04) కరీంనగర్ పట్టణంలోని రూ. 2,47,33,540/ విలువైన ఓపెన్ ప్లాట్‌లు, ద్విచక్ర వాహనాలు (2) రూ. 1,60,000/, (01) రూ. 30,00,000/ విలువైన నాలుగు చక్రాల వాహనం, రూ. 4,20,000/ విలువైన బంగారు ఆభరణాలు, రూ. 15,66,000/ విలువైన గృహోపకరణాలు, రూ. 11,90,000/ నికర నగదుతో పాటు మొత్తం రూ. 4. కోట్ల విలువైన ఆస్తులు బయటపడ్డాయి. నిందితుడు తన అధికారిక పదవిని దుర్వినియోగం చేయడం ద్వారా ఈ స్థిర చరాస్తులను సంపాదించాడని ఏసీబీ అధికారుల సోదాల్లో తేలింది. సోదాలు ఇంకా కొనసాగుతున్నాయి.

**సెల్ ఫోన్ నంబర్ -1064 (టోల్ ఫ్రీ నంబర్):**

ఏదైనా ప్రభుత్వ ఉద్యోగి లంచం అడిగిన సందర్భంలో, చట్ట ప్రకారం చర్య తీసుకోవడానికి ప్రజలు ఏసీబీ టోల్ ఫ్రీ నంబర్‌ను అంటే 1064ను సంప్రదించాలని అధికారుల కోరారు. ఏసీబీ తెలంగాణను సోషల్ మీడియా ప్లాట్‌ఫారమ్‌లు whatsapp (9440446106), facebook (తెలంగాణ ACB), X/గతంలో twitter (@Telangana ACB) ద్వారా కూడా సంప్రదించవచ్చనీ తెలిపారు. బాధితుడు/ఫిర్యాదుదారుడి పేరు వివరాలు గోప్యంగా ఉంచుతామని పేర్కొన్నారు.



## వైభవంగా మహిళా దినోత్సవ వేడుకలు

**రాజేంద్రనగర్, మహా ;** శంషాబాద్ మండలం నర్కుడ గ్రామంలో సర్పంచ్ గడ్డం శేఖర్ యాదవ్ ఆధ్వర్యంలో మహిళా దినోత్సవ వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యాతిథిగా మాజీ జెడ్పిటిసి నిరటి తన్విరాజ్ పాల్గొన్నారు. మాజీ జడ్పిటిసి మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లో ముందుకు రావాలని, సమాజ అభివృద్ధిలో వారి పాత్ర ఎంతో ముఖ్యమన్నారు. అన్ని రంగాల్లో మహిళలు ముందుకు సాగాలి. రాజకీయాల్లో ఇందిరా గాంధీని ఆదర్శంగా తీసుకోవాలన్నారు. ఈ సందర్భంగా మహిళలు వేదికపై ఆటలు, పాటలు సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శించారు. అనంతరం మహిళలను మాజీ జెడ్పిటిసి శాలువతో సత్కరించి మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ నీరటి మహేష్, తొంట అశోక్, గడ్డం విజయ యాదవ్, పంచాయతీ కార్యదర్శి శ్రీకాంత్ గౌడ్, వార్డు సభ్యులు పర్వతం వెంకటయ్య, లింగం సంధ్యా నవీన్, కనకమామిడి విష్ణు, చౌట రాజు, కుంచ లతకుమార్ గౌడ్, తొంట జంగమ్మ, పులిమామిడి శాలిని, గూడెపు నీరజ లక్ష్మణ్, పర్వతం వినోద్, బురుకుంటా నాగరాజు, కర్రె అఖిల గణేష్, అంగన్వాడీ టీచర్లు, మహిళా సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## మహిళల గౌరవం, సమాన హక్కులే మా ప్రభుత్వ లక్ష్యం



- ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి
- ఇబ్రహీంపట్నంలో ఘనంగా మహిళా దినోత్సవ వేడుకలు
- మహిళలకు మహిళా పోలీసులు, అధికారినిలకు ఇందిరమ్మ చీరల పంపణి
- మహిళలను కోటీశ్వర్లను చేయడమే మా లక్ష్యం
- అభివృద్ధి పథంలో మహిళల పాత్ర అమూల్యం
- ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి

**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి మహా:** ఇబ్రహీంపట్నం పురపాలక సంఘం ఆధ్వర్యంలో ఘనంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన, ఇబ్రహీంపట్నం శాసనసభ్యులు మల్ రెడ్డి రంగారెడ్డి, మహిళలకు అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా మహిళల సంక్షేమం, సాధికారత కోసం రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంటున్న పలు కార్యక్రమాలను ఆయన వివరించారు. మహిళలు సమాజ అభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తున్నారని పేర్కొన్నారు. మహిళా దినోత్సవ కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యే, మహిళలకు ఇందిరమ్మ చీరలను పంపిణీ చేసి వారిని సన్మానించారు. మహిళలు ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలని, ప్రభుత్వం ఎల్లప్పుడూ మహిళల అభివృద్ధికి కట్టుబడి ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇబ్రహీంపట్నం ఏఎంసి చైర్మన్ కంబాలపల్లి గురునాథరెడ్డి, ఏసిపి రాజు, సిఐ మహేందర్ రెడ్డి, గ్రామ సర్పంచ్ వెంకటేష్, ఎంపీడీవో బాల శంకర్, ఎంపిఓ, భూపతిగళ్ల మహిపాల్, రాచర్ల వెంకటేశ్వర్లు, ముత్యాల రాజశేఖర్ రావు, పురపాలక సంఘం ప్రజాప్రతినిధులు, అధికారులు, మహిళా సంఘాల సభ్యులు మరియు స్థానిక మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# మహిళలను గౌరవిస్తే నిజమైన మహిళా దినోత్సవం

**మహిళలకు అంతర్జాతీయ మహిళా దినోత్సవ శుభాకాంక్షలు.. రంగారెడ్డి జిల్లా కలెక్టర్ సి నారాయణ రెడ్డి**



**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి మహా:** మహిళలు అన్ని రంగాలలో రాణించి, సాధికారత సాధించినప్పుడే నిజమైన మహిళా దినోత్సవం అని జిల్లా కలెక్టర్ సి. నారాయణ రెడ్డి అన్నారు. శనివారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ భవనంలోని సమావేశ మందిరంలో జిల్లా మహిళాభివృద్ధి మరియు శిశు సంక్షేమ శాఖ మరియు జిల్లా గజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకల్లో జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ముందుగా అంతర్జాతీయ మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం మాట్లాడుతూ... మార్పు అనేది ఇంటి నుండే ప్రారంభం కావాలని అన్నారు. విశ్వంలో చాలా గ్రహాలు ఉన్నాయని, భూమి పైన మాత్రమే ప్రాణం ఉన్న జీవులు జీవిస్తున్నాయని, అందులో మానవ జీవితం చాలా ఉత్తమమైందని తెలిపారు. పురుషులు, మహిళల కంటే ముందు మనం మనుషులం, ఆడ, మగా కలిసి ప్రయాణిస్తేనే అర్థం, పరమార్థం, స్త్రీ పురుషులిద్దరు ఒక బండికి జోడేద్దులుగా ప్రయాణం చేసినప్పుడే సమాజంలో ముందుకు వెళ్ళడం జరుగుతుందన్నారు. కుటుంబానికి మూలం కుటుంబంలో ఉన్న మహిళా అని, కుటుంబంలోని ప్రతి విషయంలో మహిళ సమతుల్యత కలిగి ఉంటుందని అన్నారు. మనందరికీ అమ్మే మొదటి దైవం, మానందరిని ముందుండి నడిపిస్తుందని తెలిపారు. పాత కాలంలో మహిళల పట్ల వివక్షత ఉండేదని, కొన్ని ప్రాంతాల్లో నేటికీ మహిళలను తక్కువగా చూడటం జరుగుచున్నదని, ఇప్పుడిప్పుడే మహిళలకు చదువుపరంగా, ఆర్థికపరమైన విషయాలలో సమానంగా అవకాశాలు కల్పించడం జరుగుతుందని అన్నారు. మారుతున్న నేటి కాలంలో అక్షరాస్యత టెక్నాలజీ పెరగడం ద్వారా ఈ వివక్ష తగ్గిందని అన్నారు. అబ్బాయిలను అమ్మయిలను సమానంగా పెంచాలని, పిల్లలకు విలువలతో కూడిన విషయాలు నేర్పించాలని అన్నారు. కుటుంబం, కుటుంబంలోని బంధాలు, విలువలు మర్చిపోకుండా ఉన్నప్పుడే సమాజాన్ని కాపాడుకోగలమని అన్నారు. మహిళలు తమ ఆరోగ్యంపై శ్రద్ధ తీసుకోవాలన్నారు. ప్రభుత్వం మహిళలకు అందించే ప్రతిఫలాలను మహిళలు అందిపుచ్చుకునేలా ప్రభుత్వరంగంలో ఉన్న మనందరం కృషి చేయాలన్నారు. జిల్లాలో 1/3 వంతు మహిళా అధికారులు పని చేస్తున్నారని, అందరూ బాగా పని చేస్తూ జిల్లాను ముందుకు తీసుకెళ్లడంలో మహిళా అధికారుల సహకారం ఎంతైన ఉందని తెలిపారు. మహిళలు ఏదైన సాధించగలరని తెలిపారు. అనంతరం జిల్లా అధికారులకు, ఉత్తమ మహిళా సిబ్బందికి, ఆటల పోటీలలో గెలుపొందిన మహళలకు కలెక్టర్ చేతుల మీదుగా బహుమతులు అందచేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి సంగీత, పిడి డీఆర్డీఏ శ్రీలత, ఎస్.సి.కార్పొరేషన్ ఈడీ పద్మావతి, మత్స్యశాఖ అధికారి పూర్ణిమ, అడిషనల్ పిడి సుభాషిణి, డీఎంహెచ్ఓ లలిత దేవి, రంగారెడ్డి టీజీవోస్ అసోసియేషన్, ప్రెసిడెంట్ డాక్టర్ రామారావు, శాంతిశ్రీ,, రేవతి, అలివేలు, మహేశ్వరి, బాలేశ్వరి, రాణి, జ్యోత్స్న, కలెక్టరేట్ మహిళా సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.




# ఘనంగా ఇఫ్తార్ విందు

**పాల్గొన్న సీపీ గౌష్ ఆలం**

**కరీంనగర్ మహా:** కరీంనగర్ పోలీసు కమిషనరేట్ ఆధ్వర్యంలో శనివారం ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందు కార్యక్రమం అత్యంత భక్తిశ్రద్ధల మధ్య ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ముస్లిం సోదరులతో కలిసి సీపీ ఉపవాస దీక్షను విరమించి, వారికి రంజాన్ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ, పవిత్ర రంజాన్ మాసం క్రమశిక్షణకు, దాతృత్వానికి మత సామరస్యానికి ప్రతీక అని కొనియాడారు. శాంతి భద్రతల పరిరక్షణలో ప్రజలందరూ పోలీసులకు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీతో పాటు టౌన్ ఏసీపీ వెంకటస్వామి, టౌన్ ఇన్స్పెక్టర్లు రాంచందర్ రావు , సృజన్ రెడ్డి , తిరుమల్ ట్రాఫిక్ ఇన్స్పెక్టర్లు సంజీవ్, కుమారస్వామి , శాంతి సంక్షేమ కమిటీ సభ్యులు, స్థానిక ముస్లిం సోదరులు సిబ్బంది పాల్గొని, మతసామరస్యాన్ని చాటారు.

# తహసీల్దార్ పై ఏసీబీ పంజా..

**రూ.4 కోట్ల అక్రమాస్తుల గుర్తింపు.. అదుపులోకి తీసుకున్న ఏసీబీ అధికారులు**

**కరీంనగర్ మహా:** ఆదాయానికి మించిన ఆస్తులు కలిగి ఉన్నారనే ఆరోపణలపై గజ్వేల్ తహశీల్దార్ కమటం శ్రవణ్ కుమార్ ఇళ్లపై ఏసీబీ అధికారులు దాడులు నిర్వహించారు. కరీంనగర్లోని నివాసంతో పాటు మరో రెండు చోట్ల జరిపిన సోదాల్లో రూ.4 కోట్ల విలువైన అక్రమాస్తులు వెలుగుచూశాయి. వీటిలో 2 ఇళ్లు, ఒక అపార్ట్మెంట్ (6 ఫ్లాట్లు), మరో 4 ప్లాట్లు, రూ.11.90 లక్షల నగదు, కిలోల కొద్దీ బంగారం ఉన్నాయి. ఈ ఘటనపై ఏసీబీ అధికారులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. శ్రవణ్ కుమార్ ను అరెస్టు చేసి జ్యూరిషియల్ రిమాండ్ కు తరలించారు. ఆయన ఇంట్లో, మరో రెండు చోట్ల సోదాలు జరిగాయి. సోదాల సమయంలో (02) ఇళ్ళు, ఒక అపార్ట్ మెంట్ (6 ఫ్లాట్ లతో కూడినది), (04) కరీంనగర్ పట్టణంలోని రూ. 2,47,33,540/ విలువైన ఓపెన్ ప్లాట్ లు, ద్విచక్ర వాహనాలు (2) రూ. 1,60,000/, (01) రూ. 30,00,000/ విలువైన నాలుగు చక్రాల వాహనం, రూ. 4,20,000/ విలువైన బంగారు ఆభరణాలు, రూ. 15,66,000/ విలువైన గృహోపకరణాలు, రూ. 11,90,000/ నికర నగదుతో పాటు మొత్తం రూ. 4.కోట్ల విలువైన ఆస్తులు బయటపడ్డాయి. నిందితుడు తన అధికారిక పదవిని దుర్వినియోగం చేయడం ద్వారా ఈ స్థిర చరాస్తులను సంపాదించాడని ఏసీబీ అధికారుల సోదాల్లో తేలింది. సోదాలు ఇంకా కొనసాగుతున్నాయి.

**సెల్ ఫోన్ నంబర్ -1064 (టోల్ ఫ్రీ నంబర్):**

ఏదైనా ప్రభుత్వ ఉద్యోగి లంచం అడిగిన సందర్భంలో, చట్ట ప్రకారం చర్య తీసుకోవడానికి ప్రజలు ఏసీబీ టోల్ ఫ్రీ నంబర్ను అంటే 1064ను సంప్రదించాలని అధికారుల కోరారు. ఏసీబీ తెలంగాణను సోషల్ మీడియా ప్లాట్ ఫారమ్‌లు వాట్సప్ (9440446106) ఫేస్బుక్ (తెలంగాణ ఏసీబీ )ఎక్స్ గతంలో ట్విట్టర్ ఎట్ ది రేట్ అఫ్ తెలంగాణ ఎసిబి ద్వారా కూడా సంప్రదించవచ్చనీ తెలిపారు. బాధితుడు/ఫిర్యాదుదారుడి పేరు వివరాలు గోప్యంగా ఉంచుతామని పేర్కొన్నారు.

# పోలీస్ పెట్రోల్ బంకు వద్ద చలివేంద్రాన్ని ప్రారంభించిన ఎస్పీ

- వేసవిలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి
- పోలీసుల సేవా దృక్పథం అభినందనీయం



**నల్గొండ టౌన్, మహా :** వేసవి కాలంలో ఎండల తీవ్రత దృష్ట్యా ప్రయాణికులు, పాదచారుల దాహార్తిని తీర్చేందుకు పోలీస్ శాఖ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయమని జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ పేర్కొన్నారు. శనివారం నల్గొండ పట్టణంలోని పోలీస్ పెట్రోల్ బంకు వద్ద ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఆయన రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా స్వయంగా మట్టి కుండల్లోని చల్లని నీటిని బాటసారులకు అందించి వారి దాహార్తిని తీర్చారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ.. ఎండలు ముదురుతున్న తరుణంలో రహదారులపై ప్రయాణించే వాహనదారులు, ఆటో డ్రైవర్లు, కార్మికులు ఇబ్బంది పడకూడదనే ఉద్దేశంతో ఈ చలివేంద్రాన్ని అందుబాటులోకి తెచ్చినట్లు తెలిపారు. ప్రజల సేవే పోలీసుల ప్రధాన ధ్యేయమని ఇలాంటి కార్యక్రమాల ద్వారా పోలీసు శాఖ ప్రజలకు మరింత చేరువవుతుందన్నారు. పెరుగుతున్న ఉష్ణోగ్రతల వల్ల ప్రజలు డీహైడ్రేషన్ బారిన పడే ప్రమాదం ఉందని, కాబట్టి ప్రతి ఒక్కరూ తరచూ నీరు తాగుతూ తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఎస్పీ సూచించారు. అత్యవసరమైతే తప్ప మధ్యాహ్నం వేళల్లో బయటకు రావద్దని నీడ పట్టున విశ్రాంతి తీసుకోవాలని కోరారు. ఈ చలివేంద్రం వద్ద నిరంతరం చల్లని నీరు అందుబాటులో ఉండేలా మట్టి కుండలను ఏర్పాటు చేసి ప్రత్యేక పర్యవేక్షణ చేపట్టినట్లు ఆయన వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఏఆర్ డీఎస్పీ శ్రీనివాసులు, ఆర్.ఐలు సంతోష్, శ్రీను, ఆర్.ఎస్ఐ నాగరాజు, హెడ్ కానిస్టేబుల్ నాగరాజు, పోలీస్ సిబ్బంది మరియు స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

# డిండి ప్రాజెక్టుపై వివక్ష వీడాలి



**ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం..**

- వట్టెం ప్రాజెక్ట్ కు ఒక నీతి, డిండికి ఒక నీతా.?
- 436 లెవల్ నుంచే నీటిని తరలించాలి
- అన్యాయం జరగనివ్వం చర్యలు తీసుకుంటాం మంత్రి కోమటిరెడ్డి హామీ

**నల్గొండ టౌన్, మహా :** డిండి శివన్నగూడెం ప్రాజెక్టుల విషయంలో నల్గొండ జిల్లాపై జరుగుతున్న వివక్షను వెంటనే అడ్డుకోవాలని సీపీఐ ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం డిమాండ్ చేశారు. శనివారం నల్గొండలో జరిగిన ఉమ్మడి జిల్లా 'ప్రజాపాలనప్రగతి ప్రణాళిక' సన్నాహక సమావేశంలో ఆయన ఈ అంశంపై మంత్రులకు వివరించారు.. ఏదుల రిజర్వాయర్ నుంచి నీటి తరలింపులో నీటిపారుదల శాఖ అధికారులు అనుసరిస్తున్న నిబంధనలు జిల్లా ప్రయోజనాలకు గొడ్డలిపెట్టుగా మారాయని ఆందోళన వ్యక్తం చేశారు.

**వట్టెంకు ఒక నీతి,డిండికి ఒక నీతా?**

ఏదుల రిజర్వాయర్ నుంచి పాలమూరురంగారెడ్డి (వట్టెం) ప్రాజెక్టుకు 436 మీటర్ల ఎత్తు నుంచే నీటిని తరలించే అవకాశం కల్పిస్తున్న అధికారులు, డిండి కాలువకు మాత్రం 440 మీటర్ల నిబంధన విధించడంపై నెల్లికంటి మండిపడ్డారు. 440 మీటర్ల నిబంధన వల్ల డిండికి అందాల్సిన 6 వేల క్యూసెక్కుల నీరు 1500 క్యూసెక్కులకు పడిపోతుందని నీటి లభ్యత తగ్గుతుందని వివరించారు. దీనివల్ల రావాల్సిన 30 టీఎంసీలకు బదులు కేవలం 7 టీఎంసీలే వచ్చే ప్రమాదం ఉందని, తద్వారా 3.61 లక్షల ఎకరాల ఆయకట్టుకు అన్యాయం జరుగుతుందని హెచ్చరించారు. వేల కోట్లతో నిర్మిస్తున్న శివన్నగూడెం రిజర్వాయర్ కూడా నీరు లేక వృథా అయ్యే అవకాశం ఉందని పేర్కొన్నారు. మునుగోడు, దేవరకొండ నియోజకవర్గాల్లోని సాగు, తాగునీటి అవసరాల దృష్ట్యా వట్టెం ప్రాజెక్టుతో సమానంగా డిండికి కూడా 436 మీటర్ల లెవల్ నుంచే నీటిని తీసుకునేలా ఉత్తర్వులు ఇవ్వాలని ఆయన నీటి పారుదల శాఖను కోరారు.

**మంత్రి సానుకూల స్పందన..**

ఎమ్మెల్సీ లేవనెత్తిన అంశంపై రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి సానుకూలంగా స్పందించారు. డిండి ప్రాజెక్టుకు 436 లెవల్ నుంచే నీటిని తీసుకువచ్చేలా ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకుంటుందని స్పష్టం చేశారు. నల్గొండ జిల్లాకు సాగునీటి విషయంలో ఎలాంటి అన్యాయం జరగనివ్వబోమని శివన్నగూడెం ప్రాజెక్టును కాపాడుకుంటామని మంత్రి ఈ సందర్భంగా హామీ ఇచ్చారు.

# మహిళలు సాధికారత సాధించాలి..

- పథకాలను సద్వినియోగం చేసుకుని వృద్ధిలోకి రావాలి..
- అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకల్లో కలెక్టర్ బి. చంద్రశేఖర్..



**నల్గొండ, మహా :** మహిళా సంక్షేమం కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ పథకాలను సద్వినియోగం చేసుకుని మహిళలు అన్ని రంగాల్లో సాధికారత సాధించాలని జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ పిలుపునిచ్చారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం జిల్లా కేంద్రంలోని టీఎన్జీఓ భవన్లో నిర్వహించిన వేడుకలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మహిళా ఉద్యోగులు ప్రతినిధులను ఉద్దేశించి ఆయన మాట్లాడారు. గడిచిన దశాబ్ద కాలంలో మహిళా లోకంలో విప్లవాత్మకమైన మార్పులు వచ్చాయని కలెక్టర్ పేర్కొన్నారు. ముఖ్యంగా సాంకేతికతను అందిపుచ్చుకోవడంతో పాటు, వృత్తి నైపుణ్యాలను మెరుగుపరుచుకోవడం ద్వారా మహిళలు అద్భుతమైన ప్రగతిని సాధిస్తున్నారని కొనియాడారు. "ప్రస్తుత సమాజంలో మహిళలు కేవలం గృహిణులుగానే కాకుండా అన్ని రంగాల్లో పురుషులతో సమానంగా రాణిస్తున్నారు. సుధా మూర్తి వంటి మహనీయులను ఆదర్శంగా తీసుకుని మహిళలు ఉన్నత శిఖరాలను అధిరోహించాలి" అని ఆయన ఆకాంక్షించారు.

**ప్రభుత్వ అండదండలు..**

రాష్ట్ర ప్రభుత్వం మహిళల అభివృద్ధి, భద్రత, ఆర్థిక స్వావలంబన కోసం అనేక ప్రతిష్ఠాత్మక పథకాలను అమలు చేస్తోందని కలెక్టర్ వివరించారు. ఈ అవకాశాలను అందిపుచ్చుకుని సామాజికంగా ఆర్థికంగా మరింత బలోపేతం కావాలని కోరారు. అనంతరం జిల్లాలో వివిధ రంగాల్లో విశేష సేవలు అందించిన మహిళలను ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా స్థాయి అధికారులు, మహిళా సంఘాల ప్రతినిధులు, టీఎన్జీఓ సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# కౌన్సిలర్లు,సర్పంచులకు కంది శ్రీనివాస రెడ్డి ఆత్మీయ సత్కారం



- ప్రజాసేవాభవన్ లో కార్యక్రమం
- పెద్ద సంఖ్యలో హాజరైన శ్రేణులు
- ప్రజాప్రతినిధులను శాలువాలతో సత్కరించిన కంది శ్రీనివాస రెడ్డి



**ఆదిలాబాద్ మహా :** తనను నమ్ముకున్న నాయకులు కార్యకర్తలను ఎల్లవేళలా కంటికి రెప్పలా కాపాడుకుంటానని ఆదిలాబాద్ అసెంబ్లీ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కంది శ్రీనివాస రెడ్డి అన్నారు. శనివారం తన క్యాంపు కార్యాలయంలో ఇటీవలి స్థానిక సంస్థల ఎన్నికల్లో విజేతలైన కౌన్సిలర్లు, సర్పంచుల ఆత్మీయ సత్కార కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. అందరినీ పేరుపేరునా పలకరిస్తూ వారితో తనకున్న అనుబంధాన్ని గుర్తు చేసుకుంటూ ఎన్నికల్లో టికెట్ దగ్గరనుండి గెలుపు వరకు జరిగిన విషయాలను పంచుకున్నారు.అందరినీ శాలువాలతో సత్కరించి అభినందనలు తెలియచేసారు. డబ్బు ఒక్కటే ప్రధానం కాదని అన్ని విషయాలలో ధనం సమస్యలను పరిష్కరించలేదన్నారు.తాను డబ్బు కోసం రాజకీయాల్లోకి రాలేదని ఆదిలాబాద్ ప్రజలకు సేవ చేసేందుకే వచ్చానని స్పష్టం చేసారు.బేల మండల కేంద్రంలో తన స్వంత స్థలంలో పార్టీ ఆఫీస్ నిర్మిస్తున్నట్టు చెప్పారు. మున్సిపల్ వార్డుల్లో, గ్రామ పంచాయతీలలో ప్రజలు ఎంతో నమ్మకంగా మీ అందరికి ఓటు వేసి గెలిపించారని అందరికి అందుబాటులో ఉంటూ ప్రజా సమస్యలు పరిష్కరిస్తూ వారు మీపై పెట్టుకున్న నమ్మకాన్ని నిజం చేయాలని సూచించారు. మున్సిపల్ చైర్ పర్సన్ ,కౌన్సిలర్లు వార్డుల అభివృద్ధికి , సర్పంచ్ ఉప సర్పంచ్లు గ్రామాల ప్రగతికి బాటలు వేయాలన్నారు. అన్ని వేళలా తాను అండగా ఉంటానన్నారు.ఏ అవసరమొచ్చినా కంది శ్రీనన్న ఉన్నాడన్న విషయం గుర్తుంచుకోవాలన్నారు. అందరం కలసి అభివృద్ధికి పాటు పడదామని సూచించారు.గత ఎన్నికల్లో చేసిన తప్పులను సరిదిద్దుకొని యంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల్లో అత్యధిక స్థానాలలో విజయం సాధిస్తామని ధీమా వ్యక్తం చేసారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ బండారి అనూష, ఆత్మ చైర్మన్ సంతోష్ రావు,కౌన్సిలర్లు , మంచాల సరిత , బూర్ల నర్మద,తుమ్మల అన్నపూర్ణ, ఇజ్జగిరి సంజయ్,సయ్యద్ జీషాన్ అలీ, గజ్జల విజయ, షేక్ హీనా సబీన్, రుహీనా ఫాతిమా,మహబూబ్ , నగ్మా సిద్దిఖీ,మిటాపూరే శాలిని, సాయిచరణ్ గౌడ్,స్వాతి కాంబ్లే సర్పంచులు నియోజకవర్గంలోని పలు గ్రామాల సర్పంచులు పార్టీ శ్రేణులు తదితరులు పాల్గొన్నారు.


# సమాజాభివృద్ధిలో మహిళల భాగస్వామ్యమే కీలకం



**బెల్లంపల్లి, మహా:** సమాజాభివృద్ధిలో మహిళల భాగస్వామ్యమే కీలక పాత్ర పోషిస్తుందని బెల్లంపల్లి మున్సిపల్ చైర్పర్సన్ దావ స్వాతీ రమేష్ పేర్కొన్నారు.బెల్లంపల్లి నియోజకవర్గ శాసనసభ్యులు గడ్డం. వినోద్ వెంకట స్వామి ఆదేశాల మేరకు బెల్లంపల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శనివారం నాడు "అంలతర్జాతీయ మహిళా దినోత్సవం" సందర్భంగా నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా మున్సిపల్ చైర్పర్సన్ దావ స్వాతిరమేష్ బాబు పాల్గొన్నారు.ఈ సందర్భంగా విద్యార్థులను ఉద్దేశించి ఆమె మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాలలో ముందుండాలని, వారి పాత్ర సమాజ అభివృద్ధికి చాలా కీలకమన్నారు. సమాజంలో మహిళలు ఎదుర్కొంటున్న సవాళ్లను ధైర్యంగా ఎదుర్కోవాలని, తమకంటూ ఒక ప్రత్యేక గుర్తింపును ఏర్పరచుకోవాలని విద్యార్థినులకు దిశానిర్దేశం చేశారు.మహిళలు రాజకీయాలలో ముందుండి నడవాలని, ప్రతి విద్యార్థిని పట్టుదలతో చదివి ఉన్నత స్థానాలకు ఎదగాలని సూచించారు. కార్యక్రమంలో పలువురు కౌన్సిలర్ లు, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్. కాంపెల్లి. శంకర్ తోపాటు కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

# మిల్లర్ల 'మెగా' దోపిడీకి అధికారుల అండదండలు.!

- 12 ఏళ్లు 24 సీజన్లు ఏకంగా రూ. 7,261 కోట్ల ప్రభుత్వ సొమ్ము స్వాహ చేసినట్లు అనుమానాలు.?
- ఉద్యమాల జిల్లాలో అవినీతి తిమింగలాలు..
- కేసుల సమాచారం లీక్ మిల్లర్ల పరారీకి అధికారి సహకారం..
- రూ.192 కోట్లు దోచుకుంటే రికవరీ కేవలం రూ. లక్ష తొమ్మిది వేలు మాత్రమే..
- ఏసీ గదుల్లో కూర్చుని పాపాన్ని పంచుకుంటున్న ఉన్నతాధికారులు..




**నల్గొండ,మహా :** ఒకప్పుడు ఉద్యమాలకు ఊపిరిపోసి పోరాటాల గడ్డగా నిలిచిన నల్గొండ జిల్లా.. ఇప్పుడు అవినీతి తిమింగలాలకు అడ్డాగా మారుతోంది. దేశంలో బ్యాంకుల సొమ్ము ఎగ్గొట్టి విదేశాలకు పారిపోయే దొంగలను చూశాం కానీ ఇక్కడ మాత్రం మిల్లర్లు ఏకంగా ప్రభుత్వాలకే సున్నం వేస్తున్నారు. పేదవాడి ఆకలి తీర్చాల్సిన బియ్యాన్ని అప్పనంగా బుక్కేస్తూ వేల కోట్ల రూపాయల ప్రజల సొమ్మును మేసేస్తున్నారు. ఈ మహా దోపిడీకి వ్యవస్థలు సైతం సహకరిస్తున్నాయా? ఏసీ గదుల్లో సేద తీరే ఉన్నతాధికారులు సైతం ఈ పాపంలో పాలుపంచుకుంటున్నారా? అనే అనుమానాలు బలంగా వ్యక్తమవుతున్నాయి. మిల్లర్లకు ముసుగేయకుండా మాయ చేస్తోన్న ఆ 'చీటర్స్' ఎవరు?

**12 ఏళ్లు..24 సీజన్లు..రూ. 7,261 కోట్ల దోపిడీ?**

ఉమ్మడి నల్గొండ జిల్లాలో సి ఎం ఆర్ స్కామ్ గత 12 సంవత్సరాలుగా 24 సీజన్లకు సంబంధించి మిల్లర్లు సాగించిన దోపిడీ అక్షరాలా రూ. 7,261 కోట్ల రూపాయలు అని విశ్వసనీయ సమాచారం. ప్రభుత్వ, ప్రజల, రైతుల సొమ్మును మిల్లర్లు అప్పనంగా బుక్కేశారా?లంచాల మత్తులో మునిగిపోయిన ఉన్నతాధికారులు ఈ దోపిడీకి అండదండలు అందిస్తూ మిల్లర్లకు సహకరిస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

**'లీక్' వీరుడు.. మిల్లర్ల పరారీకి దారి చూపిన అధికారి?**

జిల్లాలోనే కొన్ని సంవత్సరాలుగా పాతుకుపోయిన ఒక ఉన్నతాధికారి మిల్లర్లకు ఎప్పటికప్పుడు సమాచారం అందిస్తూ వారిని కాపాడుతున్నట్లు తెలుస్తోంది. "మీపై కేసులు పెడుతున్నారు.. రేపు పోలీసులు వస్తారు" అని ముందస్తు సమాచారం అందించి వారు పారిపోయేలా చేసినట్లు, సదరు అధికారి ఇచ్చిన సమాచారంతోనే మిల్లర్లు గోవా, కర్ణాటక, వికారాబాద్ వంటి ప్రాంతాలకు పారిపోయినట్లు సమాచారం. అక్రమంగా రూ. 192 కోట్ల మేర బియ్యాన్ని దారి మళ్లించిన కేసులో ఐదుగురు మిల్లర్లు ఇంకా పరారీలోనే ఉన్నారని పోలీసులు చెబుతున్నారు. రూ. 43 కోట్లు దోచేసిన ఇద్దరు మిల్లర్లను మాత్రమే అరెస్టు చేసి చేతులు దులుపుకున్నారు.

**రికవరీ సున్నా.. పేదల కష్టం పందికొక్కుల పాలు.!**

మిల్లర్లు దోచుకున్న రూ. 192 కోట్ల రూపాయలలో రికవరీ చేసిన మొత్తం కేవలం రూ. 1.09 లక్షలు మాత్రమే! అంటే మిల్లర్లు ఏ స్థాయిలో దోచుకున్నారో అధికారులు ఏ స్థాయిలో సహకరించారో అర్థం చేసుకోవచ్చు. మిల్లర్లను కాపాడుతున్న ఆ ఉన్నతాధికారి ఎవరు? అతనిపై చర్యలు తీసుకుంటారా? రెవెన్యూ యాక్ట్ ప్రకారం మిల్లర్లు దోచుకున్న సొమ్మును రికవరీ చేస్తారా? మిలర్లకు సహకరించిన వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని ప్రజా ధనాన్ని లూటీ చేసిన వారిని వదిలిపెట్టకూడదని ప్రజలు, రైతులు డిమాండ్ చేస్తున్నారు.

# నిర్మాణ పనులను త్వరగా పూర్తి చేయాలి

**మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్**



**మంచిర్యాల, మహా :** మంచిర్యాల జిల్లా కాలేజ్ రోడ్డులో నిర్మిస్తున్న ప్రభుత్వ ఆసుపత్రి నిర్మాణ పనులను త్వరగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. శనివారం ప్రభుత్వ ఆసుపత్రి నిర్మాణం పనులను ఆకస్మికంగా సందర్శించి పనుల పురోగతిని పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజలకు మెరుగైన వైద్య సేవలను అందించేందుకు ప్రభుత్వం ఆసుపత్రి నిర్మాణ పనులను చేపట్టిందని వెల్లడించారు. ఈ క్రమంలో పనులు వేగవంతం చేసి త్వరగా పూర్తి చేసే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆయన ఆదేశించారు. 129.25 కోట్ల రూపాయలతో ప్రభుత్వ ఆసుపత్రి, 23.75 కోట్ల రూపాయలతో క్రిటికల్ కేర్ విభాగం ఏర్పాటు చేస్తున్నామని స్పష్టం చేశారు. వైద్య రంగాన్ని బలోపేతం చేస్తూ ప్రజలకు వేగమైన వైద్య సేవలు అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని తెలిపారు. అనంతరం సాయికుంట ప్రాంతంలో నిర్మిస్తున్న ప్రభుత్వ నర్సింగ్ కళాశాల నిర్మాణ పనులను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు




- మహిళా ఉద్యోగులకు క్రీడా పోటీలు
- ప్రారంభించిన జిల్లా కలెక్టర్ రాజర్షిషా, మున్సిపల్ చైర్ పర్సన్

**ఆదిలాబాద్ మహా :** రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు 99 రోజుల 'ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక'లో భాగంగా మహిళా దినోత్సవ వేడుకలను జిల్లా వ్యాప్తంగా ఘనంగా నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ రాజర్షిషా తెలిపారు.అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం స్థానిక ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో మహిళా ఉద్యోగుల కోసం నిర్వహించిన వివిధ క్రీడా పోటీలను మున్సిపల్ చైర్ పర్సన్ బండారి అనూష తో కలిసి ఆయన జెండా ఊపి ప్రారంభించారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలలో భాగంగా మహిళా ఉద్యోగాలకు రన్నింగ్ రేస్, మ్యూజికల్ చైర్స్, లెమన్ అండ్ స్పూన్ వంటి వివిధ రకాల క్రీడా పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. విద్యాశాఖ, మెప్మా, మహిళా శిశు సంక్షేమ శాఖ, వివిధ విభాగాల నుంచి మహిళా ఉద్యోగులు పాల్గొనడం అభినందనీయమన్నారు. ఎండ తీవ్రతను దృష్టిలో ఉంచుకుని స్టేడియం వద్ద మెడికల్ క్యాంపును ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఈ క్రీడా పోటీలలో విజేతలుగా నిలిచిన మహిళా దినోత్సవ సందర్భంగా నిర్వహించే వేడుకల్లో బహుమతులు అందజేస్తామని వివరించారు. అనంతరం సీఎం కప్ పోటీలలో గెలుపొందిన విజేతలను కలెక్టర్ మున్సిపల్ చైర్‌పర్సన్ మెడల్స్ తో సత్కరించారు.ఈ పోటీల్లో మున్సిపల్ చైర్‌పర్సన్ మహిళా ఉద్యోగులతో కలిసి వివిధ క్రీడల్లో పాల్గొని వారిని ఉత్సాహపరిచారు.ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి మిల్కా, మున్సిపల్ కమిషనర్ రాజు, డి.వై.ఎస్.ఓ. శ్రీనివాస్, రిమ్స్ డైరెక్టర్ జై సింగ్ రాథోడ్, వార్డ్ కౌన్సిలర్లు, వివిధ శాఖల అధికారులు, మహిళా సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రజా పాలనలో జిల్లాను అగ్రభాగాన నిలపాలి..

- ఉమ్మడి జిల్లా అధికారులకు మంత్రుల దిశానిర్దేశం..
- 99 రోజుల పాటు 'ప్రగతి ప్రణాళిక' అమలు..
- ఏప్రిల్ నుంచి రెండో విడత ఇందిరమ్మ ఇళ్లు..
- సోమవారంలోగా పెండింగ్ బిల్లుల చెల్లింపు..
- క్షేత్రస్థాయిలోనే 15 రోజులు ఉండాలి కలెక్టర్లకు ఆదేశం..



**నల్గొండ, మహా బ్యూరో :** రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన 'ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక' అమలులో నల్గొండ జిల్లాను రాష్ట్రంలోనే ప్రథమ స్థానంలో నిలిపేలా అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని రాష్ట్ర మంత్రులు కోమటిరెడ్డి వెంకటరెడ్డి, అడ్లూరు లక్ష్మణ్‌కుమార్ పిలుపునిచ్చారు. శనివారం జిల్లా కేంద్రంలోని ఉదయాదిత్య భవన్‌లో నిర్వహించిన ఉమ్మడి నల్గొండ జిల్లా సన్నాహక సమావేశంలో వారు మాట్లాడారు. మార్చి 6 నుంచి జూన్ 12 వరకు 99 రోజుల పాటు ఈ కార్యక్రమం కొనసాగుతుందని వెల్లడించారు.మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం పది ముఖ్యమైన అంశాల వారీగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తోందని తెలిపారు. పెండింగ్‌లో ఉన్న ఇందిరమ్మ ఇళ్ల బిల్లులను సోమవారం లోపు క్లియర్ చేస్తామని, ఏప్రిల్ నుంచి మరో విడత ఇళ్ల మంజూరు ఉంటుందని స్పష్టం చేశారు.2028 జూన్ నాటికి ఎస్ఎల్బీసీ ద్వారా సాగు నీరందిస్తామని, డిండి ఎత్తిపోతల ద్వారా దేవరకొండ, మునుగోడుకు నీరందించేలా కాలువల ఎత్తు పెంచుతామన్నారు. ప్రభుత్వ కార్యాలయాల్లో పెండింగ్ ఫైళ్లను పరిష్కరించడంతో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని ఆదేశించారు.

**పేదల వద్దకే సంక్షేమం.!**

జిల్లా ఇన్చార్జి మంత్రి అడ్లూరు లక్ష్మణ్‌కుమార్ మాట్లాడుతూ.. రేషన్ కార్డులు, సన్నబియ్యం, రైతు భరోసా, ఉచిత విద్యుత్ వంటి పథకాలు అర్హులైన ప్రతి పేద వాడికి అందాలని చెప్పారు. అధికారులు విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. ప్రగతి ప్రణాళిక పర్యవేక్షణకు ప్రత్యేక వాట్సాప్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు.శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి మాట్లాడుతూ.. వేసవి దృష్ట్యా తాగునీటి సమస్య తలెత్తకుండా కలెక్టర్లు, ఆర్డబ్ల్యూఎస్ అధికారులు ముందస్తు ప్రణాళికతో ఉండాలని సూచించారు. గ్రామాల్లోని ట్రాక్టర్లను పారిశుధ్య పనులకు వాడాలన్నారు. ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య మాట్లాడుతూ మిషన్ భగీరథ ద్వారా నీటి సరఫరాను పర్యవేక్షించాలని కోరారు.

**ఐదు స్థాయిల్లో పర్యవేక్షణ**

జిల్లా కలెక్టర్ బి.చంద్రశేఖర్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా 99 రోజుల ప్రణాళికను వివరించారు. గ్రామం నుంచి రాష్ట్ర స్థాయి వరకు 5 అంచెల్లో ఈ కార్యక్రమం సాగుతుందన్నారు. అనంతరం సూర్యాపేట, యాదాద్రి కలెక్టర్లు తేజస్ నంద్ లాల్ పవార్, అనురాగ్ జయంతి, ఎస్పీ శరత్ చంద్ర పవార్‌లు మాట్లాడారు. కార్యక్రమంలో ఎమ్మెల్యేలు వేముల వీరేశం, బాలు నాయక్, మందుల సామేలు, కుంభం అనిల్ కుమార్ రెడ్డి, జైవీర్ రెడ్డి, ఎమ్మెల్సీలు నెల్లికంటి సత్యం, శంకర్ నాయక్త, మేయర్ బుర్రి చైతన్య, తదితరులు పాల్గొన్నారు. చివరగా ప్రగతి ప్రణాళిక అమలుపై అందరితో కలెక్టర్ ప్రతిజ్ఞ చేయించారు.



# ఆస్కార్ నుంచి ఆహ్వానం

ప్రియాంకా చోప్రాకు మరోసారి ఆస్కార్ నుంచి ఆహ్వానం అందింది. అమెరికాలోని లాస్ ఏంజెల్స్ వేదికగా ఈ నెల మార్చి 15న (భారతీయ కాలమానం ప్రకారం మార్చి 16) జరగనున్న 98వ ఆస్కార్ అవార్డుల ప్రదానోత్సవంలో ఓ ప్రెజంటర్‌గా పాల్గొననున్నారు ప్రియాంకా చోప్రా. ఆమెతో పాటు హాలీవుడ్ యాక్టర్స్ అన్నే జాక్వెలిన్ హతావే, గ్వినేత్ పాల్ట్రో, రాబర్ట్ డౌనీ జూనియర్, ఆర్నేట్, పాల్ మెస్కల్ ప్రజెంటర్స్‌గా పాల్గొననున్నట్లు ఆస్కార్ అకాడమీ కమిటీ ప్రకటించింది. ఇక ఆస్కార్ అవార్డుల ప్రదానోత్సవానికి ప్రియాంకా చోప్రా ప్రజెంటర్‌గా పాల్గొనడం ఇది తొలిసారి కాదు. 2016లో జరిగిన 88వ ఆస్కార్ అవార్డుల వేడుకకు ప్రియాంక తొలిసారి ప్రజెంటర్‌గా వ్యవహరించారు. ఇప్పుడు పదేళ్లకు ఈ వేదికపై ఆమె మరోసారి విజేతలకు అవార్డులను ప్రదానం చేయనున్నారు.

## వారణాసి సినిమా ఓ గొప్ప అనుభవం: ప్రియాంకా చోప్రా

మహేశ్‌బాబు హీరోగా రాజమౌళి దర్శకత్వంలో రూపొందుతున్న సినిమా 'వారణాసి'. ఈ చిత్రంలో ప్రియాంకా చో ప్రా, పృథ్వీరాజ్ సుకుమారన్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్నారు. కేఎల్ నారాయణ, ఎస్ఎస్ కార్తికేయ నిర్మిస్తున్న ఈ సినిమా 2027 ఏప్రిల్ 7న రిలీజ్ కానుంది. ఇటీవల ఈ సినిమా చిత్రీకరణ జార్జియాలో ప్రారంభమైంది. నెక్ట్స్ షెడ్యూల్‌ను అంటార్కిటికాలో ప్లాన్ చేశారని సమాచారం. కాగా, గత ఏడాది సెప్టెంబరులో ఈ సినిమా చిత్రీకరణ కెన్యాలోని ఫారెస్ట్ లొకేషన్స్‌లో జరిగిన విషయం గుర్తుండే ఉంటుంది. ఆ షూటింగ్ అనుభవాలను ప్రియాంకా షేర్ చేసుకున్నారు. "కెన్యాలోని అడవుల్లో షూటింగ్ చేయడం గొప్ప అనుభూతి. వేల సంఖ్యలో అడవి జీవులు వలస వెళ్తున్న సమయంలో వాటి మధ్య మేం ఉన్నప్పుడు షూటింగ్ జరిగింది. ఆ జంతువుల ముఖాలను అంత దగ్గరగా చూస్తుంటే ఈ భూమ్మీద అవి ఎన్నో ఏళ్లుగా మనుగడ సాగిస్తున్నాయని అర్థమైంది. ప్రకృతి ఎంత శక్తిమంతమైనదో, జీవపరిణామ క్రమం ఎంత గొప్పదో వాటిని చూస్తే తెలిసింది" అని ఓ పాడ్ కాస్ట్ ఇంటర్వ్యూలో చెప్పారు ప్రియాంకా చోప్రా.



# తొలిసారి బికినీ వేశా..

హీరోయిన్ ప్రియమణి సినీ జర్నీ తెలుగు సినిమాతోనే మొదలైంది. ఎవరే అతగాడు (2003) మూవీతో కథానాయికగా మారింది. తెలుగు, తమిళ, మలయాళ, కన్నడ, హిందీ భాషల్లో అనేక సినిమాలు చేసింది. తక్కువ కాలంలోనే స్టార్ హీరోయిన్ స్టేటస్ అందుకుంది. తాజాగా సరస్వతి సినిమాతో పలకరించింది.

## డైరెక్టర్ అడగడంతో..

ఈ మూవీ ప్రమోషన్స్‌లో భాగంగా ఓ ఇంటర్వ్యూకి హాజరైంది ప్రియమణి. ఈ సందర్భంగా కెరీర్ తొలినాళ్లలో బికినీ ధరించిన ఘటన గురించి గుర్తు చేసుకుంది. ప్రియమణి మాట్లాడుతూ.. స్విమ్మింగ్ పూల్ దగ్గరకు చీర కట్టుకుని వెళ్లం కదా.. ఏది కంఫర్ట్‌గా ఉంటే ఆ దుస్తులే ధరిస్తాం. ద్రోణ సినిమాలో స్విమ్ సూట్ వేసుకోమని డైరెక్టర్ అడిగాడు.

## కరీనా కపూర్‌లా..

టషన్ మూవీలో కరీనా కపూర్‌లా నిన్ను డిఫరెంట్‌గా చూపించాలనుకుంటున్నా అన్నాడు. ఇంతవరకు నేను ఎప్పుడూ స్విమ్‌సూట్ వేయలేదు, ఒకసారి ట్రై చేద్దాం అని ఓకే చెప్పాను. ఆ తర్వాత చాలా కామెంట్స్ వచ్చాయి. ట్రోలింగ్స్ జరిగాయి. నటిగా ఉన్నప్పుడు పరిస్థితి డిమాండ్ చేస్తే అలాంటి డ్రెస్ వేసుకోక తప్పదు. కానీ మన సౌకర్యం కూడా చూసుకోవాలి. ఇప్పుడు అడిగితే మాత్రం నేను కచ్చితంగా చేయనని చెప్పేస్తాను అని ప్రియమణి పేర్కొంది.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY KANDI RAMACHANDRA REDDY, printed at SRI MATHA PRINTERS, H.NO.1-1-562/1, GANDHI NAGAR, HYDERABAD. Telangana- 500020,
PUBLISHED AT 43/A, MLA Colony, Road No. 12, Banjara Hills, Hyderabad. Telangana- 500034. RNI NO : APTEL/2003/09316. PH NO : 7436939999, Email : mahaapatrika@gmail.com

## విద్య, వైద్య రంగాల అభివృద్ధిపై ప్రత్యేక చర్యలు

**మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్**



**మంచిర్యాల, మహా :** తెలంగాణ ప్రభుత్వం విద్య, వైద్య రంగాల అభివృద్ధిపై ప్రత్యేక చర్యలు తీసుకుంటుందని మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. శనివారం లక్సెట్టిపేట మండల కేంద్రంలో గల కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాన్ని ఆకస్మికంగా సందర్శించి తరగతి గదులు, వంటశాల, హాజరు పట్టికలు, పాఠశాల పరిసరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ అన్ని ప్రభుత్వ పాఠశాలలలో సకల సదుపాయాలు కల్పించి విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించే దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని తెలిపారు. మధ్యాహ్న భోజనంలో మెనూ ప్రకారం పౌష్టికాహారం, శుద్ధమైన త్రాగునీటిని అందిస్తూ విద్యార్థుల ఆరోగ్యం మరలా ప్రత్యేక శ్రద్ధ వహించడం జరుగుతుందని తెలిపారు. ప్రతి పాఠశాలలో త్రాగునీరు, విద్యుత్, విద్యార్థినీ విద్యార్థులకు వేరువేరుగా మూత్రశాలలు, అదనపు గదులు, ప్రహరీ గోడ ఇతర సదుపాయాలు కల్పించి నిష్ణాతులైన ఉపాధ్యాయులచే విద్యా బోధన అందించడం జరుగుతుందని తెలిపారు. అనంతరం మండల కేంద్రంలోని 30 పడకల ప్రభుత్వ ఆసుపత్రిని సందర్శించి వార్డులు, మందుల నిల్వలు, రోగులకు కల్పిస్తున్న సౌకర్యాలు, మార్చురీ గది నిర్మాణ పనులను పరిశీలించారు. ఆసుపత్రికి వచ్చే ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని, వైద్యులు, సిబ్బంది విధుల పట్ల సమయపాలన పాటించాలని తెలిపారు. ఆసుపత్రి లోని రోగులతో మాట్లాడుతూ కల్పిస్తున్న సౌకర్యాల పై వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమాన్ని పటిష్టంగా చేపట్టాలి


**మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్**



**బెల్లంపల్లి ,మహా:** ప్రజాపాల ప్రణాళిక కార్యక్రమాన్ని పటిష్టంగా నిర్వహించాలని మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ పేర్కొన్నారు .శనివారం నాడు బెల్లంపల్లి పట్టణంలోని పలు వార్డులలో ఆయన క్షేత్రస్థాయిలో ప్రజాపాలన ప్రగతిప్రణాళిక కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా బెల్లంపల్లి మున్సిపల్ పరిధిలోని 17, 31 ,32 ,33 వార్డులలో చేపట్టిన ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ దావ స్వాతి రమేష్ బాబు, వైస్ చైర్మన్ రాగంసెట్టి సత్యనారాయణ లతోపాటు మున్సిపల్ కమిషనర్ సంపత్ పాల్గొన్నారు.అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వం మార్చి ఆరవ తేదీ నుండి జూన్ 12వ తేదీ వరకు 99 రోజుల కార్యక్రమాన్ని రూపొందించడం జరిగిందని, క్షేత్రస్థాయిలో ప్రభుత్వం రూపొందించిన కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు ప్రజా ప్రతినిధులు అధికారులు దృష్టి సారించాలని దిశా నిర్దేశం చేశారు. కార్యక్రమంలో భాగంగా పట్టణ మరియు గ్రామాలలో ప్రధానంగా పారిశుధ్యం పై దృష్టి సారించాలని అదేవిధంగా అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో పెండింగ్లో ఉన్న ఫైళ్లను త్వరితగతిన పరిష్కరించాలని సూచించారు. అదేవిధంగా ప్రజాసంక్షేమం, విద్య ,ఆరోగ్యం వ్యవసాయం, చిన్నారుల సంక్షేమం, యువత,మహిళల అభివృద్ధి పర్యావరణ పరిరక్షణ తదితర అంశాలపై సంబంధిత అధికారులు దృష్టి సారించి ప్రణాళికలు రూపొందించుకుని దశలవారీగా పూర్తిచేయాలని ఆదేశించారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులసంఖ్య ను గణనీయంగా పెంచేందుకు అన్నిశాఖల అధికారులు సమన్వయంతో కృషి చేయాలని పిలుపునిచ్చారు. ప్రస్తుతం వేసవికాలం సమీపించిన దృష్ట్యా నీటి ఎద్దడి లేకుండా త్రాగునీటికి ఇబ్బంది పడకుండా సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి త్రాగునీటి సమస్యలను పరిష్కరించాలని సూచించారు. 17వ వార్డు పరిధిలోని అర్బన్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని క్షేత్రస్థాయిలో పరిశీలించి వైద్య సిబ్బంది సకాలంలో విధులకు హాజరు కావాలని, మందుల కొరత లేకుండా రోగులకు నాణ్యమైన చికిత్సలు అందించేలా కృషి చేయాలని సూచించారు. అనంతరం రాంనగర్ బస్తీలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో చేపడుతున్న నిర్మాణ పనులను పరిశీలించి త్వరితగతిన పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులతో పాటు ఆయా వార్డు సభ్యులు పాల్గొన్నారు.

### జేసిబి యూనియన్ ఆధ్వర్యంలో ఘనంగా మున్సిపల్ చైర్మన్

## దొంతగాని శ్రీనివాస్ గౌడ్ పుట్టినరోజు వేడుకలు



**హుజూర్ నగర్ మహా:** హుజూర్ నగర్ మున్సిపల్ చైర్మన్ దొంతగాని శ్రీనివాస్ గౌడ్ పుట్టినరోజు సందర్భంగా జేసిబి యూనియన్ ఆధ్వర్యంలో షఫీ దొంతగాని శ్రీనివాస్ గౌడ్ తో కేక్ కట్ చేయించి పుట్టినరోజు వేడుకలు నిర్వహించారు అనంతరం ఆయనను శాలువాలతో సన్మానించి కేక్ తినిపించి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం నూతన మున్సిపల్ వైస్ చైర్మన్ గా ఎన్నికైన తన్వీరు మల్లికార్జున్ ను పూలమాలతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న 25వ వార్డు కౌన్సిలర్ మరియు కాంగ్రెస్ పార్టీ ఫ్లోర్ లీడర్ కోతి సంపత్ రెడ్డి, 19వ వార్డు కౌన్సిలర్ వల్లపు దాసు కృష్ణగౌడ్, తదితరులను జెసిబి అసోసియేషన్ సభ్యులు ఘనంగా సన్మానించారు.


# రంజాన్ పండుగ వేళ

**పేద ముస్లింలకు నిత్యవసర వస్తువుల పంపిణీ చేసిన బిఎల్ఆర్**



**కుషాయిగూడ, మహా :** డాక్టర్ ఏఎస్ రావు నగర్ డివిజన్ లోని మజీద్ వద్ద రంజాన్ పండుగను పురస్కరించుకొని పేద ముస్లింలకు నిత్యావసర వస్తువులను ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి పంపిణీ చేశారు. పేద ముస్లింలను ఆదుకోవడమే తమ లక్ష్యమని ఈ సందర్భంగా లక్ష్మారెడ్డి అన్నారు. రంజాన్ పండుగ ముస్లింలకు గొప్ప పండుగ అని ఆయన అన్నారు. రంజాన్ పండుగను ముస్లింలందరూ ఉపవాస దీక్షలతో ఘనంగా జరుపుకుంటారని అందరికీ రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. ముస్లింలకు ప్రభుత్వం నుండి వచ్చే సంక్షేమ పథకాలను అందించేందుకు తన వంతు కృషి చేస్తానని బిఎల్ఆర్ అన్నారు. రియాజ్ మాట్లాడుతూ పేద ముస్లింలకు ఎల్లవేళలా ఎలాంటి ఆపద్బాంధవుడిలా ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి అందుబాటులో ఉంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ ఏఎస్ రావు నగర్ డివిజన్ అధ్యక్షుడు కాసం మహిపాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# వేం నరేందర్ రెడ్డిని కలిసిన పావని



**కుషాయిగూడ, మహా :** రాజ్యసభకు ఏకగ్రీవంగా ఎన్నికైన తెలంగాణ ప్రభుత్వ మాజీ సలహాదారులు వేం నరేందర్ రెడ్డిని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకురాలు, ఏఎస్ రావు నగర్ డివిజన్ మాజీ కార్పొరేటర్ పజ్జూరి పావని మణిపాల్ రెడ్డి శనివారం కలిశారు. ఈ సందర్భంగా పుష్పగుచ్ఛాన్ని ఇచ్చి అభినందనలు తెలిపారు. భవిష్యత్తులో వేం నరేందర్ రెడ్డి మరిన్ని ఉన్నతమైన పదవులు ఆశించాలని పావని మణిపాల్ రెడ్డి ఆకాంక్షించారు ప్రజాసమస్యలు పరిష్కరించడానికి తన వంతు శక్తి మేరకు పనిచేస్తానని వేం నరేందర్ రెడ్డి అన్నారు ఏఎస్ రావు నగర్ డివిజన్ లో సమస్యల పరిష్కారానికి అభివృద్ధికై తన వంతు కృషి చేస్తానని పావని మణిపాల్ రెడ్డికి ఈ సందర్భంగా వేం నరేంద్ర రెడ్డి హామీ ఇచ్చారు అనునిత్యం ప్రజల మధ్య ఉండి ప్రజల కోసం పనిచేస్తున్న పావని మణిపాల్ రెడ్డిని వేమన్న అభినందించారు ప్రజల కోసం పనిచేసే నాయకులను ప్రజల గుండెల్లో దాచుకుంటారని వేం నరేందర్ రెడ్డి అన్నారు.

## బెల్లంపల్లిలో ఘనంగా ప్రపంచ మహిళా దినోత్సవం

**కలం స్నేహం వ్యవస్థాపకులు శ్రీమాన్ గోపాల్ ఆచార్య ఆధ్వర్యంలో**



**బెల్లంపల్లి, మహా:** బెల్లంపల్లి పట్టణంలోని కలం స్నేహం వ్యవస్థాపకులు శ్రీమాన్ గోపాల్ ఆచార్య ఆధ్వర్యంలో ప్రపంచం మహిళా దినోత్సవ వేడుకలను శనివారం నాడు ఆయన నివాసంలో ఘనంగా నిర్వహించారు.బెల్లంపల్లి పట్టణంలోనీ కలం స్నేహం కో ఆర్డినేట్ సామ మనీషా నివాసంలో కలం స్నేహం గౌరవ అధ్యక్షురాలు హన్మాండ్ల రమాదేవి,అధ్యక్షురాలు కొత్తపల్లి సమత ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. బాబు క్యాంప్ బస్తి మహిళ కౌన్సిలర్ నీలి హారిక ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మహిళలు ఎక్కువసంఖ్యలో పాల్గొని తాము స్వయంగా రూపొందించిన ఫ్యాషన్ డ్రెస్ షోలు ప్రదర్శించారు .అనంతరం, నృత్యాలు, ఆట పాటలతో కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.ఈ కార్యక్రమంలో సంయుక్త కార్యదర్శి ఎస్. బబిత, సహా కార్యనిర్వాహక కార్యదర్శి రాంపెల్లి పద్మజ, సహా సాంస్కృతిక కార్యదర్శి రాచర్ల దీపిక, మహిళా వైశ్య సంఘం అధ్యక్షురాలు బాల విజయ, కార్యదర్శి సింధుజ తదితరులు పాల్గొన్నారు.

## ఇసుకను అక్రమంగా తరలిస్తున్న 10 లారీల పట్టివేత

**జైపూర్ ఏసిపి వెంకటేశ్వర్ రావు**



**జైపూర్ / మంచిర్యాల, మహా:** ఇసుకను అక్రమంగా తరలిస్తున్న 10 లారీలను అదుపులోకి తీసుకున్నట్లు జైపూర్ ఎసిపి వెంకటేశ్వర్ రావు వెల్లడించారు. శనివారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 4 మార్చి 2026 నాడు చెన్నూరు ఇసుక క్వారీ నుండి ఆన్ లైన్ డెలివరీ కోసం అనుమతులు తీసుకొని అదే బిల్లుతో 5 మార్చి నాడు ఇసుకను తరలిస్తున్న పది లారీల డ్రైవర్ల పై కేసును నమోదు చేసినట్లు ఆయన వెల్లడించారు. ఇసుక కొరకు దర ఖాస్తు చేసుకున్న అడ్రస్ నిర్మల్ జిల్లా వెంగ్వ పేట గ్రామంలో డెలివరీ చేయవలసి ఉండగా, ఆ ఇసుకను జైపూర్ ఎస్టిపిపి వద్ద అన్లోడ్ చేస్తున్నట్లు తమకు చెన్నూరు ఇసుక క్వారీ ఇన్చార్జి బెల్లంకొండ భార్గవ్ రావు ఫిర్యాదు చేసినట్లు వెల్లడించారు. దానితో పది లారీలను వాటి డ్రైవర్లను అదుపులోకి తీసుకున్నట్లు ఆయన పేర్కొన్నారు. అధిక ధరకు అమ్ముకోవడానికి వీరు ప్రయత్నం చేసినట్లు ఆయన అన్నారు. గోదావరి పరివాహక ప్రాంతంలో అక్రమంగా ఇసుకను తరలిస్తే ఎవరిని ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. అంతేకాకుండా ఒక కాడ డంపు చేసే ఇసుకను మరొక కాడ పోసే వారిపై కఠిన చర్యలు తప్పవని జైపూర్ ఏసిపి వెంకటేశ్వర్ రావు వెల్లడించారు.

## ఏరియా వర్క్ షాప్ లో మహిళా దినోత్సవం వేడుకలు



**మందమర్రి, మహా :** మందమర్రి ఏరియా వర్క్ షాప్ లో శనివారం అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. శనివారం సింగరేణి గుర్తింపు సంఘం (ఏఐటీయూసీ) పిట్ కార్యదర్శి శర్మ ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా శర్మ మాట్లాడుతూ మహిళలు వంటిల్లుకే పరిమితం కాకుండా ఉద్యోగాలను సైతం చేస్తూ అబ్బుర పరుస్తున్నారని అన్నారు. మహిళలు లేకుంటే మానవ మనుగడ లేదని కీర్తించారు. వర్క్ షాప్ మహిళా కార్మికులతో కేక్ కట్ చేసి సంబరాలు నిర్వహించారు. అనంతరం పలువురికి బహుమతులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐటియుసి మందమర్రి బ్రాంచి కార్యదర్శి సలేంద్ర సత్యనారాయణ, డివైజియం ధూప్ సింగ్, పెద్దపల్లి బాలయ్య, తోట కుమారస్వామి తదితరులు ఉన్నారు.

## హెచ్‌పివి టీకా మీ బిడ్డ భవిష్యత్తుకు రక్షణ కవచం

**సూర్యాపేట జిల్లాలో మార్చి 8 నుంచి హెచ్‌పీవీ టీకా కార్యక్రమం ప్రారంభం**



**సూర్యాపేట జిల్లా మహా:** సూర్యాపేట జిల్లాలో బాలికల ఆరోగ్య రక్షణ కోసం హెచ్‌పీవీ టీకాకరణ కార్యక్రమాన్ని ఈ నెల 8వ తేదీ నుంచి ప్రారంభిస్తున్నట్లు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డా. పెండెం వెంకట రమణ తెలిపారు. 14 సంవత్సరాలు పూర్తిచేసి 15 సంవత్సరాలు పూర్తి కాని బాలికలకు ఈ టీకాను అందించనున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమాన్ని సూర్యాపేట జిల్లా ఆసుపత్రి, కోదాడ, హుజూర్‌నగర్, తుంగతుర్తి ఏరియా ఆసుపత్రులు నడిగూడెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ప్రారంభించనున్నట్లు వెల్లడించారు. జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డా. కె. కోటి రత్నం మాట్లాడుతూ, జిల్లాలో హెచ్‌పీవీ వ్యాక్సినేషన్ కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేసి అమలు చేస్తున్నామని తెలిపారు. సూర్యాపేట జిల్లా మొత్తం జనాభా 11,96,409 ఉండగా, అందులో 14 సంవత్సరాలు నిండి 15 సంవత్సరాలు పూర్తి కాని బాలికలు సుమారు 1 శాతం ఉంటారని అంచనా వేయగా, మొత్తం 11,964 మందికి ఈ టీకా అవసరం ఉంటుందని చెప్పారు. నిర్దిష్ట ప్రమాణాలను పాటిస్తూ శిక్షణ పొందిన వైద్య సిబ్బంది ద్వారా టీకా ఇవ్వనున్నట్లు వివరించారు. స్త్రీలలో ప్రాణాంతకంగా మారే గర్భకోశ కంఠపు క్యాన్సర్ (సర్వైకల్ క్యాన్సర్) నివారణ కోసం ఈ హెచ్‌పీవీ (హ్యూమన్ పాపిలోమావైరస్) వ్యాక్సిన్‌ను ప్రభుత్వం ఉచితంగా అందిస్తున్నట్లు తెలిపారు. అందువల్ల తల్లిదండ్రులు తమ బాధ్యతగా 2011 ఏప్రిల్ 01 నుండి 2012 మార్చి 31 మధ్య జన్మించిన అర్హత గల బాలికలను సంబంధిత వ్యాక్సినేషన్ కేంద్రాలకు తీసుకువెళ్లి టీకా ఇప్పించాలని విజ్ఞప్తి చేశారు. టీకా తీసుకునే సమయంలో బాలికలు జనన తేదీ నిర్ధారణకు సంబంధించిన ఏదైనా గుర్తింపు కార్డును తీసుకురావాలని, తల్లి లేదా తండ్రి సమక్షంలో సమ్మతి పత్రం సమర్పించి టీకా తీసుకోవాలని సూచించారు. అలాగే వచ్చే నెల నుంచి జిల్లాలోని అన్ని గ్రామీణ, పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల ద్వారా కూడా ఈ టీకా అందుబాటులోకి తీసుకురానున్నట్లు తెలిపారు. టీకా గురించి ఎలాంటి అపోహలు లేదా సందేహాలు ఉంటే సమీప ఆరోగ్య కేంద్ర సిబ్బంది, ఆరోగ్య కార్యకర్తలు, ఆశా కార్యకర్తలను సంప్రదించాలని సూచించారు. ఈ కార్యక్రమం విజయవంతం కావడానికి ప్రజాప్రతినిధులు, ఉపాధ్యాయులు, స్థానిక నాయకులు, ఎన్‌జీఓ సభ్యులు, వివిధ శాఖల అధికారులు, స్వయం సహాయక సంఘ సభ్యులు, అంగన్‌వాడీ కార్యకర్తలు వైద్య సిబ్బందికి సహకరించి జిల్లాలో 100 శాతం టీకా జరిగేలా కృషి చేయాలని పిలుపునిచ్చారు.

## ఉప్పల్ లో అంతర్జాతీయ మహిళ దినోత్సవ వేడుకలు

**పాల్గొన్న ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి,**
**మల్కాజిగిరి పార్లమెంట్ బీఆర్ఎస్ పార్టీ ఇంచార్జ్ రాగిడి లక్ష్మారెడ్డి**



**కుషాయిగూడ, మహా :** అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా శనివారం ఉప్పల్ డివిజన్ బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు మేకల మధుసూదన్ రెడ్డి. ఆధ్వర్యంలో మహిళలు దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా మహిళలకు కానుకలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి మల్కాజిగిరి పార్లమెంట్ బీఆర్ఎస్ పార్టీ ఇంచార్జ్ రాగిడి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాలలో అభివృద్ధి చెందుతూ సమాజానికి ఆదర్శంగా నిలవాలన్నారు అలాగే మహిళలు రాజకీయాల్లో కూడా చురుకుగా పాల్గొని నాయకత్వ స్థానాలకు ఎదగాలని ఆకాంక్షించారు. మహిళల అభివృద్ధి కోసం భవిష్యత్తులో కూడా ఇలాంటి మంచి కార్యక్రమాలు మరింతగా నిర్వహిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక మహిళలు ఉప్పల్ డివిజన్ బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## ఇసుకను అనుమతులు లేకుండా తరలిస్తే చట్టపరమైన చర్యలు

**వలిగొండ ఎస్సై యుగంధర్ గౌడ్**

**వలిగొండ, మహా :** ప్రభుత్వ అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుకను తరలిస్తే చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని వలిగొండ ఎస్సై యుగంధర్ గౌడ్ అన్నారు శుక్రవారం అక్రమంగా ఇసుకను తరలిస్తున్న వేములకొండ గ్రామానికి చెందిన పులి పలుపుల శివ మండి పెల్లి రమేష్.లు అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తున్నారన్న సమాచారంతో అందడంతోరెండు ట్రాక్టర్లను పట్టుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్సై యుగంధర్ గౌడ్ తెలిపారు

## సూర్యాపేట జిల్లా మహిళలందరికీ అంతర్జాతీయ మహిళా దినోత్సవ శుభాకాంక్షలు

**సూర్యాపేట జిల్లా ఎస్ పి కె. నరసింహ**



**సూర్యాపేట జిల్లా మహా:** అంతర్జాతీయ మహిళా దినోత్సవం సంధర్భంగా సూర్యాపేట జిల్లా ఎస్పి నరసింహ సూర్యాపేట జిల్లా లోని మహిళలందరికీ జిల్లా పోలీస్ శాఖ తరపున హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేయడం జరిగింది. ఈ సంధార్భంగా జిల్లా ఎస్పీ గారు మాట్లాడుతూ మహిళలకు గౌరవం మరియు సమాన అవకాశాలు లభించే సమాజంలోనే నిజమైన అభివృద్ధి సాధ్యమవుతుందని తెలిపారు. నేటి తరం మహిళలు విద్య, ఉద్యోగం, వ్యాపారం, క్రీడలు, రాజకీయ రంగాల్లో తమ ప్రతిభను చాటుతూ సమాజ పురోగతిలో కీలక పాత్ర పోషిస్తున్నారని అన్నారు. మహిళలు అన్ని రంగాల్లో విజయాలు సాధిస్తూ దేశ అభివృద్ధిలో భాగస్వాములు అవుతున్నారని పేర్కొన్నారు. దేశ నిర్మాణంలో మరింత మంది మహిళలు ఆత్మవిశ్వాసం, పట్టుదల మరియు సంకల్పంతో ముందుకు రావాలని ఆకాంక్షించారు.మహిళల భద్రత మరియు రక్షణ విషయంలో పోలీస్ శాఖ ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటుందని స్పష్టం చేశారు. మహిళలపై జరిగే నేరాలను అరికట్టేందుకు జిల్లా పోలీస్ శాఖ ప్రత్యేక చర్యలు తీసుకుంటోందని తెలిపారు. అవసరమైనప్పుడు మహిళలు నిర్భయంగా పోలీసులను సంప్రదించాలని, వారి ఫిర్యాదులను వేగంగా పరిష్కరించేందుకు పోలీస్ శాఖ కట్టుబడి ఉందని భరోసా ఇచ్చారు.మహిళల భద్రత కోసం ప్రభుత్వం మరియు పోలీస్ శాఖ అనేక అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాయని తెలిపారు. ముఖ్యంగా యువతలో అవగాహన పెంపొందించేందుకు పాఠశాలలు, కళాశాలలు మరియు గ్రామాల్లో షీ టీమ్, కళ జాత బృందం ద్వారా ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని చెప్పారు. మహిళలు తమ హక్కులు, చట్టాలు మరియు భద్రతకు సంబంధించిన సేవలపై అవగాహన కలిగి ఉండాలని ఎస్పీ సూచించారు. ప్రతి మహిళా తన హక్కులపై అవగాహనపెంపొందించుకుని ధైర్యంగా ముందుకు సాగుతూ తన లక్ష్యాలను సాధించాలని ఎస్పీ పిలుపునిచ్చారు.

### మహిళకు గౌరవం ఉన్నచోటే

# నిజమైన నాగరికత ఉంటుంది

- **మహిళ ఒక కుటుంబాన్ని మాత్రమే కాదు, దేశ భవిష్యత్తు మార్చగలదు**
- **సమాజమంతా మహిళలకు మద్దతుగా నిలవాలి: కయిత్రి కొమ్ము వరలక్ష్మి**



మహిళ కేవలం ఒక వ్యక్తి కాదుఆమె ఒక శక్తి, ఒక స్వరం, ఒక విప్లవం. మహిళను గౌరవించడం అంటే మన సంస్కృతిని గౌరవించడం. ఎందుకంటే ఆమె గర్భంలోనే భవిష్యత్తు పెరుగుతుంది, ఆమె చేతుల్లోనే సమాజం రూపుదిద్దుకుంటుంది.అవకాశం కలిగితే మహిళ అద్భుతాలు సృష్టిస్తుంది. అడ్డంకులు వచ్చినా, అపహాస్యం ఎదురైనా ఆమె తల వంచదు. కష్టాలు వచ్చినప్పుడు కన్నీళ్లు తుడుచుకుంటూ ముందుకు సాగుతుంది. ఆమెను బలహీనంగా చూసే దృష్టికే బలహీనత ఉంది. ఆమెను అణచివేయాలనుకునే చేతులే నిజంగా బలహీనమైనవి.

ఒకప్పుడు ఇంటి గడప దాటకూడదని చెప్పిన మహిళలు నేడు ఆకాశాన్ని ఛేదిస్తూ అంతరిక్షంలోకి చేరుకున్నారు. చదువు వద్దన్నా శాస్త్రవేత్తలుగా ఎదిగారు. నాయకత్వం ఇవ్వనన్నా సమాజానికి దిశానిర్దేశం చేసే నాయకురాలులుగా నిలిచారు. మహిళ సంకల్పం ముందు అడ్డంకులు కరిగిపోయాయి.చరిత్రలో ఎన్నో సందర్భాల్లో మహిళలు అసాధారణ ధైర్యాన్ని నిరూపించారు. మహిళలకు సమాన హక్కులు ఇవ్వడం దానం కాదుఅది రాజ్యాంగం ఇచ్చిన హామీ. విద్య, ఉపాధి, ఆస్తి హక్కు, నిర్ణయాధికారం వంటి హక్కులు మహిళల అభివృద్ధికి పునాది. చదువుకున్న మహిళ ఒక కుటుంబాన్ని మాత్రమే కాదు, తరాలను మార్చగలదు. మహిళ బలపడితే కుటుంబం బలపడుతుంది.కుటుంబం బలపడితే దేశం బలపడుతుంది.

భారతీయ సంస్కృతిలో మహిళలకు విశిష్ట స్థానం ఉంది. వేదకాలం నుంచే మహిళలు విద్యలో, తత్వ చింతనలో భాగస్వాములయ్యారు. కానీ కాలక్రమంలో కొన్ని సామాజిక ఆచారాలు మహిళలను ఇంటి గడపలకే పరిమితం చేశాయి. బాల్య వివాహాలు, అక్షరాస్యత లోపం, ఆస్తి హక్కుల సమస్యలు మహిళా పురోగతిని అడ్డుకున్నాయి.ఇప్పటి మహిళ కుటుంబ బాధ్యతలను మోస్తూనే ఉద్యోగ రంగంలో అద్భుతాలు సృష్టిస్తోంది. ఉపాధ్యాయురాలిగా జ్ఞానాన్ని పంచుతుంది, వైద్యురాలిగా ప్రాణాలను కాపాడుతుంది, శాస్త్రవేత్తగా ఆవిష్కరణలు చేస్తుంది, పోలీస్ అధికారిగా న్యాయాన్ని కాపాడుతుంది, నాయకురాలిగా సమాజానికి మార్గనిర్దేశం చేస్తుంది. గ్రామీణ ప్రాంతాల్లో మహిళలు స్వయం సహాయక సంఘాల ద్వారా ఆర్థికంగా ఎదిగి కుటుంబాలను నిలబెడుతున్నారు.అయితే మహిళలు ఇంకా ఎన్నో సవాళ్లను ఎదుర్కొంటున్నారు. సమాజం రాకెట్ వేగంతో అభివృద్ధి చెందుతున్న ఈ కాలంలో కూడా మహిళలపై హింస, లింగ వివక్ష, వేతన అసమానత వంటి సమస్యలు ఇంకా కొనసాగుతున్నాయి. ఇది ఒక వ్యక్తి సమస్య కాదు — సమాజ సమస్య. మహిళపై జరిగే ప్రతి అన్యాయం మనందరి బాధ్యతను గుర్తు చేస్తుంది.లింగ వివక్ష భావన మహిళను బలహీనురాలిగా చూపుతుంది. చట్టాలపై అవగాహన లేకపోవడం కూడా సమస్యలను పెంచుతుంది. మహిళలపై జరిగే వేధింపులు బాధితురాలిపై తీవ్రమైన మానసిక ప్రభావం చూపుతాయి. ఆత్మవిశ్వాసం తగ్గిపోవచ్చు, చదువు లేదా ఉద్యోగం మధ్యలో ఆగిపోవచ్చు. మహిళ భయపడే సమాజం ఎప్పటికీ అభివృద్ధి చెందదు.సమాజంలో మార్పు రావాలంటే మహిళలపై గౌరవం పెంపొందించాలి. లింగ సమానతపై పాఠశాలలు, కళాశాలలు, కార్యాలయాల్లో అవగాహన కార్యక్రమాలు చేపట్టాలి. చట్టాలపై స్పష్టమైన సమాచారం అందించాలి. బాధితురాలు ధైర్యంగా ఫిర్యాదు చేసే వాతావరణం కల్పించాలి. సమాజమంతా మహిళలకు మద్దతుగా నిలవాలి. మహిళా స్వరం వినిపించినప్పుడు సమాజం వినాలి. మహిళలు సాధించిన విజయాలు ఎన్నో ఉన్నాయి. 2007లో తొలి మహిళా రాష్ట్రపతిగా ప్రతిభా పాటిల్ ప్రమాణస్వీకారం చేశారు. ఇందిరా గాంధీ శక్తివంతమైన నాయకత్వంతో భారత రాజకీయాల్లో ప్రత్యేక గుర్తింపు సాధించారు. ఫాతిమా బీవీ భారతదేశ తొలి మహిళా సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా చరిత్ర సృష్టించారు. రాష్ట్రపతి నుంచి గ్రామ సర్పంచి వరకు, అంతరిక్షం నుంచి క్రీడా మైదానం వరకు ప్రతి రంగంలోనూ మహిళలు ప్రతిభ చాటుతున్నారు.ఆడపిల్ల అడుగేస్తే కుటుంబం ఎదుగుతుంది. ఆమె నాయకత్వం వహిస్తే దేశం ఎదుగుతుంది.మహిళలను గౌరవించండి మంచి సమాజాన్ని నిర్మించండి.

### మహిళా దినోత్సవం సందర్భంగా కౌన్సిలర్

## అట్లూరి మంజులకు ఘన సన్మానం



**హుజూర్ నగర్ మహా:** సూర్యాపేట జిల్లా హుజూర్ నగర్ పట్టణంలోని 23వ వార్డులోని ఉత్తమ్ పద్మావతి నగర్ కు చెందిన మహిళలు మహిళా దినోత్సవం సందర్భంగా 23 వ వార్డు కౌన్సిలర్ అట్లూరి మంజుల ఘనంగా సన్మానించారు. కాలనీ వాసులు ఆమెకు పూలమాలలు వేసి ఘనంగా శాలువాలతో సన్మానించారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ అట్లూరి మంజుల మాట్లాడుతూ మహిళా మణులందరికీ మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేస్తూ హుజూర్ నగర్ మున్సిపాలిటీలో 23వ వార్డును ఆదర్శ వార్డుగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తానని తనపై ఆదరాభిమానాలు చూపిస్తున్న వార్డు ప్రజలందరికీ కృతజ్ఞతలు తెలియజేశారు.

## వ్యవసాయ సాంకేతిక పరిజ్ఞానం పై అవగాహన సదస్సు

**ఏరువాక శాస్త్రవేత్త డాక్టర్ శ్రీలత**
**వలిగొండ ఏవో అంజని దేవి**

**వలిగొండ, మహా :** వ్యవసాయ సాంకేతిక పరిజ్ఞానంపై ఏరువాక శాస్త్రవేత్త డాక్టర్ శ్రీలత వలిగొండ ఏవో అంజనిదేవి శనివారం వేములకొండ రైతు వేదికలో అవగాహన కల్పించారు వారు మాట్లాడుతూ పత్తి పంటలు వినియోగం పచ్చి రొట్టె ఎరువులు ప్రయోజనాల గురించి రైతులకు అవగాహన కల్పించారు ఈ కార్యక్రమంలో వెంకటాపురం సర్పంచ్ కళమ్మ యాదయ్య వేములకొండ ఉపసర్పంచ్ సాయికుమార్ ఏవోలు భగీరథ సాయి రైతులు పాల్గొన్నారు